
దర్శి డివిజన్‌లోని సాగర్ ప్రధాన కాలువ 101 మైలు వద్ద ఇంకా పని పెండింగ్‌లో ఉండటంతో నీరు గుండ్లకమ్మలోకి వెళ్లకుండా గేట్లు అమర్చుతున్న అధికారులు

సాగునీటి అవసరాలకు సాగర్ జలాలొస్తున్నాయి. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తోంది. గత అనుభవాల దృష్ట్యా ఊహించిన దాని కన్నా చాలా ముందుగానే ఈ ఏడాది సాగర్ నీటి విడుదల జరిగింది. ఈనేపథ్యంలో కాలువల్లో చేపట్టిన పనులపై ఆ శాఖ అధికారులు గందరగోళ పడుతున్నారు. మేజర్లు, మైనర్‌ల మరమ్మతులు ఎలా ఉన్నా కనీసం ప్రధాన, బ్రాంచి కాలువల్లో పనులు అయినా పూర్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఐదారు మాసాల క్రితం వచ్చిన రాష్ట్ర ప్రకృతి విపత్తుల ఫండ్ (ఎస్‌డీఎంఎఫ్) కింద చేపట్టిన పనులు తప్ప ఇటీవల ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ (ఓఅండ్ఎం) కింద మంజూరైన పనులు చేయడం సాధ్యం కాక తలపట్టుకుంటున్నారు.

ఉరుకులు.. పరుగులు

- ముందుగానే సాగర్ నీటి సరఫరా
- ఇప్పటికే డ్యామ్ నుంచి విడుదల
- తొలుత బుగ్గవాగుకు, అనంతరం జిల్లాలోకి..
- నేడు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- చాలాచోట్ల సాగుతున్న కాలువల మరమ్మతులు
- ప్రధానమైనవి పూర్తికి కసరత్తు
- గందరగోళానికి గురవుతున్న అధికారులు

ఒంగోలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో సుమారు 4.34 లక్షల ఎకరాల ఆయకట్టు సాగర్ కాలువల పరిధిలో ఉంది. అందులో బాపట్ల జిల్లాలోనిది 1.71 లక్షల ఎకరాలు కాగా, మిగిలినది ప్రస్తుత ప్రకాశం జిల్లాలోనిది. ఉమ్మడి జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల్లో సాగర్ నీటి ఆధారంగా పంటలు వేస్తున్నారు. మిగిలిన లక్షా 34వేల ఎకరాలలో వర్షాధారంగానే సాగు చేస్తారు. ఏటా సాగర్ నీటి ఆధారంగా సాగు చేసే మూడు లక్షల ఎకరాల్లో సుమారు లక్ష ఎకరాల్లో మాగాణి, మిగిలిన రెండు లక్షల్లో ఆరుతడి పంటలు ఉంటాయి. గత ఏడాది సుమారు 2.75 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 85వేల ఎకరాల్లో వరి, మిగిలిన లక్షా 90వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు వేశారు. ఈ ఏడాది అంతకన్నా మించి సాగయ్యే అవకాశం ఉంది. కృష్ణా నది ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలతో వరద నీరు ఈనెల తొలిపక్షం నాటికే రాష్ట్రంలోని కీలక రిజర్వాయర్లు అయిన శ్రీశైలం, సాగర్‌లకు చేరుతుండటాన్ని గమనించిన రైతులు విస్తారంగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

నెల ముందుగానే..

జిల్లాకు నీరు తొలుత వచ్చే దర్శి డివిజన్‌లో అధిక పనులు గతేడాది మంజూరు కావడంతో అవి మూడొంతులు పూర్తిచేశారు. నిజానికి ఏటా సాగర్ నీరు జిల్లాకు తాగునీటికి ఆగస్టు ఆఖరులో, సాగుకు సెప్టెంబరులో ఇస్తారు. ఈ ఏడాది కూడా అధికారులు అలాగే అడిగారు. దర్శి ప్రాంతంలో పూర్తిగా, చీమకుర్తి డివిజన్‌లో అధిక భాగం పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. అయితే ఈ ఏడాది ముందుగానే ప్రాజెక్టులు నిండటంతో వారం క్రితమే సాగర్ డ్యామ్ నుంచి కుడికాలువకు నీటిని విడుదల చేశారు. సోమవారం విడుదల పరిమాణం పెంచారు. ఆ నీరు పల్నాడు జిల్లా బుగ్గవాగుకు తొలుత చేరి నాలుగు రోజుల్లో మన జిల్లాకు వస్తుంది. అలాగే సాగర్ డ్యామ్ నిండుకుండలా ఉండటంతో ప్రాజెక్టు గేట్లను మంగళవారం ఎత్తనున్నారు. దీంతో కుడికాలువకు నీటి సరఫరా మరింత పెరుగుతుంది. తొలుత సాగర్

మిగతా 6వ పేజీలో

పెండింగ్‌లో మరమ్మతు పనులు

డ్యామ్‌లలో పుష్కలంగా నీరు చేరి, సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నా ఆ నీటిని పొలాలకు చేర్చే విషయంపై ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. అందుకు ప్రస్తుతం సాగర్ కాలువలకు జరుగుతున్న మరమ్మతులే కారణం. సాగర్ కాలువల్లో సక్రమంగా నీటి సరఫరా కోసం ఏటా పూడికతీత, జంగిల్ తొలగింపు, కట్టలు పటిష్టపర్చడం, తూములు, షట్టర్ల మరమ్మతులు చేస్తుండాలి. అయితే గత వైసీపీ పాలనలో ఆ పనులను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో జిల్లాలో చాలాచోట్ల కాలువలు దెబ్బతిని అధ్వానంగా మారాయి. ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి పరిస్థితే ఉండటాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో ఎస్‌డీఎంఎఫ్ కింద కొంత మేర, ఇటీవల ఓఅండ్ఎం కింద మంజూరైన పనులు చాలాచోట్ల నాల్గో వంతు కూడా పూర్తి కాలేదు. కొన్ని అసలు ప్రారంభమే కాలేదు. ప్రత్యేకించి గత అక్టోబరులో ఎస్‌డీఎంఎఫ్ కింద జిల్లాలోని దర్శి ఈఈ పరిధిలో రూ.5కోట్లు, ఏబీసీ పరిధిలో రూ.2కోట్లు మంజూరు కాగా చీమకుర్తి డివిజన్ అధికారుల నిర్లక్ష్యంతో ఆ ప్రాంతానికి ఒక్క రూపాయి కూడా రాలేదు. ఆ డివిజన్‌కు ఇటీవల ఓఅండ్ఎం కింద రూ.5.50 కోట్లు మంజూరు చేశారు. దీంతో చీమకుర్తి డివిజన్‌లో కాలువల మరమ్మతుల పనులు చాలా పెండింగ్ ఉన్నాయి.

కొండపి పంచాయతీకే ఎన్నికలు

- షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల కమిషన్
- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 10న పోలింగ్
- మంగమూరు ఎన్నిక తాత్కాలికంగా నిలుపుదల



ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. జిల్లాలో కొండపితోపాటు సంతనూతలపాడు మండలం మంగమూరు పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈసీ ఆదేశించడంతో తదనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే సోమవారం కొండపికి మాత్రమే నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. మంగమూరు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండటంతో దానిపై తర్జన, భర్జనల అనంతరం తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు సమాచారం. హైకోర్టులో కేసు ఉన్నందున పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం మంగమూరు ఎన్నికల నిర్వహణపై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కాగా కొండపి ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఆ ప్రకారం బుధవారం నోటిఫికేషన్ ప్రకటిస్తారు. వచ్చేనెల 10న పోలింగ్ నిర్వహించి అదేరోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఎస్‌ఈసీ ఆదేశాలతో కొండపిలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు సంబంధించి సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వడంతోపాటు నామినేషన్ల అనంతరం బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి సమకూర్చుకోవడం వంటి వాటిపై ఆశాఖ అధికారులు దృష్టిసారించారు.


పిల్లలను దత్తత తీసుకుంటున్న ఎంఈవో రాజశేఖర్‌రెడ్డి

అనాథలకు ఆసరా

- తండ్రి కరోనాతో.. తల్లి క్యాన్సర్‌తో మృతి
- ప్రభుత్వ పిలుపుతో ఇద్దరు బాలికలను దత్తత తీసుకున్న త్రిపురాంతకం ఎంఈవో

త్రిపురాంతకం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ప్రభుత్వం కల్పించే వసతులతో విద్యాభ్యాసం చేసే చిన్నారులకు పీ4 పథకం ఆసరాగా నిలుస్తోంది. ఇప్పటికే పలువురు అధికారులు అనాథలైన చిన్నారులను దత్తత తీసుకుని ఆదర్శంగా నిలిచారు. సోమవారం త్రిపురాంతకంలోని కేజీబీవీ పాఠశాలలో ఇద్దరు చిన్నారులను ఎంఈవో రాజశేఖరరెడ్డి దత్తత తీసుకున్నారు. చిన్నారుల్లో కావేరిబాయి ఆరో తరగతి, మానసబాయి ఏడో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గణపవరం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందినవారు. తండ్రి కొవిడ్ కారణంగా, తల్లి క్యాన్సర్‌బారిన పడి మరణించారు. వారికి అవసరమైన కనీస వసతులు, అవసరాలు తీరుస్తానని ఎంఈవో చెప్పారు. సోమవారం వారికి దుస్తులు, దుప్పట్లు, సబ్బులు, నూనె ఇతర వస్తువులు అందజేశారు.

'తల్లికి వందనం' గ్రీవెన్స్‌ల పరిష్కారానికి

ప్రాధాన్యం ఇవ్వాలి

అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం : 7లో

వనితా.. ఓ వ్యాపారవేత్త..!

- పొదుపు మహిళలతో 'తృప్తి' క్యాంటీన్లు
- రుణ సదుపాయం కల్పించి ఆర్థిక భరోసా
- మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలో 55 క్యాంటీన్లు
- మహిళాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి



ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తూ ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. ముఖ్యంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం పలికింది. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించడంతోపాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండేలా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో 'తృప్తి' క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు తొలుత నెల్లూరు పట్టణంలో పైలట్ ప్రాజెక్టుగా మేలో క్యాంటీన్‌ను ప్రారంభించగా, శనివారం విజయవాడలో పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్‌లు ప్రారంభించారు. త్వరలోనే ఏపీ మెప్మా, శారా ప్రాజెక్టు ఉమ్మడి భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా 750 క్యాంటీన్లను

మిగతా 6వ పేజీలో

రవాణా అధికారులపై దౌర్జన్యం

- ఫిట్‌నెస్ కేసు నమోదు చేసినందుకు బ్రేక్‌ఇన్‌స్పెక్టర్‌ను అడ్డగించిన లారీ యజమాని
- పోలీసు స్టేషన్‌లో అప్పగించిన అధికారులు

ఒంగోలు క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'మా బండిపైనే కేసు రాస్తారా' అంటూ రవాణాశాఖ అధికారులపై టిప్పర్ యజమాని దౌర్జన్యం చేశారు. ఈ ఘటన అటు గ్రానైట్ వర్గాలు, ఇటు అధికార యంత్రాంగంలో చర్చనీయాంశమైంది. 'ఓవర్ లోడ్ వద్దు.. పాసింగ్ ముద్దు' అంటూ 10 రోజులుగా నిరసనకు దిగిన ఒంగోలు టిప్పర్ యజమానుల అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ వల్లెపు ఆంజనేయులుకు చెందిన టిప్పర్‌ను సోమవారం ఉదయం సంతనూతలపాడు చెరువు కట్ట సమీపంలో రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. టిప్పర్‌కు ఫిట్‌నెస్ చేయించలేదు. కేసు నమోదు చేసిన బ్రేక్ ఇన్‌స్పెక్టర్ జరిమానా విధించారు. దీంతో లారీ యజమాని ఆంజనేయులు కోపోద్రిక్తుడై బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కారుకు అడ్డుగా కూర్చున్నాడు. తమ టిప్పర్లపైనే కేసులు ఎందుకు రాస్తున్నారంటూ వాదులాటకు దిగారు. దీంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న రవాణా శాఖ అధికారులు లారీ యజమాని ఆంజనేయులు, మరో వ్యక్తిని సంతనూతలపాడు పోలీసులకు అప్పగించారు. అనంతరం టిప్పరు యజమానులు రవాణా శాఖ అధికారులతో మాట్లాడి తాము తప్పుచేశామని క్షమాపణలు కోరారు.



బకాయిల పేరుతో రూ.70 లక్షలకు టెండర్?

- పాత బిల్లులు రావాలంటున్న కాంట్రాక్టర్
- విద్యుత్‌శాఖలో నిధులు కాజేసే ఎత్తుగడ
- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- తుది నిర్ణయం ఉన్నతాధికారులదేనని చెప్పి తప్పుకుంటున్న వైనం

త్రిపురాంతకం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖలో బకాయిలు రావాలని ఒక కాంట్రాక్టరు తెచ్చిన వివరాలను అధికారులు కనీసం పరిశీలించకుండానే బిల్లులు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో ఏకంగా రూ.70లక్షలు బిల్లు మార్చేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ప్రతిపాదించిన ఈ బిల్లులు వాస్తవమేనని గతంలో పనిచేసి ఇప్పుడు ఉద్యోగ విరమణ చేసిన ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతకాలతో పత్రాలు ఉన్నాయని సమాచారం. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో జరుగుతున్న ఈ బిల్లుల బాగోతం తాలూకు వివరాలు ఇలా ఉన్నాయి.

ఒప్పందం ఏమిటో..?

ఎర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన ఒక విద్యుత్ కాంట్రాక్టరు తనకు 2014-19 మధ్యకాలంలో విద్యుత్తు పరికరాల రవాణాకు సంబంధించిన బిల్లులు రావాల్సి ఉందని అధికారులతో మాట్లాడుకున్నారు. పెద్దమొత్తంలో బిల్లులు రావాలని దాదాపు రూ.70లక్షలు బకాయి ఉన్నట్లు ప్రతిపాదనలు తెచ్చినట్టు సమాచారం. అధికారులకు, కాంట్రాక్టరుకు మధ్య కుదిరిన ఒప్పందం ఏమిటో తెలియదు కాని వీటిలో వాస్తవం ఉందా.. లేదా? అనేది పరిశీలించకుండానే.. రాజకీయ పలుకుబడి ఉన్న కాంట్రాక్టరుతో

మిగతా 6వ పేజీలో

అనారోగ్యంలో అత్యవసర సంజీవిని

ఓఆర్ఎస్



- శరీర బలహీనతను తగ్గించి తాత్కాలిక ఉపశమనం
- మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీ ప్యాకెట్లు
- నేడు ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం

7



ఎన్నో అనుమానాలు!

విద్యుత్ స్మార్ట్‌మీటర్లపై గందరగోళం

- దానికయ్యే ఖర్చు వేస్తారు!
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు
- దశలవారీగా ఏర్పాటుకు సిద్ధమవుతున్న విద్యుత్ శాఖ
- ఎలాంటి అదనపు భారం ఉండదు : ఎస్ఈ

ఒంగోలు క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో అధునాతన సాంకేతిక పద్ధతులలో భాగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. దశల వారీగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం చాలావరకు పూర్తిచేశారు. ఇళ్లకు ఏర్పాటు చేయాలని

మిగతా 6వ పేజీలో

వనితా.. ఓ వ్యాపారవేత్త!

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్‌తోపాటు, ఇతర మునిసిపాలిటీలలో సుమారు 55 'తృప్తి' క్యాంటీన్‌లు తెరవనున్నారు. ఈ దిశగా మెప్మా ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

నిర్వహణ విధానం ఇలా

తృప్తి క్యాంటీన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వమే సహకారం అందించనుంది. 20-12 సైజు కంటైనర్లను సమకూర్చడంతోపాటు, ప్రతి నలుగురు మహిళలను ఒక యూనిట్‌గా తీసుకుని వారికి క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించనుంది. అందుకోసం వంటశాల నిర్వహణపై శిక్షణ అందించనుంది. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ పరికరాలను, సోలార్ విద్యుత్‌తో వంటశాలను తీర్చిదిద్దనున్నారు. ఒక్కో క్యాంటీన్ నిర్వహణకు రూ.16.40 లక్షలు అవసరం ఉందని పురపాలక శాఖ అంచనా వేసింది. దీంతో యూనిట్ సభ్యులుగా నలుగురు ఒక్కొక్కరు రూ.3.10 లక్షల చొప్పున రూ.12.40 లక్షలు మొత్తం 75శాతం పెట్టుబడిగా నిర్ణయించారు. మిగిలిన నిధులను శారాస్ ఏజెన్సీ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తారు. ఈ నిధులతో కంటైనర్, యంత్ర పరికరాలు, సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్, ఇతర అవసరాలను మెప్మా ప్రాజెక్టు అందజేస్తారు.

ప్రతి రోజూ రూ. 10వేలకుపైనే ఆదాయం

తృప్తి క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి, ఆదాయ వ్యయాలను అధికారులు లెక్కకట్టారు. వారి అంచనా ప్రకారం నెలవారీ టర్నోవర్ సుమారు రూ.6.39 లక్షలు వస్తుందని భావిస్తుండగా, అందులో నిర్వహణ ఖర్చు రూ.3.92 ఖర్చులు పోను రూ.2.46 లక్షలు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే ఈ క్యాంటీన్లలో ఆహార పదార్థాల ధరలకు బయట మార్కెట్‌లో ధరలకు పెద్దగా వ్యత్యాసం ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలో 55 క్యాంటీన్‌లు

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేయనున్న 'తృప్తి' క్యాంటీన్‌లు జిల్లాలో 55 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. మొదట జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని ప్రగతిభవన్, జీజీహెచ్ ఆసుపత్రి వద్ద, నెల్లూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, గుంటూరు రోడ్‌లో వీటిని ఏర్పాటు చేసేందుకు మెప్మా, కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాలను గుర్తించారు.

బకాయిల పేరుతో రూ.70లక్షలకు టెండర్

(5వ పేజీ తరువాయి)

తమకెందుకులే అనుకున్నారో ఏమో.. తెచ్చిన వివరాలతో ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. వాస్తవానికి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, కండక్టరు, ఇతర పరికరాలు రవాణా చేసేందుకు కాంట్రాక్టరు అవసరమైతే ఆ శాఖ ముందుగానే కాంట్రాక్టు పిలవాలి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు పేరుతో అగ్రిమెంటు కావాలి. ఆ తరువాత రవాణా చేసిన పూర్తి వివరాలను అధికారులు ధ్రువీకరించి ప్రతిపాదనలు పంపాలి. ఇవేమీ లేకుండానే గతంలో మార్కాపురం డీఈగా పనిచేసి ఇప్పుడు ఉద్యోగ విరమణ చేసి ఉన్న ఒక అధికారి ధ్రువీకరణతో ఈ బిల్లులు మార్చేందుకు రంగం సిద్ధమైనట్లు కాంట్రాక్టర్లు, కూటమి నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. విషయం బయటకు రాగానే కింది స్థాయి అధికారులు మాత్రం తమ వద్దకు కాంట్రాక్టరు తెచ్చిన ఆధారాలకు ప్రతిపాదనలు పంపామని ఇందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయమే తుదినిర్ణయమని చేతులు దులిపేసుకుంటున్నారు. మొత్తానికి ఇవి నిజమైన బిల్లులేనా? కాంట్రాక్టరుతో అగ్రిమెంటు ఉందా? అనే ప్రశ్నలకు మాత్రం అధికారుల వద్ద సమాధానం లేదు.

ఉన్నతాధికారులే నిర్ణయం తీసుకోవాలి

కాంట్రాక్టరు తెచ్చిన వివరాలను పరిశీలించి ప్రతిపాదనలు పంపాం. 2014-19 నాటి బిల్లులు కావటంతో ఈ విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వారి నిర్ణయమే ఫైనల్.

- నాగేశ్వరరావు, విద్యుత్ డీఈ, మార్కాపురం

ఉరుకులు.. పరుగులు

(5వ పేజీ తరువాయి)

నీటితో తాగునీటి చెరువులు నింపి కొనసాగింపుగా సాగుకు కూడా వాడుకోవాలని పైస్థాయి నుంచి జిల్లా అధికారులకు సంకేతాలు వచ్చాయి. దీంతో దర్శి డివిజన్‌లో ప్రధాన కాలువల్లో ముగింపు దశలో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసేలా అక్కడి అధికారులు పరుగులు తీస్తున్నారు. అయితే ఓబీసీ పరిధిలో చీమకుర్తి డివిజన్‌లో ఎక్కువ పనులు పెండింగ్‌లో ఉండటంతో ఏమి చేయాలో అర్థంకాక ఇక్కడి ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి వచ్చే నీటిని ఆపే అవకాశం ఉండదు కనుక అవసరం ఉన్న మేర ప్రధాన కాలువల ద్వారా తీసుకొని తొలుత రామతీర్థం నింపి తర్వాత చెరువులకు ఇచ్చే యోచన చేస్తున్నారు.

నగర అభివృద్ధికి సహకరించాలి

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ● ట్రంక్ రోడ్ విస్తరణపై వ్యాపారులతో సమావేశం

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణకు సహకరించాలని, వ్యాపారులకు అన్యాయం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ట్రంక్‌రోడ్ విస్తరణపై కొన్ని నెలలుగా జాప్యం జరుగుతున్న విషయం విదితమే. నగర మాస్టర్‌ప్లాన్ ప్రకారం 100 అడుగులు విస్తరించాల్సి ఉండగా, పలు కారణాలు చెప్పి వ్యాపారులు పదేపదే వాయిదా వేస్తూ విస్తరణ పనులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సోమవారం ట్రంక్ రోడ్ వ్యాపారులతో సమావేశం అయ్యారు. స్థానిక ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో వ్యాపారుల అభిప్రాయాన్ని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు ట్రంక్ రోడ్ విస్తరణ పనులు వాయిదా వేయాలని కోరగా, కొందరు వ్యాపారులు 100 అడుగులు వద్దు 80 అడుగులు విస్తరించాలని కోరారు. మరికొందరు వ్యాపారులు 60 అడుగులు విస్తరిస్తే బాగుంటుందని ఎమ్మెల్యేకి వివరించారు. అయితే ఈ సమావేశంలోనే వ్యాపారుల్లోనే భిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో దామచర్ల మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం.. ప్రజా ప్రయోజనార్థం 100 అడుగులు విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. నగరంలో అన్నీ రోడ్‌లు విస్తరించడం జరిగిందనీ, అయితే ఎవరూ కూడా ఎలాంటి అభ్యంతరం లేకుండా సహకరించారని తెలిపారు. కానీ ట్రంక్‌రోడ్ విస్తరణలో అభ్యంతరాలు సరికాదన్నారు. ట్రంక్ రోడ్ విస్తరణపై నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, 100 అడుగులు విస్తరణకే అత్యధిక శాతం ప్రజలు ఆమోదం తెలియజేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పనుల్లో లాభ, నష్టాలు సహజమన్నారు. అయితే నష్ట పరిహారంగా వ్యాపారులకు నాలుగు రెట్లు టీడీఆర్ బాండ్‌లు ఇవ్వడంతోపాటు, పాత మార్కెట్ స్థలంలో షాపులు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు వ్యాపారుల సంక్షేమ దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని దామచర్ల వారికి వివరించారు. సుమారు మూడు గంటలకుపైగా జరిగిన సమావేశంలో వ్యాపారుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం, మరోవైపు విస్తరణపై వ్యాపారులు స్పష్టమైన అంగీకారం తెలియజేయకపోవడంతో స్పష్టత కొరవడింది. దీంతో వ్యాపారులు అందరు మాట్లాడుకుని ఒక మాటపై అంగీకారం తెలియజేయాలని దామచర్ల సూచించారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, నగర కమిషనర్ కే.వెంటేశ్వరరావు, మాజీ మునిసిపల్ ఛైర్మన్‌లు యక్కల తులసీరావు, మంత్రి శ్రీనివాసరావుతోపాటు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ట్రంక్ రోడ్ వ్యాపారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

మినీబైపాస్‌కు తొలగిన అడ్డంకులు

అద్దంకి, జూలై28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఒకవైపు టెండర్ల ప్రక్రియకు వేగంగా ఫైళ్లు కదులుతుండగా, మరోవైపు ఉన్న అడ్డంకులను కూడా అధికారులు వేగంగా పరిష్కరిస్తున్నారు. మినీ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసే అద్దంకి మేజర్ కాలువ కట్టలను ఆక్రమించి పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారికి ప్రస్తుతం ప్రత్యామ్నాయం చూపుతూ స్థలాలు కేటాయిస్తున్నారు. అద్దంకి మేజర్ కాలువ కట్టలను రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు రెండువైపులా సీసీ రోడ్లు, సైడ్ డ్రైయిన్లు, లైట్లు తదితర పనులకు సుమారు రూ.15 కోట్లతో చేపట్టేందుకు టెండర్ల పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఫైల్ ప్రభుత్వ అనుమతికి వెళ్లింది. ఈ లోగా 70 కుటుంబాలు కాలువ కట్టలను ఆక్రమించి నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. ఆయా కుటుంబాలకు శింగర కొండపాలెం సమీపంలో అద్దంకి కొండ వద్ద స్థలాల కేటాయింపునకు ఏర్పాట్లు చేశారు. లోతైన గోయ్యి ఉండటంతో మెఘా ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో చదును చేయించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా విభజించారు. రోడ్లు పోను ఒక్కొక్కరికి 2 సెంట్లు చొప్పున కేటాయించగా 42 ప్లాట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన మరి 28 మందికి ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. అదే ప్రాంతంలో మరికొంత కొండ ప్రాంతాన్ని చదును చేసే విధంగా చర్యలు చేపడుతు న్నారు. ప్లాట్లు వేసిన ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, రోడ్లు, బోరింగ్‌లు కూడా ఏర్పాటు చేయాలని మంత్రి రవికుమార్ ఆదేశించారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో అటు మినీ బైపాస్ నిర్మాణం టెండర్ల ప్రక్రియ, మరో వైపు స్థలాల కేటాయింపు పనులు వేగంగా కొనసాగుతు న్నాయి.



వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒంగోలు(రూరల్), జూలై28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది - వలేటివారి పాలెం గ్రామాల మధ్య ఆదివారం రాత్రి ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల వివరాల మేరకు కరవది గ్రామానికి చెందిన చెన్నుబోయిన గంగాధర్‌కు ఈనెల 27వతేదీన కొందరు వ్యక్తులు ఫోన్‌చేయడంతో ఇంటినుంచి ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. అదే రోజు రాత్రి 10.30 గంటలకు ఇంటికి వస్తున్నట్లు ఫోన్ ద్వారా భార్యకు తెలిపాడు. తరువాత కరవది - వలేటివారి పాలెం గ్రామాల మధ్య గంగాధర్ పడిపోయిఉన్నట్లు కరవది గ్రామస్థులు గుర్తించి కుటుంబసభ్యులకు రాత్రి 12గంటల ప్రాంతంలో తెలిపారు. ఆయన ముఖంపై తీవ్రగాయాలు ఉండటంతో వైద్యం కోసం ఒంగోలులోని ఓప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని కరవది గ్రామం తీసుకు పోయారు. దీనిపై మృతుడి భార్య అశ్విని తన భర్త ప్రమాదవశాత్తు మృతి చెందలేదని, హత్య చేసి ఉంటారని ఒంగోలు పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీస్‌లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరవది నుంచి ఒంగోలు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

బీసీ వసతిగృహ ప్రాంగణంలో ఆక్రమణలు

● తొలగించాలని గ్రీవెన్స్‌లో వినతి

చీమకుర్తి,జూలై28(ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహ ప్రాంగణంలో ఆక్రమణల పర్వానికి అడ్డుకట్ట వేయాలని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల మల్లిఖార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.చీమకుర్తి పట్టణంలో ఎన్ఎస్‌పీ కాలనీ సమీపంలో బీసీబాలుర వసతిగృహం దాదాపు అర ఎకరానికి పైగా విస్తీర్ణంలో ఉంది. అక్కడ నిర్మించిన వసతి గృహ బిల్డింగ్‌లు శిథిలావస్థకు చేరుకోవటంతో వసతిగృహంలో ఉన్న విద్యార్థులను పట్టణంలో వేరేచోటుకు తరలించారు.అప్పటినుంచి ఇక్కడి ప్రాంగణం ఖాళీగా ఉంది.కాగా ఈ స్థలంలో ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయని,అనధికార నిర్మాణాలు ప్రారంభమయ్యాయని,దీని వలన భవిష్యత్‌లో బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల వసతికి ఇబ్బందులు చోటుచేసుకుంటాయని మల్లిఖార్జునరావు గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.తక్షణమే అధికారులు జోక్యం చేసుకొని ఆక్రమణల పర్వానికి అడ్డుకట్ట వేయాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు

ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన

పర్చూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు మండలంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం పర్యటిం చారు. ప్రధానంగా నల్లబర్లీ రైతుల సమస్యపై ప్రత్యేక దృష్టిసారించారు. బర్లీ పొగాకు కొనుగోలు విషయానికి సంబంధించి రైతుల నుండి పలు సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకో వాలని మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. అనంతరం మార్టూరు మండలం ఇసుక దర్శి ఎమ్మెల్యే ఏలూర క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఇంకొల్లు మండలానికి సంబంధించిన రైతులకు సంబంధించిన పొగాకును అమ్ముకు నేందుకు వీలుగా గుండ్లాపల్లిలో నూతన నల్లబర్లీ పొగాకు కొను గోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటగా 20 క్వింటాళ్ల పొగాకు ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత మిగిలిన రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేస్తామన్నారు. సన్న, చిన్నకారు రైతులు పడుతున్న ఇబ్బందులను ఏఎంసీ ఛైర్మన్ గుంజి వెంకట్రావు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన వెంటనే ప్రత్యేక దృష్టిసారిం చినట్లు తెలిపారు. రైతులు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. ప్రతి రైతువద్ద ఉన్న పొగాకు ను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతురావు, పీఏసీఎస్ అధ్యక్షులు కర్రీ శ్రీనివాసరావు, సుబ్బారావు, రాంబాబు, నాయకులు వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పిచ్చికుక్క కాటుకు ఆవు బలి

మార్టూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క కాటుకు ఆవు బలైన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీలోని ద్వారకపాడు గ్రామంలో చోటుచేసుకొంది. వారం రోజులు క్రితం మువ్వా శేషయ్యకు చెందిన పశువుల కొష్టంలో కట్టేసిన ఆవును పిచ్చికుక్క కరిచింది. దాంతో అప్పటినుండి మేత మేయకుండా, నీళ్ల తాగకుండా, దగ్గరకు వచ్చినవారిని పొడుస్తూ, వింతగా ప్రవర్తించిన ఆవు సోమవారం సాయంత్రం చనిపోయినట్లు రైతు శేషయ్య తెలిపారు. నాలుగేళ్ల క్రితం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు టీటీడీఆ గోశాల నుండి ఆవులను అ ందచేశారు. అందులో భాగంగా శేషయ్యకు కూడా ఆవును అందచేశారు. దీంతో ప్రకృతి వ్యవసాయంలో ఆవు మూత్రం, పేడను పొలానికి ఎరువుగా వినియోగించారు. అయితే పశువైద్యులతో వైద్యం చేయించినప్పటికీ, ఆవు కోలుకోలేదని శేషయ్య, అయన కుటుంబ సభ్యులు వాపోయారు.



సోమవారం ప్రాణాలతో ఉన్న ఆవు

ఎన్నో అనుమానాలు!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించిన సమయంలో వినియోగదారులు ఆందోళన దిగడంతో ప్రక్రియ నత్తనడకన నడుస్తోంది. అయితే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం 200 యూనిట్ల రీడింగ్ పైబడిన ఇళ్లకు మాత్రమే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేస్తున్నారు. అయితే వారు చెప్పేవి అబద్దాలంటూ ప్రజాసంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. వినియోదారులపై అదనపు భారం పడుతున్న స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని కోరుతున్నాయి. ఈక్రమంలో ఇళ్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటును అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

స్మార్టుమీటర్ వినియోగం

విద్యుత్ శాఖ అధికారుల సమాచారం ప్రకారం.. స్మార్ట్ మీటర్‌లో ఖచ్చితమైన రీడింగ్ రికార్డు చేయడంతో పాటుగా సిబ్బంది పర్యవేక్షించేందుకు బాగా ఉపయోగపడుతుంది. వినియోగదారునికి, సంస్థకు ఎంత విద్యుత్ వినియోగించాము అనేది ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అదేవిధంగా బిల్లింగ్ లోపాలు లేకుండా ఉండేందుకు దోహదపడుతుంది. వినియోగదారుడు నిత్యం వినియోగించే విద్యుత్ ఎంతో తెలుసుకునే అవకాశం ఉంది. అదేవిధంగా స్మార్ట్‌మీటరు వలన విద్యుత్‌ను ఆదా చేసుకునే అవకాశం ఉంది. అదే క్రమంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుతో వినియోగదారునిపై ఎలాంటి అదనపు భారం ఉండదని అధికారులు చెబుతున్నారు. స్మార్ట్ మీటర్లను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు.

రీచార్జ్ పద్ధతిలో వినియోగం

విద్యుత్ స్మార్టుమీటర్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాత రీచార్జ్ పద్ధతిన వినియోగించుకోవాల్సి ఉంటుంది. దీనిలో పోస్టుపెయిడ్, ప్రీపెయిడ్ సిస్టమ్ కూడా ఉంటుంది. దీంతో వినియోగదారులు నిత్యం వినియోగించే విద్యుత్‌ను అంచనా వేసుకొని పొదుపు చేసుకునే అవకాశం ఉంది. అంతే కాకుండా ఎంత వినియోగించుకుంటే అంతవరకు చెల్లింపులు చేసుకునేందుకు స్మార్ట్ మీటర్లు దోహదపడతాయి.

ప్రభుత్వ సంస్థలకు, వ్యాపార కూడళ్లకు ఏర్పాటు

జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో 20,306 కనెక్షన్లు ఉండగా 17,680కి స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేశారు. వ్యాపార సంస్థలు 1,12,235 కనెక్షన్లు ఉండగా 92,020కి ఏర్పాటు చేశారు. అదేవిధంగా హెచ్‌టీ కనెక్షన్లు 700కాగా 60 స్మార్టు మీటర్లు ఏర్పాటు చేశారు. ఇంటి కనెక్షను సుమారు 8 లక్షలు ఉండగా వీటిలో 200 యూనిట్లు పైబడి రీడింగ్ వచ్చే ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ నిర్ణయించింది. సుమారుగా 80వేల ఇళ్లకు మాత్రమే ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంటే 200 యూనిట్లకు లోబడి రీడింగ్ వస్తున్న ఇళ్లకు ప్రస్తుతం స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయరు.

వినియోగదారులలో ఆందోళన

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుతో వినియోగదారులపై అదనపు భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. నూతనంగా స్మార్ట్‌మీటరు సుమారుగా రూ.9వేల వరకు ఉంటుందని ఆ భారాన్ని వినియోగదారులు భరాయించాలని ప్రజా సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం వినియోగదారులనుంచి స్మార్ట్‌మీటర్లకు సంబంధించి అదనపు వసూళ్లు ఉండవని అపోహపడవద్దని అంటున్నారు. అదే సమయంలో స్మార్ట్‌మీటరు ఏర్పాటు వలన వినియోగదారుడు రీచార్జ్ చేసుకున్న అంతవరకు వినియోగం చేసుకోవాలని, కార్డులో నగదు లేకుంటే ఇంట్లో విద్యుత్ నిలిచిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

అదనంగా వసూలు ఉండదు

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు వలన వినియోగదారులకు ఎలాంటి అదనపు భారం పడదు. అదనంగా వసూలు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దశల వారీగా మొత్తం కనెక్షన్లకు ఏర్పాటు ప్రకియ పూర్తిచేయలని ఆదేశాలు ఇవ్వడంతో ప్రక్రియ నడుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశాము.

-కట్టా వెంకటేశ్వర్లు విద్యుత్తు శాఖ ఎస్ఈ

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకిటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానం నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కూరగాయల వ్యాపారి మారం మల్లయ్య(80) మృతి చెందాడు. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు ప్రోత్సహంతో మల్లయ్య కుటుంబ సభ్యుల అంగీకారంతో పెదకాకానిలోని శంకర కంటి వైద్యశాల చెందిన డాక్టర్ శ్రద్దా బృందం మృతుని కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి అ లహరి హరిప్రసాద్, చప్పిడి వీరయ్య, చిన్ని మురళీకృష్ణ, షేక్ మహమ్మద్ రఫీ, అంజద్‌బాషా, మల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నేత్రం దానంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

బసవయ్యకు డాక్టరేట్

సంతమాగు లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెనవారిపా లెం గ్రామానికి చెందిన డాక్టర్ చెన్నుపల్లి బస వయ్యకు తెలుగు సాంస్కృతిక సాహితి ట్రస్టు వారు ఈ నెల 27న కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరు పట్టణంలో డాక్టరేట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బల్లికురవ మండల విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గుంటుపల్లి రామకృష్ణ, ప్రసన్నాంజనేయస్వామి విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ కూడా అభినందనలు తెలిపారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

పందిళ్లపల్లి(చీరాల), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఐదుగురు నిరుపేద విద్యార్థులకు శ్రీరామకృష్ణ సేవాసమితి చీరాల ప్రతినిధులు స్కాలర్‌షిప్ ప్రోత్సాహం అందజేశారు. దాతల సహకారాన్ని అంది పుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని దాతలు కోరారు.

నూతన విద్యా విధానాలను అమలు చేయాలి

అద్దంకిటౌన్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్ మీడియట్‌లో నూతనం గా ప్రవేశపెట్టిన విధానాలను ప్రతి కళా శాలలో అమలుచేయాలని డీఐఈవో జూబేర్ సూచించారు. సోమవారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని అధ్యాపకులతో సమా వేశం నిర్వహించి ఇంటర్‌మీడియట్ బోర్డు నూతనంగా ప్రవేశపెట్టిన విధి వి ధానాలపై అవగాహన కల్పించారు. ద్వితీయ సంవత్సరంలానే ప్రథమ సంవత్సరంలోనూ ప్రాటికల్స్ ఉంటాయ న్నారు. సబ్జెక్ట్‌ల కుదింపును తెలుసు కుని ఆ ప్రకారం బోధన చేయాలన్నారు. అనంతరం జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థు లతో మాట్లాడి తెలుసుకున్నారు. అనం తరం పట్టణంలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలను ఆయన సందర్శిం చారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు ఉన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ఏఐపై వర్క్‌షాపు

చీరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం డ్రోన్ డెవలప్ మెంట్ యూజింగ్ ఏఐపై వర్క్‌షాపు ప్రారంభించారు. ఈక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ శుక్రవారం వరకు జరిగే ఈ అవగాహనలో ఆధునిక సాంకేతిక పరమైన అంశాలపై నిష్ణాతులుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. హైదరాబాదుకు చెందిన ఆర్బిస్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్ ల్యాబ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో ఉష్ణోగ్రత వల్ల శరీరంలోని నీటి స్థాయి వేగంగా పడిపోయి డీ హైడ్రేషన్‌కు దారి తీస్తుంది. మరోవైపు పిల్లల నుంచి పెద్దల వరకు విరేచనాలు, వాంతులతో తీవ్ర అలసటతో బాధపడుతుంటారు. వర్షా కాలంలోనూ తాగునీరు కలుషితం కావడం వల్ల అతిసార (డయేరియా) బారిన పడుతుంటారు. శరీరం బలహీనపడే క్రమంలో మనిషికి శక్తినిచ్చే తాత్కాలిక ఉపశమనం కోసం ఓఆర్‌ఎస్ ఉపయోగం అని వైద్యులు వెల్లడిస్తున్నారు. నేడు ప్రపంచ ఓరల్ రీ హైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్‌ఎస్) దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం..

అనారోగ్యంలో అత్యవసర సంజీవిని ఓఆర్‌ఎస్

- శరీర బలహీనతను తగ్గించే తాత్కాలిక ఉపశమనం
- మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీ ప్యాకెట్లు
- నేడు ప్రపంచ ఓఆర్‌ఎస్ దినోత్సవం



ఒంగోలు కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అతిసార సమయంలో అత్యవసరంగా ఉన్నట్టుండి రెండు, మూడుసార్లు నీళ్ల విరేచనాలు అవడాన్ని వైద్య భాషలో అతిసారగా పిలుస్తారు. దీంతోపాటు జ్వరం, వాంతులు, కడుపులో నొప్పి, తల తిరగడం వంటి సమస్యలు ఎదురైనపుడు వైద్యులు అత్యవసరంగా ఓఆర్‌ఎస్ తాగించాలని సూచిస్తారు. ప్రపంచ ఓఆర్‌ఎస్ దినోత్సవాన్ని ఏటా జూలై 29న జరుపుకుంటారు. ఈ ఓఆర్‌ఎస్ తాగడం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గకుండా నివారించడానికి, ముఖ్యంగా విరేచనాల సమయంలో మరింత ఉపయోగకరంగా ఉంటుందని వైద్యులు వెల్లడిస్తున్నారు.

ఓఆర్‌ఎస్ ప్రాముఖ్యత

విరేచనాలు, వాంతులు వంటి వాటి వల్ల కలిగే అనారోగ్య ఇబ్బందులను నివారించడానికి, చికిత్స చేయించడానికి సులభమైన మార్గంగా దీనిని భావిస్తారు. ఓఆర్‌ఎస్‌లో నీరు, ఉప్పు, చక్కెర ఉంటాయి. ఇవి శరీరంలోని కోల్పోయిన ద్రవాలను, ఎలక్ట్రొలైట్‌లను భర్తీ చేస్తాయి.



ఏదీ ఒరిజినల్... ఏది నకిలీ?

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్న ఔషధ సంస్థలు ఓఆర్‌ఎస్ నకిలీ ప్యాకెట్లనూ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒరిజినల్ ఓఆర్‌ఎస్ ప్యాకెట్ పై వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ అని ఉండాలి. ప్యాక్‌పై ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ మార్కు ఉండాలి. అది లేకపోతే కేవలం డ్రింక్ మాత్రంగానే గుర్తించాలి. వాస్తవానికి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిబంధనల ప్రకారం 21 గ్రాముల ఒరిజినల్ ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లో 2.6 గ్రాములు సోడియం క్లోరైడ్, 2.9 గ్రాముల సోడియం సిట్రేట్, 1.5 గ్రాముల పొటాషియం క్లోరైడ్, 13.5 గ్రాముల డెక్స్‌ట్రోస్ ఉండాలి. ప్యాకెట్‌పై బ్రాండ్ లోగో, బ్యాచ్ నెంబరు, తయారీ, గడువు తేదీ, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నెంబరు స్పష్టంగా కనిపించాలి. నకిలీ ప్యాకెట్‌లపై ఇవేమీ కనిపించవు. ముఖ్యంగా ఒరిజినల్ ఓఆర్‌ఎస్ కొంచెం ఉప్పగా, కొంచెం తీయగా ఉంటుంది. అయితే నకిలీ ఓఆర్‌ఎస్‌లో అధిక మొత్తంలో చక్కెర వాడటం వల్ల తీయగా ఉంటుంది. ప్రజలు వాటిని పూర్తిగా పరిశీలించిన తర్వాత మాత్రమే తీసుకోవాలని, వైద్యులు సూచిస్తున్నారు.



ధేనువకొండ రోడ్డు బాగుపడేదెప్పుడో..!

- గతుకులతో ప్రయాణికుల అవస్థలు

అద్దంకి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మండలంలో అతి పెద్ద గ్రామంగా ఉన్న ధేనువకొండ నుంచి మండల కేంద్రంకు చేరుకోవాలంటే సరైన రోడ్డు వసతి లేకుండా పోయింది. అద్దంకి నుంచి ధేనువకొండకు 20 కి.మీ దూరం ఉంది. 18 కి.మీ వరకు ఆర్‌అండ్‌బీ పరిధిలోని తారు రోడ్డు ఉంది. అయితే తిమ్మాయపాలెం- ఇలపావులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ధేనువకొండ వరకు సుమారు 2 కి.మీ దూరం మాత్రం సరైన రోడ్డు లేకపోవటంతో రెండు బస్సులు మారి 40 కి.మీ ప్రయాణించి అద్దంకి చేరుకోవాల్సి వస్తోంది. లేదంటే ఆటోల్లో గోతుల రోడ్డుపై ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో పేరాయపాలెం సమీపంలో నల్లవాగుపై బ్రిడ్జి కూలిపోవటంతో అద్దంకి-ధేనువకొండ బస్ సర్వీస్‌ను రద్దు చేశారు. బ్రిడ్జి పునఃనిర్మాణాన్ని పట్టించుకోలేదు. దీంతో ధేనువకొండ చెరువు కట్టపై రోడ్డును చిల్లచెట్లు పూర్తిగా కమ్మేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేరాయపాలెం వద్ద తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాకపోకలకు వీలుగా చేశారు. అయితే తిమ్మాయపాలెం- ఇలపావులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ధేనువకొండ వరకు రోడ్డు పనులు మాత్రం చేపట్టలేదు. కనీసం దట్టంగా పెరిగిన చిల్లచెట్లను సైతం తొలగించకపోవటంతో ద్విచక్ర వాహనాలు కూడా ఇబ్బంది పడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా 2 కి.మీ రోడ్డు అభివృద్ధి చేయటంతో పాటు అద్దంకి-ధేనువకొండ బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని ధేనువకొండ, పేరాయపాలెం, ఉమ్మనేనివారిపాలెం ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో అద్దంకి-ధేనువకొండ సర్వీస్‌ను దొడ్డవరం, మద్దిపాడు మీదుగా ఒంగోలుకు పొడిగించాలని, ఒంగోలు -ధేనువకొండ బస్ సర్వీస్‌ను అద్దంకి వరకు పొడిగించాలని కోరుతున్నారు. దీనివల్ల అద్దంకి, మద్దిపాడు మండలాలలోని 15 గ్రామాల ప్రజలకు అటు ఒంగోలు, ఇటు అద్దంకికి నేరుగా వెళ్ళే అవకాశం ఏర్పడుతుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మాగుంట చొరవతో రోడ్లు మంజూరు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి చొరవతో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనపథ కింద పాలేరుపై వంతెన, మరో రెండు రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పాలేరు నదిపై హై లెవల్ వంతెన, పెళ్లూరు నుంచి కొణిజేడు, తాళ్లపాలెం రోడ్డు నుంచి పాకల వరకు రెండు రోడ్లు మంజూరు చేయాలని గత ఏడాది ఎంపీ మాగుంట ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై స్పందించిన పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరి ఆయా పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నలూరు మండలం ముప్పాళ్ల గ్రామం వద్ద పాలేరు నదిపై హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ.27.83 కోట్లు, ఒంగోలు మండలం పెళ్లూరు నుంచి కొణిజేడు వరకు రోడ్డు నిర్మాణానికి రూ 4.50 కోట్లు, టంగుటూరులోని తాళ్ళపాలెం రోడ్డు నుంచి పాకల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5.60 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

వీఆర్‌వో లేకుండా రేషన్ బియ్యం దింపడంపై ఫిర్యాదు

సంతనూతలపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నుంచి వచ్చిన రేషన్ బియ్యాన్ని సంబంధిత వీఆర్‌వో లేకుండా రేషన్ షాపు వద్ద సంబంధం లేని వ్యక్తి షాపు తాళాలు తీసి దింపిస్తుండటంపై సోమవారం తహసీల్దార్ నారాయణరెడ్డికి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు టి.బోసుబాబు, ఎం.శేఖర్, బి.శ్రీను తెలిపిన వివరాల మేరకు గత ఏడాది నవంబరు నెలలో మండలంలోని పేర్నమిట్టలో రేషన్ షాపు నెం.28పై 6ఏ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఆ రేషన్‌షాపుకు రేషన్ డీలరు లేకపోవడంతో సంబంధిత వీఆర్‌వో అయిన వినీల లాగిన్ ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం రేషన్‌షాపువద్దకు గోడౌన్ నుంచి వచ్చిన లారీలో బియ్యాన్ని వీఆర్‌వో వినీల లేకుండానే ఈశ్వరరావు అనేవ్యక్తి షాపు తాళాలు తీసి దింపిస్తున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వీఆర్‌వో వినీల హుటాహుటిన షాపు వద్దకు వచ్చారు. ఈక్రమంలో స్థానికులు కొందరు మీరు లేకుండా రేషన్ బియ్యాన్ని దింపిస్తుండంటపై వీఆర్‌వోను నిలదీయండతో ఆమె మౌనం వహించారు. ఈవిషయంపై తహసీల్దార్ నారాయణరెడ్డికి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

విద్యుత్‌స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలి

నాగులుప్పలపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సామాన్యుల నడ్డి విరిచే విద్యుత్‌స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు డిమాండ్ చేశారు.అదానీ కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లు ఆపాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అమ్మనబ్రోలు గ్రామంలో సోమవారం రాత్రి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం సెకీ ఒప్పందంతో రూ. 1,750 కోట్లు లంచం తీసుకొని స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలపై భారం మోపే విద్యుత్ సంస్కరణలను తిప్పికొట్టాలంటే ప్రజలు ఐకమత్యంగా ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జె.జయంతిబాబు, తూబాటి శ్రీకాంత్, రావెళ్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం గ్రీవెన్స్‌ల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం గ్రీవెన్స్‌లను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. తల్లికి వందనం పథకానికి వచ్చిన అర్జీల విషయంలో జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పలు మండలాల్లో ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నందున ఇళ్ల నిర్మాణ పురోగతిపై ప్రభావం పడిందని హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్ ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ చురుకుగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఈ బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రంలోపు దీనికి సంబంధించిన జాబితాలను పంపించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పురోతిపై ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సిబ్బంది పనితీరుతో పాటు ప్రవర్తన కూడా అత్యంత కీలకమనే విషయాన్ని గుర్తించాలన్నారు. పీ4 పథకంలో మార్గదర్శకులను త్వరగా ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన జాబితాలో అర్హులకు స్థానం లేనట్లు అయితే అలాంటి వారిని కూడా గుర్తించేందుకు గ్రామసభలను త్వరగా నిర్వహించాలన్నారు. పారిశుధ్యంతో పాటు ఇతర సేవలపై ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రభుత్వం నేరుగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. ఉపాధి పథకంలో వ్యవసాయ, అనుబంధ పనులు చేపట్టేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిషింగ్ పాండ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ పనులు ఇంకా ప్రారంభం కానుందన ఉపాధి పనులు వేగవంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సంరక్షణ కోసం చేపట్టే పనుల ఫొటోలను తనకు పంపించడంతో పాటు సంబంధిత కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. పల్లె పండుగ-2లో భాగంగా ప్రభుత్వం జిల్లాకు 1,458 క్యాటిల్‌షెడ్స్‌ను కేటాయించిందని, ఆ పనులకు త్వరగా అనుమతులు తీసుకొని నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

కొండపి పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్

- రేపు నోటిఫికేషన్
- ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ
- వచ్చేనెల 10న పోలింగ్..
- అదేరోజు ఫలితాల ప్రకటన
- సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు



కొండపి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆ ప్రకారం ఈనెల 30న ఎన్నికల అధికారి ఓటర్ల జాబితాను ప్రచురించి నోటిఫికేషన్ ప్రకటిస్తారు. ఆరోజు నుంచి వచ్చేనెల 1వతేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 2వ తేదీ 8 గంటల తర్వాత నామినేషన్లను పరిశీలిస్తారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తిరస్కరించబడిన నామినేషన్‌ల అప్పీలుకు అవకాశం ఉంటుంది. 5వ తేదీ మధ్యాహ్నం 3గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను 5వ తేదీ 3గంటల తర్వాత అధికారులు ప్రకటిస్తారు. 10వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. అదేరోజు కానీ, తర్వాత కానీ ఎన్నికైన వార్డు సభ్యులు ఉపసర్పంచ్‌ను ఎన్నుకుంటారు. రీకౌంటింగ్ అవసరమైతే 12వ తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు.

సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు కేటాయింపు

కొండపి సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించారు. గ్రామ పంచాయతీని మొత్తం 14 వార్డులుగా విభజించారు. ఆప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. వార్డుల రిజర్వేషన్‌లను కూడా ఇప్పటికే అధికారులు ఖరారు చేశారు. 1వార్డు అన్‌రిజర్వుడు, 2వార్డు ఎస్సీ జనరల్, 3వ వార్డు అన్‌రిజర్వుడు, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు బీసీ జనరల్, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు జనరల్‌కు కేటాయించారు. 8వ వార్డు బీసీ మహిళకు, 9వ వార్డు అన్‌రిజర్వుడు, 10వ వార్డు ఎస్సీ జనరల్, 11వ వార్డు ఎస్సీ మహిళ, 12వ వార్డు బీసీ మహిళ, 13వ వార్డు అన్‌రిజర్వుడు, 14వ వార్డు అన్‌రిజర్వుడు మహిళకు ఖరారు చేశారు. కొండపి గ్రామ పంచాయతీలో కొండపి, కట్టావారిపాలెం, దాసరెడ్డిపాలెం, ముక్కోడిపాలెం గ్రామాలున్నాయి. వీటిలో దాదాపు 6,200 మందికి పైగా ఓటర్లు ఉన్నారు.

13 ఏళ్ల తర్వాత ఎన్నికల నిర్వహణ

కొండపి గ్రామ పంచాయతీకి చివరిసారిగా 2006 డిసెంబర్ 4న ఎన్నిక జరిగింది. అప్పుడు సర్పంచ్‌గా గెలిచిన మోరపాకుల చినయోగయ్య (రాజబాబు) 16.1.2007 నుంచి 16.1.2012 వరకు కొనసాగారు. 2012 తర్వాత కొండపి గ్రామ పంచాయతీ విభజన విషయంలో కొందరు కోర్టుకెక్కారు. కేసు పెండింగ్‌లో ఉండటంతో రెండు పర్యాయాలు పంచాయతీకి ఎన్నికలు జరగలేదు.

రూ.మూడు కోట్లకుపైగా నిధులు రాలేదు

కొండపి గ్రామ పంచాయతీకి రెండు పర్యాయాలు స్థానిక సంస్థలతోపాటు ఎన్నికలు జరగలేదు. దీంతో 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు, వివిధ గ్రాంట్లు రాకపోవడంతో పంచాయతీలో అభివృద్ధి కుంటుపడిపోయింది. ఎట్టకేలకు కోర్టు ఆదేశాలతో గ్రామసభలు నిర్వహించి కొండపి గ్రామ పంచాయతీని విడగొట్టవద్దంటూ గ్రామసభ సభ్యులు తీర్మానించడంతో కేసు ముగిసిపోయింది. కోర్టు చిక్కులు తొలగడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

కొప్పెరపాడు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి శరవేగంగా పనులు



శ్మశాన వాటికలో తుమ్మ చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి చిట్టడవిలా మారి అభివృద్ధికి నోచుకొని కొప్పెరపాడు హిందు శ్మశాన వాటిక అభివృద్ధి పనులు గ్రామ పంచాయతీ నిధులతో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని వి.కొప్పెరపాడు గ్రామంలో ఉన్న హిందు శ్మశాన వాటిక స్థలంలో పిచ్చి మొక్కలు అడవి తుమ్మచెట్లు పెద్దఎత్తున పెరిగాయి. దీంతో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నో ఎళ్ల నుంచి శ్మశానం అభివృద్ధి పరచలేదు. దీంతో ప్రజల ఇబ్బందులను గమనించిన గ్రామ ఉపసర్పంచ్ నాగినేని ప్రసన్నకుమారి పంచాయతీ నిధులతో శ్మశాన స్థలంలో ఉన్న అడవి తుమ్మ చెట్లను పూర్తిస్థాయిలో తొలగించే పనులు చేయిస్తున్నారు. ఎంతోకాలం నుంచి ఉన్న సమస్యను టీడీపీ కూటమి ప్రభుత్వం కృషితో గ్రామ పంచాయతీ పరిష్కరిస్తుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన స్థలంతో పాటు పక్కనే ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని కూడా వినియోగంలోకి తీసుకువస్తామని ఉపసర్పంచ్ తెలిపారు. హిందు శ్మశాన స్థలాన్ని ఉపాధి హామీ పథకం నిధులతో త్వరలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా నిధులు మంజురు చేయిస్తామని వారు తెలిపారు.



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

వేణుగోపాల స్వామి ట్రస్ట్ బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం

నాగులుప్పలపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీ వేణుగోపాల ఆళ్వారాజుల స్వామి వార్ల దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. వేణుగోపాల స్వామి దేవస్థానం వద్ద జరిగిన కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో రామకృష్ణలు ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన మాగులూరి సత్యనారాయణతో పాటు సభ్యులు దీవి శ్రీధర్ బాబు, ఉప్పుగుండూరు శేషారావు, బట్టు సుజాత, పాలపర్తి రమాదేవి, కె.జయమ్మ, మక్కెన ప్రసన్న, కొప్పర్తి సింగమ్మ, తులసి రామకోటేశ్వరరావు లతో ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం ఆలయంలో అర్చకులు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రమాణ స్వీకారం చేసిన ట్రస్ట్ బోర్డు సభ్యులను టీడీపీ గ్రామ నాయకులు కాట్రగడ్డ చంద్రబాబు,కనగాల కృష్ణ, గుమ్మడి చిన్నా,కనగాల శ్రీనివాసరావు,బి.సెల్వం,మసిముక్కు భాస్కరరావు, బెల్లం శ్రీను అభినందించారు.

నేడు కార్పొరేషన్ సమావేశం

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ హాలులో జరగనుంది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టే 120 అంశాలను అజెండాలో పొందుపరిచారు. మొదట ఈనెల 30న సమావేశం జరగాల్సి ఉండగా, ఆ తర్వాత 31వ తేదీకి మార్పు చేశారు. అయితే తిరిగి అత్యవసర సమావేశంగా ఈనెల 29న నిర్వహిస్తుండగా, భారీ అజెండాతో 120 అంశాలను పొందుపరచడం ఇదే తొలిసారి .

ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘడియపూడి గ్రామంలో శ్రీ అంకమ్మతల్లి కొలుపులు ఘనంగా జరిగాయి. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేసిన టీడీపీ నాయకులు కావూరి విజయ్‌రాజ్‌ను గ్రామస్థులు, ఎమ్మెల్యే విజయ్ కుమార్ శాలువతో ఘనంగా సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, అన్నంనేని సుబ్బారావు, మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, వడ్డెంపూడి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

నటరాజ కళాకేంద్రం అభివృద్ధికి సహకరిస్తా

మద్దిపాడు నటరాజ కళాకేంద్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నటరాజ కళాకేంద్రం ఏడవ వార్షికోత్సవం విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ మాజీ అధికారి రాఘవరావు, సంఘ అధ్యక్షుడు దేవరశెట్టి యలమంద, గంటా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు ఉప్పుగుండూరి నాగేశ్వర రావును ఘనంగా సన్మానించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీల విషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఈసందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వారు సంతృప్తిచెందేలా పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలిచాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఒబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్థసారథి, కుమార్ తదితరులు ఉన్నారు.

● ఒంగోలులోని పత్తివారివీధిలో ఉన్న మసీదు ఎన్నికల నిర్వహణలో ఎన్నికల అధికారి ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆ మసీదుకు చెందిన ముస్లింలు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని,అందరి అభిప్రాయాలను తీసుకునే విధంగా చూడాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 84 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల సమస్యను వింటున్నఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం,జూలై 28(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలు చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి 84 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. పోలీసు అధికారులు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, సీఐలు దుర్గా ప్రసాద్ , షమీముల్లా, పాండురంగారావు, ఎస్సై జనార్దనరావు ఉన్నారు.


పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వేదికపై నగర మేయర్ సుజాత, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య తదితరులు

శతాబ్ది ఉత్సవాల నిర్వహణ అభినందనీయం

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి):ఒక పాఠశాల స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవటం, ఆ పాఠశాల ఔన్నత్యాన్ని చాటిచెప్పేవిధంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించటం అభినందనీయమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన రావు అన్నారు. స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల శతాబ్ది ఉత్సవ కమిటీ ప్రతినిధి ఆరిగ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పీవీఆర్ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాలలో ఉన్నారని, నాటి గురువులను, తోటి విద్యార్థుల స్నేహాన్ని గుర్తుచేసుకునే విధంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించటం గర్వించదగిన విషయమని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు కార్పొరేషన్ తరపున పూర్తి సహకారం అందజేస్తామని తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ పీవీఆర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిగా తను ఎంతో గర్వపడతానని అన్నారు. ఒంగోలు మునిసిపల్ మాజీ ఛైర్మన్ మంత్రి శ్రీనివాస రావు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల ద్వారా 3 వేల మందికి పైగా పూర్వ విద్యార్థులు ఒక చోట కలిసేవిధంగా చేయటం పట్ల నిర్వాహక కమిటీని అభినందించారు. పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొప్పోలు హనుమంత రావు ప్రసంగిస్తూ తన తండ్రి కూడా పీవీఆర్ పాఠశాలలోనే చదివారని, తాను ఇదే పాఠశాలలో చదివి ఆ పాఠశాలలోనే సేవలు అందించటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శాండిల్య, నిర్వహణ కమిటీ ప్రతినిధులు బేతంశెట్టి హరిబాబు, గడియారం సుబ్బయ్య శర్మ, పలువురు పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆరోగ్యభరోసా

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయంతో ఆరోగ్య భరోసా లభిస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు రూ. 18.62 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. వివిధ అనారోగ్య కారణాలతో శస్త్ర చికిత్సలు చేయించుకుని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ప్రమాదకరంగా కాలువలు

● పగిలిపోయిన పైకప్పు బండలు
● వాటిమీద నుంచే నడిచి వెళుతున్న ప్రజలు


కలెక్టరేట్ వద్ద కాలువపై దెబ్బతిన్న బండలు





ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిపాలన భవన్(కలెక్టరేట్) ముందు ఉన్న కాలువలు ప్రమాదభరితంగా మారాయి. కాలువలపై వేసిన బండలు పగిలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా కలెక్టరేట్‌కు నిరంతరం జిల్లా నలుమూలలనుంచి ప్రజలు భారీగా తరలివస్తుంటారు. సోమవారం జరిగే గ్రీవెన్స్ రోజుతో పాటు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాల సమయంలో వివిధ వర్గాల వారు భారీగా తరలివస్తుంటారు. ఆ సమయంలో ధర్నాలను కాలువలపైనే టెంట్లు వేసుకొని నిర్వహిస్తుంటారు. సాధారణంగా నడిచివెళ్లే ప్రజలు ఆ కాలువలపై వేసిన బండలమీదనే నడుచుకుంటూ వెళ్తుంటారు. అయితే కాలువలపై ఉన్న బండలు పగిలిపోయి దర్శనం ఇస్తున్నాయి. ఏదైనా పొరబాటు జరిగితే కాలువలో పడిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కాలువలపై కొత్తబండలు వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న హేతువాద సంఘం నాయకులు

జీవోను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సాయిబాబా వందో శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. హేతువాద సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే శతజయంతి ఉత్సవాలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను చించి వేశారు. ఈకార్యక్రమంలో హేతువాద, వివిధ సంఘాల నాయకులు గుమ్మళ్ల నరసింహారావు, ఉప్పుటూరి ప్రకాశరావు, పేరం సత్యం, ఎం.రామ్, శిఖా చంద్రశేఖరరావు, నజీర్, ఎంకే బేగ్ తదితరులు ఉన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కౌన్సెలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వివాహనికి ముందు, ఇతర సంబంధిత విషయాలపై మార్గదర్శకత్వం పొందేందుకు ఏర్పాటుచేసిన ప్రీ- మెరిటల్ కౌన్సెలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, ఐసీడీఎస్ పీడీ సువర్ణతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

భూముల అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం చెర్వుకొమ్ముపాలెంలో మాదిగ కులానికి చెందిన వ్యక్తుల భూములను అక్రమంగా చేసిన ఆన్‌లైన్‌ను రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ దళితుల భూమిని అక్రమంగా అన్‌లైన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సమితి నాయకులు పేముల యోహాను, షేక్ జిలాని, ఎస్. ధనరాజ్, టి. సుబ్బారావు, కే చక్రవర్తి, పెద్ద నరసయ్య, బి.సుశీల, మూల యలమందమ్మ తదితరులు ఉన్నారు.

సంక్షేమ రథ సారథి చంద్రబాబు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్
● ఇంటింటికీ తిరిగి కరపత్రాల పంపిణీ


మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జులై 28 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమపథకాలను అందించి అదుకుంటున్న సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని గుమ్మళంపాడు గ్రామంలో ఇంటింటికీ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రజలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను మభ్యపెట్టి పరిపాలన సాగించారని, నేడు కూటమి ప్రభుత్వసారథ్యంలో చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్లతో పాటుగా నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నిర్వహణ, ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, తదితర అంశాలు అమలు చేశారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

గృహాలు, స్థలాలను పక్కాగా సర్వే చేయాలి

ఒంగోలు (రూరల్), జూలై28(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో గృహాలను, స్థలాలను పక్కాగా సర్వేచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో యూ. శేషుబాబు అన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం స్వమిత్వ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శేషుబాబు మాట్లాడుతూ గ్రామాల పరిధిలో గల స్థలాలకు స్వమిత్వ ద్వారా సర్వే కొలతలు కొలిసిన తరువాత వారి స్థలాల వివరాలను రికార్డులలో పొందుపరచాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాల చెన్నయ్య,పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వేయర్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు


స్వమిత్వ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శేషుబాబు

31 న సామాజిక బహిరంగ ప్రజావేదిక

ఉపాధి హామీ పనుల నిర్వహణపై సామాజిక బహిరంగ ప్రజావేదిక ఒంగోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 31 ఉదయం 10గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో యు.శేషుబాబు సోమవారం ఒకప్రకటనలో తెలిపారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ

ఒంగోలు మండలం యరజర్ల గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్‌లు , ఒక గోడగడియారాన్ని సోమవారం బరూరి హనుమయ్య ,కనకమ్మ జ్ఞాపకార్థం వారికుమారులు బహూకరించారు. ఈకార్యక్రమంలో దాతలు బరూరి శివప్రసాదు శర్మ, శ్రీరామచంద్రమూర్తి , శ్రీనివాసమూర్తి ,పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలపై కాంగ్రెస్ పార్టీ నిరసన

ఒంగోలు క్రైం,జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ దంగంలో అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్ ఎదరుగా ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బీఆర్ గౌస్ నేతృత్వంలో విద్యుత్ విధానాలకు వ్యతిరేకంగా కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. గతంలో స్మార్టు మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటామని చెప్పిన టీడీపీ ప్రస్తుతం అవే విధానాలు అమలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల వలన ప్రజలకు నష్టం వాటిల్లుతుందని, వాటి ఏర్పాటును నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రసూల్, దాసరి రవి, ఉంగరాల శ్రీనివాసరావు ఉన్నారు.


విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

యాదవ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఇతరులకు ఇవ్వవద్దు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని 78/1 సర్వేనెంబరులో 70 సెంట్ల భూమిని శ్రీ కృష్ణ కల్యాణ మండపం, యాదవ భవన నిర్మాణానికి మంజూరు చేసినందున ఆ స్థలాన్ని ఇతర శాఖలకు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలని యాదవ మహాసభ నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆల్ ఇండియా యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శంకర్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్పొరేటర్లు తదితరులు కలిసి వివరించారు. వారిలో బొట్లా సుబ్బారావు, సీహెచ్ తిరుమల రావు, వై. నాగరాజు, ఎం. రాజు, జే వెంకటేష్, ఎంవీ రామకృష్ణ, కే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

● సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చావా హజరత్తయ్య హెచ్చరించారు. అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.స్థానిక విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయని, పాశవికమైన ఆలోచనల వలనే ఇటువంటివి చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

పొన్నలూరు : కొండపి సీఐ సోమశేఖర్ సోమవారం పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై అనూక్, సిబ్బందితో సమావేశమయ్యారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి దర్యాప్తు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.

డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే చేయాలి

మద్దిపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతంలో డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే చేసి పారదర్శకంగా కొలతలు వేయాలని మద్దిపాడు డిప్యూటీ ఎంపీడీవో కొండేపి రఘుబాబు తెలిపారు. సోమవారం మద్దిపాడు మండల పరిషత్ సమావేశమందిరంలో స్వామిత్వ పథకం అమలుపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్వామిత్వ ఫేజ్ 2 గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన అన్నంగి, ఏడుగుండ్లపాడు, గార్లపాడు, కొలచనకోట, లింగంగుంట, మల్లవరం, పెదకొత్తపల్లి, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సర్వేయర్‌లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధులకు నివాళి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : భారత విప్లవ కమ్యూనిస్టు యోధులు తరిమెల నాగిరెడ్డి, దేవలపల్లి వెంకటేశ్వరరావు, మంజూదార్ వర్ధంతిని సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈసందర్భంగా కమ్యూనిస్టు యోధుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు, వివిధ సంఘాల నాయకులు కొంగర నరసింహం, బి. సుబ్బారావు, ఎం. జార్జి, పేరం సత్యం, లక్ష్మీనారాయణ, పేరయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఫాంపాండ్స్‌ను పరిశీలించనున్న కలెక్టర్

కంభం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఉపాధి హామీ కింద నిర్మించిన 4 ఫాంపాండ్స్‌ను పరిశీలించనున్నట్లు ఏపీవో జీవరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటలకు కందులాపురం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన 2 ఫారంఫాండ్స్‌ను, కంభం పంచాయతీ పరిధిలో నాగులవరం రూటులో ఏర్పాటు చేసిన 2 ఫారం ఫాండ్స్‌ను కలెక్టర్ సందర్శిస్తారని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పేద ఆర్యవైశ్య కుటుంబాల్లో 10, ఇంటర్ టాపర్లు అయిన విద్యార్థులు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆవోపా అధ్యక్షులు దారా రాములు ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల విద్యార్థులు 6వ తేదీలోపు దరఖాస్తు చేసుఓవాలని పేర్కొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డైట్ అధ్యాపకుడు

పొదిలి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలలను డైట్ అధ్యాపకుడు పులుకూరి మెర్సిన్‌బాబు సోమవారం తనిఖీ చేశారు. ఉప్పలపాడు మోడల్ పాఠశాల, పార్వతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలి పట్టణంలోని భవితా కేంద్రాన్ని తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో అసెంబ్లీ నిర్వహణ అంశాలు, విద్యార్థుల హాజరు నమోదు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలను పరిశీలించారు. పాఠశాల సంసిద్ధత కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి విద్యార్థులు చదవటం, రాయటం, ఉచ్చారణ దోషాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 నాగలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్ వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, భవితా కేంద్రం నిర్వాహకురాలు కిరణ్మయి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

గిద్దలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై విపరీతమైన భారాలు మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన గిద్దలూరు మండల సీఐటీయూ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ సామాన్యులకు షాక్ ఇచ్చే ఆదానికి మేలు చేసే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఎక్కడికక్కడ అడ్డుకోవాలని కోరారు.స్మార్ట్ మీటర్ల రద్దు కోసం ఆగస్టు 5వ తేదీన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద జరగనున్న ధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య, మండలశాఖ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే తన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆవ్యాధికి సంబంధించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణకే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఆహారం కలుషితమైందన్నారు. ప్రధానంగా నీరు, ప్లాస్టిక్, జంక్ ఫుడ్స్‌తో ప్రజలు వివిధ రకాల అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. హైపటైటిస్ - బీతో ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. ఈవ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే మందుల ద్వారా నయమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన, వైద్యాధికారి వెంకటఫణి, తదితరులు పాల్గొన్నారు.జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హైపటైటిస్ - బీ ఉచిత వైద్య నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈశిబిరంలో 640 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి హెపటైటిస్- బీ ఉన్నట్లు నిర్ధారణఅయింది. వీరికి తక్షణమే వైద్య సహాయం అందించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వైద్యం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి వేడుకలు

గిద్దలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు నాగులచవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని రేడియోబావి సెంటర్‌లోని నాగమయ్య దేవాలయానికి, కొంగళవీడు రోడ్డులోని నారాయణస్వామి, నాగమయ్య దేవాలయానికి, వివిధ దేవాలయాలలో ప్రతిష్ఠించిన నాగమయ్య విగ్రహాలకు భక్తులు పాలు పోసి పూజలు చేశారు.

కంభంలో...

కంభం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కంభం, అర్ధవీడు మండలాల్లో సోమవారం నాగపంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏటా శ్రావణమాసం శుద్ధపంచమి రోజును నాగపంచమి లేదా గరుడ పంచమి అంటారు. నాగులచవితి మాదిరిగానే నాగపంచమి రోజున నాగదేవతను పూజించి పుట్టలో పాలు పోస్తారు. సోమవారం కంభంలో కోటాసత్యమాంబదేవి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయం, కోటేశ్వరస్వామి ఆలయం, రావిపాడు వెళ్లే దారిలో, పలు గ్రామాలలో వెలసిన నాగులపుట్టల వద్ద మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పుట్టలో పాలు, కోడిగుడ్లను విడిచి మొక్కులు తీర్చుకున్నారు.



కంభంలో పూజలు చేస్తున్న మహిళలు

అనుమలవీడు గ్రామంలో...

రాచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములవీడు గ్రామంలో నాగుల చవితి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. దొనపాటి మల్లికార్జున రెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో మహిళలు నాగమయ్య స్వామికి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.



అనుమలవీడులో నాగమయ్య స్వామి

శివాలయంలో రుద్రహోమాలు

పుల్లలచెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాపలమడుగులో ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో వేదపండితులు రుద్రహోమాలు చేశారు. సోమవారం శ్రావణ సోమవారం సందర్భంగా వేదపండితులు విశ్వకర్మ స్తపతి ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం, నవగ్రహహోమం, సుదర్శన హోమం, రుద్ర హామం, పూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని, అంటువ్యాధుల రాకుండా చూడాలని హోమాలు చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి యోగయ్య స్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సుదర్శన, రుద్రహామం చేస్తున్న వేదపండితులు

పునరావాసానికీ బిల్లుల పెండింగ్

వెలిగొండ నిర్వాసితుల కాలనీలకు నిధుల సమస్య

గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి కోట్లలో బకాయిలు

త్రిపురాంతకం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ నిర్వాసిత పునరావాస కాలనీలకు బకాయిలు పెండింగ్ ఉండటంతో పనులు నిలిచిపోయాయి. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్న ప్రభుత్వాలు వారి కోసం ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీల్లో మౌలికవసతులు కల్పించటంలో కూడా నిర్లక్ష్యం చూపుతోంది. గత ప్రభుత్వం ఈ పునరావాసకాలనీలను పూర్తిగా వదిలేసింది. ఈనెల 7న పునరావాసం-పరిహాసం అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీనిపై జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీరు అబుతలీమ్ వివరణ ఇచ్చారు. అధికారికంగా ఆయన ఇచ్చిన వివరాలను బట్టి పునరావాసానికి కూడా గత ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా నిలిచిపోయాయి.

అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...

నాలుగుచోట్ల పునరావాసకాలనీల్లో చేసిన పనులకు గాను 14 కోట్ల 74లక్షల రూపాయలు బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది.

- ఇడుపూరు -1 పునరావాస కాలనీలో ఆలయాల నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉండగా బిల్లులు ఇవ్వని కారణంగా కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు.
- ఇడుపూరు-2 కాలనీలో సీతాలమ్మ, పోలేరమ్మ, వీరభద్రస్వామి తదితర ఆలయాల నిర్మాణం కూడా బిల్లులు రావాల్సి ఉండటంతో నిలిపివేశారు.
- దేవరాజుగట్టు పునరావాస కాలనీలో గతంలో ఉన్న కాంట్రాక్టరును తొలగించి వేరే కాంట్రాక్టరుతో పనులు చేపట్టారు.
- తోకపల్లి కాలనీలో స్మశానవాటిక నిర్మాణం, తపాలభవనం, వైద్యశాల, పశువైద్యశాల భవనం నిర్మాణం చేపట్టాల్సి ఉండగా కాంట్రాక్టరుకు 2 కోట్లకు పైగా బకాయిలు నిలిచిపోవటంతో పనులు ఆపివేశారు.
- మొత్తంమీద గోగులదిన్నె కాలనీ కాంట్రాక్టరుకు ఎక్కువ మొత్తంలో బిల్లులు నిలిచిపోయాయి. ఇక్కడ 9 కోట్ల 10లక్షల రూపాయలు కాంట్రాక్టరుకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

పునరావాస కాలనీల్లో ప్రస్తుతం ఎటువంటి పనుల జరగటం లేదని అధికారులు తెలిపారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన బిల్లులు చెల్లించిన తరువాత మళ్లీ పనులు చేపట్టే అవకాశాలున్నాయి.

కాంట్రాక్టర్లకు పెండింగ్ ఉన్న బిల్లులు:

పునరావాసకాలనీ	బకాయి(లక్షల్లో)
ఇడుపూరు- 1	రూ. 16.60
ఇడుపూరు - 2	రూ. 28.21
దేవరాజుగట్టు	రూ. 315.00
తోకపల్లి	రూ. 205.00
గోగులదిన్నె	రూ. 910.00



తోకపల్లి పునరావాసకాలనీ ముఖద్వారం

సుందరయ్య కాలనీలో పాఠశాల భవనం నిర్మించాలి

మున్సిపల్ కార్యాలయం ఎదురుగా బైఠాయింపు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 28 ఆంధ్రజ్యోతి : పట్టణంలోని సుందరయ్య కాలనీలో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదురు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 80 మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రైవేట్ భవనంలో పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేసినా సౌకర్యాలు లేవన్నారు. చిన్నపాటి వర్షం పడినా పైకప్పు కారుతుందని తెలిపారు. అద్దె భవనంలో నడుస్తున్న ఈ పాఠశాలలో మరుగుదొడ్లు, వంటగది కూడా లేవన్నారు. వెంటనే ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ నారాయణరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖాధికారితో మాట్లాడి పాఠశాల భవనాన్ని పరిశీలిస్తామని, స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించేలా అధికారులకు నివేదికలు పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డీకేఎం రఫి, రూబెన్, కాశయ్య, షారా, బుజ్జమ్మ, విక్టర్, ఎలిశా, వందనం, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమస్యలను కమిషనర్‌కు వివరిస్తున్న నాయకులు

గ్రామాల్లో సర్వే సమర్థంగా చేయండి

తర్లుపాడు, జూలై 28 ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో స్వమిత్ర సర్వేను సమర్థంగా నిర్వహించాలని ఈవోఆర్డీ సుకుమార్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వమిత్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ మనోహర్ మాట్లాడుతూ 2వ విడత 8 గ్రామాల్లో గానుగపెంట, గొల్లపల్లి, కలుజువ్వలపాడు, కేతగుడిపి, బోరుగుంతలపాడు, ఫత్తేపురం, రాగిసముద్రం, రోలుగుంపాడులలో గ్రామాల్లో సర్వే నిర్వహించాల్సిన తీరును వివరించారు. గ్రామం మొత్తం మ్యాప్ తయారు చేసి ప్రతి ఇంటిని కొలతలు వేసి ఆన్‌లైన్ చేయాలన్నారు. పొలాలను కూడా సర్వే చేసి తప్పులు లేకుండా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

గ్రామకంఠ భూములు ఫీల్డ్ పైకి వెళ్లి సర్వే చేయాలి

రాచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామకంఠ భూములను క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేయాలని మాస్టర్ ట్రైనర్ ఎస్ మౌనిక చెప్పారు. స్వామిత్వ -2 కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఆమె పంచాయితీ కార్యదర్శులకు, వీఆర్వోలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, సర్వేయర్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామకంఠంలో ఉన్న ప్రతి ఇంటినీ సర్వే చేయడం, నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ సర్వే చేయడం, ఫీల్డ్‌కు వెళ్లి ప్రతి ఇంటిని కొలతలు వేసి క్యూజిఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో క్రాస్ చెక్ చేయడం, సర్వే అనంతరం ప్రతి ఇంటికీ ఎల్‌పీఎన్ కేటాయించడం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈవోఆర్డీ సుకుమార్



భగవద్గీత ఊరేగింపు విశిష్టతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

కృష్ణభగవానుడిని మాత్రమే ఊరేగించాలి

రాచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ భగవానుడికి మాత్రమే ఊరేగింపు చేయాలని త్రైత సిద్ధాంతంలో జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి కంభం కమిటీ అధ్యక్షులు ఎం శ్రీనివాసరెడ్డి చెప్పారు. త్రైత సిద్దాంత భగవద్గీత కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై సోమవారం మండలంలోని చోళ్లవీడు, చిన్నగానిపల్లి గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. దేవుడు ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అంటామని అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సిహెచ్. రామకృష్ణ, కె. శ్రీనివాసులు, నారాయణ, టి బలరామయ్య, కృష్ణారెడ్డి, పి. లక్ష్మణ్, డి. తిరుపతయ్య, పి. మస్తాన్, టి. రంగలక్ష్మీ, కె. నాగమణి, కె. భాగ్యలక్ష్మీ, డి. రాజ్యలక్ష్మీ, కె. లక్ష్మీ పద్మ, అంజలి, కె. శ్రీదేవీ పాల్గొన్నారు.

అవీఇవీ

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

పెద్ద దోర్నాల, జూలై 28(ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్థానిక నటరాజ్ కూడలిలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలులో వచ్చే నెల 20 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ప్రజా సమస్యలపై మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. ఈ సభలకు కార్మికులు, కర్షకులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు డీ శ్రీనివాస్, నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, మండల కార్యదర్శి విశ్వరూపాచారి, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వీ తిరుమలయ్య పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



ప్రశంసాపత్రాలను అందజేసిన అధ్యాపకులు

పెద్ద దోర్నాల, జూలై 28(ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచార్యులు చెప్పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఆర్‌టీఐ చట్టం అమలు చేసి ఇరవై వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కళాశాలలో క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించినట్లు శ్రీనివాసాచార్యులు తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్లారావు, విజయబాబు, ఫిలిప్, రమేష్ పాల్గొన్నారు.

దివీస్ ప్రాంగణ నియామకాలకు స్పందన



ఉద్యోగాలు సాధించిన వారితో అధ్యాపకులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 28 ఆంధ్రజ్యోతి: స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో దివీస్ ల్యాబరేటరీ ప్రాంగణ నియామకాలకు సోమవారం విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ 156 మంది ఆశావహులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారని తెలిపారు. సంస్థ హెచ్‌ఆర్ రిక్రూటర్ రామకృష్ణ మాట్లాడుతూ రాత పరీక్ష, ముఖాముఖి ద్వారా 25 మందిని ఎంపిక చేశామని వారికి నియామక పత్రాలు అందించామని చెప్పారు.

రెండు మండలాలకు జేవీవీ కమిటీల నియామకం



జన విజ్ఞాన వేదిక నూతన కమిటీ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 28 ఆంధ్రజ్యోతి : ప్రజలకు సైన్సును చేరువ చేసేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందని జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ శరత్ చెప్పారు. జన విజ్ఞాన వేదిక మార్కాపురం, పెద్దారవీడు మండలాల మహాసభలు సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ గౌరవ అధ్యక్షులుగా ఎల్‌వీ రెడ్డి, సమతా కన్వీనర్‌గా ఆర్‌ఎమ్ ఝాన్సీ పాల్, మార్కాపురం పట్టణ అధ్యక్షులుగా రామాంజనేయులు, కార్యదర్శిగా శ్రీనివాసులు, చెకుముకి సంబరాల కన్వీనర్‌గా వై.రవికుమార్ ఎన్నికయ్యారు. తర్లుపాడు అధ్యక్షులుగా విప్లవ్ కుమార్, కార్యదర్శిగా కోటి మోహన్, పెద్దారవీడు కన్వీనర్‌గా గౌతమ్ బాబులను ఎన్నుకున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రమణారెడ్డి

బేస్తవారపేట, జూలై28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవారపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో సీవీ రమణారెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు.

ముమ్మరంగా 'సుపరిపాలన తొలి అడుగు'

రాచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజా ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని నాయకులు, ప్రజలకు వివరిస్తున్నారు. చోళ్లవీడు, అచ్చంపేట గ్రామాల్లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు బత్తిని రామకృష్ణ, బత్తిని రాజశేఖర్, ఎంవీ సాయి, ఎస్ కళ్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి శ్రేణులు

మత్తు పదార్థాల బారిన పడొద్దు!

పామూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించి బంగారు భవిషత్తుకు అడుగులు వేసుకోవాలని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్ బారినపడి విలువైన జీవితాలను నాశనం చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతుందని అన్నారు. ఎంతో భవిషత్తు ఉన్న విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు

పామూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు హెచ్చరించారు. మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 521/3లో గల 4 ఎకరాల 10 సెంట్ల భూమిని ఆక్రమించారు. విషయం తెలుసుకొన్న తహసీల్దార్ వీఆర్వో బి.కుమార్‌ను పంపించి ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమణలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ బోర్డును ఏర్పాటుచేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిఉండాలి

పామూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మహిళల సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలపై గ్రామైఖ్య సంఘం సభ్యులు అవగాహన పెంచుకోవాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ అన్నారు. తద్వార పొదుపు గ్రూపు సభ్యులకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీఎం జి.విద్యాసాగర్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రణాలను సభ్యులు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలని సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య కార్యదర్శి ఉమ్మడి పద్మ, పాడే విజయ, సీసీలు సరళ, సుబ్రమణ్యం, సత్తార్, శ్రీనివాసులు, వీవోఏలు పాల్గొన్నారు.

జనసేనను బలోపేతం చేయాలి

పీసీపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని జనసేన నియోజకవర్గ నాయకుడు వరికూటి నాగరాజు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పెదయిర్లపాడు రాయల్‌నగర్‌లో సెంట్రల్ ఆంధ్ర కమిటీ మెంబర్ మాదాసు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు బండారు రాజు ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి నేతలతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాలెం సురేష్, రమేష్, ఏడుకొండలు, రాజ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

పామూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పువ్వాడి రాధాకృష్ణ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, పువ్వాడి వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌బాబు, ఉప్పలపాటి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహారుద్రపీఠంలో పూజలు

పీసీపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడులో ఉన్న మల్లేశ్వరస్వామి మహారుద్రపీఠాన్ని సోమవారం పలువురు భక్తులు సందర్శించారు. అక్కడ శివలింగాలకు పాలభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశార. అనంతరం మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు పలుకూరి సుబ్బారావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జూదరుల అరెస్టు

పీసీపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ జి.కోటయ్య తెలిపిన వివరాలమేరకు.. మండలంలోని నేరేడుపల్లి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందడంతో దాడులుచేశారు. ఈసందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.5,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

పీ4తో పేదలకు ప్రయోజనం

పామూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ- 4 పథకం పేదలకు ఎంతో ఉపయోగకరమని ఎంపీడీవో ఎల్‌బ్రహ్మయ్య అన్నారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్, అసిస్టెంట్లు, వీఆర్వోలు, సర్వేయర్ల శిక్షణలో పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరరామయ్య పాల్గొన్నారు.

అర్ధంతరంగా నిలిచిపోయిన రైతుబజార్

- గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే కారణం
- కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులు



దర్శిలో నిలిచిపోయిన రైతు బజార్

దర్శి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులు గిట్టుబాటు ధరలకు విక్రయించుకునేందుకు ఏర్పాటు చేయతలపెట్టిన రైతుబజార్ ఏళ్ల తరబడి మధ్యలోనే నిలిచిపోయింది. గత వైసీపీ పాలకుల అసమర్థత, నిర్లక్ష్యంతో దర్శి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పథకాలు మధ్యలో నిలిచిపోయాయి. ఈక్రమంలో రూ.80 లక్షలతో నిర్మించతలపెట్టిన రైతు బజార్ శ్లాబు లేవల్‌లో నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీకి చెందిన నాయకులు కాంట్రాక్టు పనులు దక్కించుకొని నిర్మాణం చేపట్టారు. కొంతమేర పనులుచేసిన తర్వాత బిల్లు తయారుచేసి అధికారుల ద్వారా పంపారు. నిధుల కొరతతో బిల్లు మంజూరు కాలేదు. దీంతో ఆ కాంట్రాక్టరు పనులను మధ్యలో వదిలేశారు.

అనంతరం ఎన్నికలు రావటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రైతులు పండించిన కూరగాయలు, పండ్లు విక్రయించుకునేందుకు వీలుగా మొత్తం 40 షాపులు నిర్మించతలపెట్టారు. అందులో ఎనిమిది షాపులకు షట్టర్లు బిగించి అద్దెలకు ఇచ్చే విధంగా నిర్ణయించారు. మిగిలిన 32 షాపులు కూరగాయలు, పండ్లు ఇతర వస్తువులు విక్రయించుకునేందుకు రైతులకు ఉచితంగా ఇస్తారు. సుమారు మూడు సంవత్సరాల క్రింత నిర్మించతలపెట్టిన రైతుబజారు మధ్యలోనే నిలిచిపోయింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నిలిచిపోయిన రైతుబజారును పరిశీలించారు. మార్కెటింగ్ శాఖ మంత్రి, సంబంధిత అధికారు లతో చర్చించి నిలిచిన రైతుబజారు నిర్మాణానికి నిధుల విడుదల చేయాలని కోరటంతో కదలిక వచ్చింది. ఇటీవల అధికారులు గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.23 లక్షలకు బిల్లులు చేసి పంపారు. ఆ బిల్లులు విడుదల అయిన తర్వాత మిగిలిన పనులను పూర్తిచేయటం జరుగుతుందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

అయితే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన టెండర్లు రద్దుచేసి కొత్త టెండర్లు పిలుస్తారని తెలుస్తుంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా రైతులకు ఎంతో అవసరమైన రైతుబజారు పునర్నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కనిగిరి పట్టణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి చైర్మన్ గఫార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరిలో అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు అవసరమని మున్సిపల్ శాఖమంత్రి నారాయణను కోరినట్టు చెప్పారు. ఆయన సానుకూలంగా స్పందించి రూ.3 కోట్లు రూపాయలు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. రూ.8.34 కోట్లతో 51 పనులకు ప్రతిపాదనలకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఒక్కో వార్డుకు రూ.10 లక్షలమేర పనులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలను కాకుండా వేరే అభివృద్ధి పనుల జాబితాను కౌన్సిలర్లు ఇవ్వాలన్నారు.

నీటి సరఫరా కోసం కొత్త పైపులైన్లు ఏర్పాటుచేసే క్రమంలో డ్రైనేజీ, సీసీ రోడ్లను తవ్వాల్సివస్తే పెట్టిన ఖర్చు వృధా అవుతుందని ఎమ్మెల్యే అభిప్రాయం వ్యక్తంచేశారు. కనిగిరికి రామ తీర్థం నీటిని అందింజేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ పులి శాంతి మాట్లాడుతూ దొరువును అభివృద్ధి చేయాలని కోరారు. స్వచ్ఛ కార్యక్రమాన్ని ఈసారి దొరువు వద్ద ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యేను కోరారు. డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ దొరువు అభివృద్ధి కోసం ఇప్పటికే దేవదాయ శాఖ అధికారులతో చర్చించినట్టు చెప్పారు. కొండపైన శివాలయం, దొరువు వద్ద ఉన్న ఆలయాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. దొరువు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలోని అనధికారికంగా వేసిన లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. 90 రోజులలోపు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ టీపీఎస్ సువర్ణకుమార్, ఆర్ఐ ప్రదీప్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి



పశువుల నీటి తొట్లను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ముండ్లమూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ లుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా చర్యలు తీసు కోవాలని ఎన్ఎల్ఎం కేంద్ర బృందం సభ్యులు ప్రభాస్ శర్మ, నందలాల్ గుర్జార్ అన్నారు. సోమవారం మండలంలోని మారెళ్ళ గ్రామంలో పర్య టించారు. ముందుగా మండలంలోని డీఆర్‌డీఏ, డ్వామా, ఉపాధి హామీ, హౌసింగ్ శాఖల అధికారులతో కలసి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో సమావేశమై ప్రజలకు పలు సూచనలు చేశా రు. ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్లు, పారం పాండ్స్‌ను పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు గ్రామంలో కెనరా బ్యాంక్‌కు వెళ్ళి ఖాతాదారులకు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిర్మించిన మారెళ్ళ - పూరిమెట్ల తా రురోడ్డును పరిశీలించారు.

కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు ఎం.శ్రీదేవి, పి.వెంకటరావు, లక్ష్మీరెడ్డి, బసవ సుబ్బరావు, ఎం. వెంకటేశ్వరరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరామర్శిస్తున్న ఎంపీపీ సుంకర సునీత

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ముండ్లమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలని ఎంపీపీ సుంకర సునీత అన్నారు. సోమవారం మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులను పరామర్శించి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మట్లాడారు. సిబ్బంది నిబద్ధతతో పని చేయాలన్నారు. రోగులకు సేవలు అందించటంలో అశ్రద్ధ చూపొద్దన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ బి.మధుశంకర్, డిప్యూటీ హెచ్‌ఈవో కేవీ రాజు, పేరిశెట్టి, ఆనంద్, ఈదర సర్పంచ్ వంగల పద్మావతి, సుంకర బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం



వైద్య పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే తన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆవ్యాధికి సంబంధించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణకే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఆహారం కలుషితమైందన్నారు. ప్రధానంగా నీరు, ప్లాస్టిక్, జంక్ ఫుడ్స్‌తో ప్రజలు వివిధ రకాల అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. హైపటైటిస్- బితో ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఈవ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే మందుల ద్వారా నయమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన, వైద్యాధికారి డాక్టర్ వెంకటపణి, తదితరులు పాల్గొన్నారు.

కాగా, జనసీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హైపటైటిస్ - బి ఉచిత వైద్య నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈశిబిరంలో 640 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి హెపటైటిస్-బి ఉన్నట్లు నిర్ధారణఅయింది. వీరికి తక్షణమే వైద్య సహాయం అందించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వైద్యం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు.

శిథిలావస్థలో పాత తహసీల్దార్ కార్యాలయం

- నిరుపయోగంగా జనరేటర్
- పట్టించుకోని అధికారులు



శిథిలస్థితిలో పాత తహసీల్దార్ కార్యాలయ భవనం

కనిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పురాతన పాత తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉంది. దశాబ్ధకాలంగా కార్యకలాపాలు లేకపోవటంతో నిరుపయోగంగా ఉంది. బ్రిటీష్ కాలంలో ఎంతో పటిష్టంగా నిర్మించిన భవనం కావటంతో గోడలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. పైపూత మాత్రమే రాలుతుంది. పై కప్పునకు ఉన్న కర్రలు రంగూన్ టేకు కావటంతో ఇప్పటికీ పటిష్టంగా ఉన్నాయి. పాత తహసీల్దార్ కార్యాలయానికి సబ్‌ట్రెజరీ కార్యాలయం కూడా మిళితమై ఉంటుంది. పైకప్పునకు రేకులు వేయిస్తే అనుకూలంగా భవనం మారుతుంది. రెండు కార్యాలయాల్లో ఎంతో విలువైన రికార్డులు ఉన్నాయి.



నిరుపయోగంగా జనరేటర్

దశాబ్ధకాలం క్రితం ఈకార్యాలయానికి జనరేటర్‌ను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంటుందనే కారణంగా కార్యాలయం మార్పు జరిగింది. జనరేటర్‌ను అక్కడే వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యంతో వానకు తడిచి, ఎండకు ఎండి పాడవుతుంది. 2009లో ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాత తహసీల్దార్ భవనం ఆనవాళ్ళు కోల్పోకుండా తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయం ఏరకంగానూ అనుకూలంగా లేదు. రికార్డు గది పాత తహసీల్దార్ కార్యాలయంలో ఉంది. రికార్డులు పరిశీలన చేయాల్సిన వచ్చినప్పుడు ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రభుత్వాసుపత్రి, ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఎస్సీ హాస్టల్‌ను బాగుచేయించారు. పాత తహసీల్దార్ భవనాన్ని కూడా పరిశీలించి పైకప్పు రేకులతో వేయించి అధికార కార్యకలాపాలను సాగించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కమలాకర్

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

ముండ్లమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేసినట్లయితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకుంటారని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. గంజాయి, గుట్కాలతో పాటు మద్యానికి అలవాటు పడవద్దన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మీ గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసు స్టేషన్‌కు గాని, డయల్ 100కు గాని ఫోన్‌చేసి తెలపాలన్నారు.

అలాగే, వాహనాలను తనిఖీచేసి మద్యం సేవించిన వాహన చోదకులపై కేసులు నమోదుచేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వీవీ హనుమంతరావు, మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, నిడమానూరి శ్రీనివాసరావు, మిత్తింటి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

ముండ్లమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సన్మానించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న రాఘవరావు, సీహెచ్ పద్మావతిలను మండల విద్యాశాఖ అధికారులు షేక్ కాలేషావలి, కె.వెంకటేశ్వర్లు సన్మానించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజినీకుమారి అధ్యక్షత వహించగా, ఎస్ఎంసీ చైర్మన్ మేదరమెట్ల సోపారావు, మోడల్ స్కూల్ చైర్మన్ వీరపనేని రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన దారా కౌషిక్ అనే విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు.

ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

ముండ్లమూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రావాల్సిన జూన్, జూలై నెలలకు సంబంధించిన జీతాలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ముండ్లమూరులోని విద్యా వనరుల కేంద్రంలో మండల ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు.

అనంతరం ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోపాళం శ్రీనివాసరావు, జి.ఎలిషా, గౌరవాధ్యక్షుడిగా మాగులూరి శ్రీనివాసరావుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, లేవీ ప్రసాదు, సీహెచ్ రామకృష్ణ, గోపాళం శ్రీనివాసరావు, డి.ఎలిషా, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 60వేలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 28(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,64,936 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.64,590, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.22,310, శాశ్వత అన్నదానానికి రూ.50,456 వచ్చినట్లు తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

తాళ్లూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై గ్రీవెన్స్ సెల్‌లో మూడు దరఖాస్తులు అందజేశారని తహసీల్దార్ బచ్చల వెంకటరమణారావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూసమస్యలపై వచ్చిన అర్జీలపై గ్రామస్థాయిలో విచారణచేసి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారి హనుమంతరావు, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఏపీవో వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ

దొనకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపాలెం గ్రామంలోని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం సోమవారం విత్తనాలు, ఎరువులను ఉచితంగా పంపిణీ చేసింది. సామూహిక ప్రదర్శన క్షేత్రాలు పథకం కింద వీటిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటే శ్వరరెడ్డి మాట్లాడుతూ కంది పంటలో తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

కురిచేడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని టీడీపీ నాయకుడు పరిటాల సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని పొట్లపాడు గ్రామంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరూ గ్రీన్ లీడర్స్‌గా ఎదగాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకుఉ చమిడిశెట్టి ఆంజనేయులు, సుదరరామయ్య, శ్రీను, అంకయ్య, బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, యోగయ్య పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలి

కనిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను అమర్చే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఎం నాయకుడు పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు అదనపు విద్యుత్ భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో పి.నరేంద్ర, బి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు




పోలేరమ్మకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు లలిత్‌సాగర్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు

తాళ్లూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసకాయలపాడులో సోమవారం పోలేరమ్మ కొలుపుల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈప్రాంతం అన్ని రంగాల్లో వృద్ధిచెందాలని ఆకాంక్షిస్తూ వారం రోజులపాటు కొలుపులు జరిపారు. మూడురోజులపాటు పోలేరమ్మకు శాంతి కార్యక్రమాలు నిర్వహించారు. బంధువులు తరలిరావటంలో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నల్లపాటి సత్యం, జి.వేణుబాబు, రాచకొండ వెంకట్రావు, వల్లభనేని సుబ్బయ్య, రామకోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు టీవీ సుబ్బారెడ్డి, పోశం మధుసూదన్‌రెడ్డి, ఆదాం షరీఫ్, మారం ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 29 జూలై 2025





సాగర్ డ్యాం నుంచి జవహార్ కుడికాలువకు నీటి సరఫరా

కుడికాల్వకు నీటి విడుదల

- 5వేల క్యూసెక్కులకు పెంచిన అధికారులు
- సాగు, తాగు నీటి అవసరాలకు 132 టీఎంసీలు
- మరో 24 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదనలు
- నేడు సాగర్ గేట్లు తెరవనున్న తెలంగాణ మంత్రులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండలా దర్శనమిస్తోంది. దీంతో జవహర్ కుడి కాల్వకు డ్యాం నుంచి నీటి విడుదలను 500 నుంచి 5 వేల కూసెక్కులకు పెంచినట్టు జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు. సాగు, తాగు అవసరాలకు 132 టీఎంసీలు నీటిని కేటాయించారు. అయితే మరో 24 టీఎంసీలు కేటాయించాలని కోరుతూ జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జూలైలోనే


సాగర్ డ్యాంకు జలకళ

పుష్కలంగా సాగునీరు సరఫరా చేయడం 18 ఏళ్లలో ఇదే తొలిసారి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పత్తి, కంది, మొక్కజొన్న పంటలను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. మరో వైపు నీరు విడుదల కావడంతో వరి సాగు పనులు ముమ్మరమయ్యాయి.


నేడు తెరచుకోనున్న సాగర్ గేట్లు

సాగర్ జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో డ్యాం క్రస్ట్ గేట్లను మంగళవారం తెరచి పులిచింతలకు నీటిని (మిగతా 6లో)

నేడు జిల్లాకు సీఎస్ రాక

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మంగళవారం బాపట్లకు రానున్నారు. ఉదయం 11:30కు కలెక్టరేట్‌లో ఆర్డీఎస్ఎస్ వర్క్స్‌పై సమీక్ష జరపనున్నారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న పనులను పరిశీలిస్తారు మధ్యాహ్నం 2:30కు చీరాలలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులపై సమీక్షిస్తారు. పీ4తో పాటు వివిధ అభివృద్ధి పనుల పురోగతి కూడా సీఎస్ సమీక్షలో చర్చకు రానున్నట్లు సమాచారం.


నిజాంపట్నం కాల్వపై తురుమెళ్ల వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

దినదిన గండం.. ప్రయాణం

శిథిలావస్థలో ప్రధాన వంతెనలు

అమృతలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు మండల పరిధిలోని పలు ప్రధాన వంతెనలు శిథిలావస్థకు చేరడంతోపాటు, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలో కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు, నిజాంపట్నం, పశ్చిమ ప్రధాన కాల్వ ఆయా గ్రామాల వద్ద ఉన్న వంతెనలు ప్రమాద భరితంగా మారాయి. పెదపూడి- పెరవలిపాలెం వెళ్లే రోడ్డులో ఎల్ జీ కాలువపై ఉన్న వంతెన కింద భాగంలో ఉన్న ఇనుప గడ్డర్ విరిగిపోవడంతో పాటు, వంతెనపైన కొద్దిభాగం కుంగిపోయింది. దీంతో ఈ వంతెన ఎప్పుడు కూలుతుందో అని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నిజాంపట్నం కాల్వపై తెనాలి - చందోలు ప్రధాన రహదారిలో పెదపూడి వంతెన వద్ద ఉన్న వంతెన ప్రమాద భరితంగా మారింది. ఈ వంతెన రెండు పక్కల దెబ్బతినడంతో వాహనదారులు కాల్వలో పడుతున్న ఘటనలు ఉన్నాయి. తురుమెళ్ళ వద్ద తూర్పుకాల్వ, నిజాంపట్నం కాల్వపై ఉన్న వంతెనలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇక్కడ నిజాంపట్నం కాల్వపై ఉన్న వంతెన కొద్దిభాగం కిందకు కుంగిపోయింది. ఈ వంతెనలు ప్రమాదకరంగా ఉండటంతో గుంటూరు నుంచి అమృతలూరు నడిచే బస్సును కూడా ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. ప్యాపర్రు వద్ద పశ్చిమ కాల్వపై ఉన్న వంతెన సైడ్ దెబ్బతిని ప్రమాద భరింతంగా మారింది. కాల్వల ఆధునికీకరణ పనుల్లో నూతన వంతెనల నిర్మాణం చేస్తారని ఆశించారు. ప్రభుత్వం స్పందించి వంతెనల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ఎల్‌జీ చానల్‌పై శిథిలావస్థకు చేరిన పెదపూడి వద్ద వంతెన

సహకారం దొరికేనా!



ఐదేళ్లుగా నిర్వీర్యమైన పీఏసీఎస్‌లు

- 82 సొసైటీలకు త్రిసభ్యకమిటీల నియామకం
- రికార్డుల డిజిటలైజేషన్ ఇప్పటికే పూర్తి
- అడ్డగోలుగా రుణాలు దోచేసిన పది ఖాతాల గుర్తింపు
- ఎరువుల విషయంలో తప్పని ఎదురుచూపులు
- త్రిసభ్య కమిటీల రాకతో పీఏసీఎస్‌లు గాడిన పడేనా?


నూజెళ్లపల్లి పీఏసీఎస్ కార్యాలయం

అన్నదాతలకు రుణాలు మొదలుకుని, ఎరువుల వరకు వెన్నుదన్నుగా ఉండడానికి పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ)లు కీలక పాత్ర వహిస్తూ వచ్చాయి. కానీ గత ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలతో ఓ దశలో సొసైటీల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల విధానానికి స్వస్తి చెప్పి అర్హత లేని వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టి సొసైటీలను దోచేయడానికి అధికారిక లైసెన్సు లిచ్చింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో సొసైటీల్లో ఆడిట్ అనేది తూతూమంత్రంగా జరిగిందే తప్ప అక్రమార్కులపై చర్యలు మాత్రం శూన్యం. కేవలం వైసీపీ నేతల సిఫారసులే ప్రామాణికంగా రైతులు కాకపోయినా సొసైటీల ద్వారా రుణాలు ఇచ్చిన ఉదంతాలు ఐదేళ్లలో కోకొల్లలు. సహకార సంఘాల్లో ఎరువుల విక్రయాన్ని దాదాపుగా అటకెక్కించారు. దీంతో సహకార సొసైటీల వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ఈ ప్రభుత్వం గద్దెనెక్కాక తొలుత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది మార్చికల్లా ఆ ఘట్టాన్ని ఓ కొలిక్కి తేగలిగింది. రికార్డులు కంప్యూటరీకరణ జరుగుతున్న సమయంలోనే సమాంతరంగా గతంలో జరిగిన అవకతవకలపై కూడా అధికారులు దృష్టి సారించారు. పెద్దమొత్తంలో గోల్‌మాల్ జరిగిన దాదాపు పది ఖాతాలను కూడా యంత్రాంగం గుర్తించింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

82 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఎన్నికలు జరిపే పాలక వర్గాలను కొలువు దీర్చాలని తొలుత ప్రభుత్వం అనుకున్నా నిబంధనల చిక్కుల వల్ల త్రిమెన్ కమిటీల వైపే ప్రభుత్వం మొగ్గు చూపింది. జిల్లాలో మొత్తం 112 పీఏసీఎస్‌లకు గాను 82కి నియామకాలు పూర్తి కాగా, ఇంకా 30 పెండింగ్‌లో ఉన్నాయి. నేడో, రేపో వీటికి కూడా త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. గాడి తప్పిన సొసైటీలకు పునరుజ్జీవం కల్పించాల్సిన గురుతర బాధ్యత కూడా ఈ కమిటీలపైనే ఉంది. గతంలో లాగా పీఏసీఎస్‌లు అన్నదాతల ప్రయోజనాల కోసం పనిచేసేలా ప్రణాళికలు రూపొందించి, పూర్తి సహకారం దక్కేలా చూడాలనేది అన్నదాతల అభ్యర్థనగా ఉంది

ఎరువుల లభ్యతపై దృష్టి పెట్టాలి

ఖరీఫ్ సాగు ముమ్మరంగా జరుగుతున్నప్పటికీ ఇప్పటికీ పీఏసీఎస్‌లలో ఎరువుల జాడే లేదు. మార్క్‌ఫెడ్ నుంచి సొసైటీలకు ఎరువులు కేటాయిస్తే వాటిని ఎమ్మార్పీ ధరలకే విక్రయించనున్నారు. ఎరువుల కోసం దూరం వెళ్లకుండా గ్రామంలోని సహకార సొసైటీల్లోనే అందుబాటులో (మిగతా 6లో)

అ'ధర'గొడుతున్న మిర్చి, టామాటా!





మార్టూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మార్టూరు కూరగాయల మార్కెట్‌లో మిరప, టమాటాకు డిమాండు పెరుగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులకు సోమవారం మార్కెట్లో కిలో మిర్చి రూ.85, టమాటా రూ.30 నుంచి రూ.50 వరకు ధర పలికింది. ఇక దుకాణాల్లో మరింత ఎక్కువ ధర చెల్లించి వినియోగదారులు కొనుగోలు చేయాల్సి ఉంది. స్థానిక రైతుల నుంచి టమాటా, మిర్చి దిగుబడి తగ్గడంతో.. కమీషన్ ఏజంట్లు చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటక, అనంతపురం నుంచి టమాటాను దిగుమతి చేసుకుంటున్నారు. నేల, పందిళ్లపైన సాగు చేసిన టమాటా పంట నాణ్యతను బట్టి మార్కెట్లో ధర పలుకుతోంది. 25 నుంచి 27 కిలోలు ఉండే టమాటా బాక్స్ రూ.500 నుంచి రూ.1,100 వరకు విక్రయిస్తున్నారు. డిసెంబరు నుంచి స్థానిక రైతుల నుంచి మార్టూరు మార్కెట్‌కు టమాటా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. 40 రోజుల నుంచి టమోటాకు డిమాండు బాగానే ఉంది. 20 రోజుల నుంచి మిర్చికి గిరాకీ పెరిగింది. పులివెందుల, మైదుకూరు, డోన్‌ల నుంచి మార్కెట్‌కు మిరప కాయలు వస్తున్నాయి. మార్చి నుంచి మే నెల వరకు రేపల్లె, బాపట్ల తదితర ప్రాంతాలు నుంచి, స్థానిక రైతుల నుంచి మిర్చి బస్తాలు మార్కెట్ కు వస్తుంటాయి. మరికొన్ని రోజులు ఈ రెండు కూరగాయలకు డిమాండ్ ఇలానే కొనసాగే అవకాశం ఉంది.

హలో.. మాస్టారూ!





మీ ఫైల్ పూర్తయింది ఒక్కసారి కలవండి..!

జడ్పీలో ఫైల్స్ కదలాలంటే పర్సంటేజీ ముట్టాల్సిందే. ఇది ఉపాధ్యాయులకూ తప్పడం లేదు. ఉపాధ్యాయులు పీఎఫ్ రుణం, విశ్రాంత ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఫైల్ పూర్తయింది.. తమని కలవాలంటూ పరిషత్‌లోని పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వారికి ఫోన్లు వస్తున్నాయి. వారితో పర్సంటేజీలు మాట్లాడుకున్న తర్వాతే..ఫైల్స్ ముందుకు కదులుతున్నాయి. లేకుంటే.. ఏదో ఒక కొర్రీ పెట్టి పెండింగ్ పెడుతున్నారు.

- పీఎఫ్ రుణం, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కూ పర్సంటేజీ..
- జడ్పీలో పీఎఫ్, ఆడిట్ సిబ్బంది వేధింపులు
- గగ్గోలు పెడుతున్న ఉపాధ్యాయులు

గుంటూరు (విద్య) జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వచ్చే ఫోన్లతో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. తాము దాచుకున్న డబ్బు.. రుణం రూపంలో పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దయనీయమైన స్థితి నెలకొందని ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కాళ్లు అరిగేలా జడ్పీ కార్యాలయంలోని విభాగాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇటీవల దాదాపు 55 మంది (మిగతా 6లో)

నాడు వెలవెల నేడు కళకళ

- కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభం


రాజుబంగారుపాలెం వద్ద షెట్టర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పర్చూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలోని చివరి ఆయకట్టులో పర్చూరు నియోజకవర్గంలోని కొమ్మమూరు కాలువ ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గ ధాన్యాగార మండలాలైన కారంచేడు, పర్చూరు, చిన్నగంజాం మండలాల్లోని చివరి ఆయకట్టులోని 40 కిలోమీటర్ల మేర ప్రవహించే భూములు సస్యశ్యామలం కానున్నాయి. దశాబ్దాల తరబడి ప్రధాన కాలువలకు, వాటి ఉపకాలువలకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో నీరు చివరి భూములకు అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు రూ.3కోట్ల వ్యయంతో కాలువల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. దీంతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. చిన్నగంజాం మండలంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రాజుబంగారుపాలెం హెడ్ స్లోయిస్ (సంతరావూరు) వద్ద రూ.90 లక్షలతో పునర్నిర్మాణానికి నూతన షట్టర్లు కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉప్పుగుండూరు ప్రాంతంలో రూ.ఐదు లక్షలతో నూతన షట్టర్లు, అలాగే కొమ్మమూరు మెయిన్ కెనాల్‌లో గుర్రపు డెక్క, జంగిల్ తొలగింపునకు నిధులు కూడా మంజూరు చేశారు. సాగునీటి సంఘం ఆధ్వర్యంలో కొమ్మమూరు కాలువ 81 కిలోమీటర్ల నుంచి 112 వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కాలువల ఆధునికీకరణ పనులతో కొమ్మమూరు కెనాల్ చివరి ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి నీటి సరఫరాలకు అవరోధాలు తగ్గుతాయని అన్నదాతలు పేర్కొంటున్నారు.

ఇసుకకు ఇబ్బంది రాకూడదు : కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక సరఫరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఐవీఆర్ఎస్‌లో ప్రజాభిప్రాయ సేకరణపై వచ్చిన ప్రతికూలతపై, సోమవారం కలెక్టర్ ఇసుకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టన్ను ఇసుకకు ఎంత వసూలు చేస్తున్నారో సంబంధిత వివరాలను కొనుగోలు చేసిన వ్యక్తులతో నేరుగా ఫోన్ చేసి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూళ్ళు చేస్తున్నట్లు వారు వివరించారు. అసంతృప్తిగా ఉన్నట్లు వివరించారు. జిల్లాలో గాజుల్లంక రీచ్ నుండి మాత్రమే ఇసుకను సరఫరా చేయటం జరుగుతుందని ప్రస్తుతం అక్కడకు లారీలు వెళ్ళడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉండటం వలన ఇతర ప్రాంతాలు నుంచి ఇసుకను సరఫరా చేయటంలో ధరలో మార్పు వచ్చిందని కమిటీ సభ్యులు ఈ సంర్భంగా కలెక్టర్‌కు వివరించారు. గాజుల్లంక రీచ్ నుండి ఇసుకసరఫరాకు దారిమార్గం తేమ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రీచ్ లో కేవలం 20వేల టన్నులు మాత్రమే ఇసుక నిల్వ ఉందని రాబోవు రెండునెలలకు మాత్రమే ఇది సరిపోతుందని వివరించారు. ఇసుక కొరతను అధికమించటానికి ఇతర జిల్లాల నుంచి ఇసుకను బాపట్లకు తరలించి నిల్వచేయాలని గనులశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. రీచ్‌ల వద్ద ఇసుకను ప్రభుత్వం నిర్ణయించిన టన్నుల కంటే ఎక్కువ మోతాదులో లారీలో నింపినట్లైతే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, చేతివాటం ప్రదర్శించకుండా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, గనులశాఖ ఏడి డి.రామచంద్ర, రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఇసుకకమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులు మరింతగా అందిపుచ్చుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గడచిన ఆరు నెలల్లో నమోదైన కేసులకు సంబంధించి పురోగతి, భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాలను గురించి ఆయన పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో మరింత తగ్గుదల నమోదవ్వాలని, రోడ్ సేఫ్టీ నిబంధనలకు సంబంధించి ప్రజల్లో కూడా అవగాహన పెంచాలని ఎస్పీ కోరారు. విధులలో ప్రజలకు మెరుగైన సేవలందిస్తేనే యూనిఫాంకు విలువ పెరుగుతుందన్నారు. స్టేషన్ మెట్లెక్కే బాధితులతో బాధ్యతగా మెలగాలన్నారు. రాత్రిపూట గస్తీ విధులను మరింత పటిష్ఠం చేయాలన్నారు. గంజాయితో పాటు ఇతర మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలని, వీటి కట్టడి కోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు

ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి..

గడచిన ఆరు నెలల వ్యవధిలో అనేక విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ తుషార్ డూడీ ప్రశంసాపత్రాలు అందించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూసిన సీఐలు సుబ్బరాజు, రాంబాబులు ప్రశంసా పత్రాలు అందుకున్నవారిలో ఉన్నారు. దొంగతనాల కేసులకు గాను ప్రాపర్టీ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను సీఐలు మల్లికార్జున రావు, హరికృష్ణ, శేషగిరిరావు, సుబ్బారావు, ఆంజనేయులు, సురేష్ బాబులను ఎస్పీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

ఉపాధి కూలీలుగా టెకీలు!

- జిల్లాలో కొనసాగుతున్న పనుల సామాజిక తనిఖీ
- అద్దంకి, కర్లపాలెం, చీరాల మండలాల్లో పూర్తి

అద్దంకి, జూలై28(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో మాయాజాలం కొనసాగుతోంది. అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉండడంతో ఉపాధి పనులు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. పనిచేసిన వారికంటే పనికి వెళ్లకుండా మస్టర్లు పడుతున్న వారే అధికంగా ఉంటున్నారు. కొత్తగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను కూడా పాత పద్ధతులను ఉపాధి సిబ్బంది అలవాటు చేసి.. పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. అధికార మార్పిడి జరిగిన తర్వాత గ్రామస్థాయి నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు, తమ అక్రమాలు బయట పెట్టకుండా ఉండేందుకు ఎంత మందికి కావాలంటే అంత మందికి ప్రతి రోజు మస్టర్లు వేస్తున్నారు.

మండల స్థాయి తనిఖీలో సీన్ రివర్స్..

ప్రస్తుతం బల్లికురవ మండలంలో సామాజిక తనిఖీ గ్రామ సభలు జరుగుతున్నాయి. ఒక గ్రామంలోనే రూ.10లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పనుల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. ఇప్పటి వరకు జరిగిన సామాజిక తనిఖీ గ్రామ సభల్లో వచ్చిన వ్యత్యాసం పరిశీలిస్తే మండలంలో సుమారు రూ.2 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ జరుగుతుండగా అద్దంకి, కర్లపాలెం, చీరాల మండలాల్లో ప్రజావేదికలు పూర్తయ్యాయి. మూడు మండలాల్లో సుమారు రూ.2 లక్షల చొప్పున పనుల్లో వ్యత్యాసం ఉన్నట్లు నిర్ధారించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో పెద్ద ఎత్తున అవినీతి బయటపడ్డా.. మండల స్థాయి ప్రజా వేదికలో స్వల్పంగా రికవరీ చూపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. బల్లికురవ మండలంలో గ్రామాల సామాజిక తనిఖీలను లైవ్ ఆడిట్ చేస్తున్నారు. దీంతో అక్రమాలు బయటపడకుండా చేయడం కష్టతరంగా మారినట్లు తెలుస్తోంది. బల్లికురవ మండలంలోనే సుమారు రూ.2 కోట్ల మేర రికవరీకి సామాజిక బృందం లెక్కలు తీయడంతో.. మండల స్థాయి పర్యవేక్షణ అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులూ ఉపాధి కూలీలు

ఉదాహరణకు కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలకు ఒకటే చెరువు ఉంది. రెండు గ్రామాల కూలీలు అదే చెరువులో ఒకే చోట పనులు చేసినట్లు చూపించడంతో పెద్ద మొత్తంలో రికవరీ రాసినట్లు తెలుస్తోంది.

మల్లాయపాలెంలో ఏకంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా మస్టర్లు వేసినట్లు తేటతెల్లం అయ్యింది. సోమవారం ముక్తేశ్వరంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా తనిఖీలు చేశారు.


బల్లికురవ మండలం వేమవరంలో నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ గ్రామసభ

నేడు కార్పొరేషన్ సమావేశం

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ హాలులో జరగనుంది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టే 120 అంశాలను అజెండాలో పొందుపరిచారు. మొదట ఈనెల 30న సమావేశం జరగాల్సి ఉండగా, ఆ తర్వాత 31వ తేదీకి మార్పు చేశారు. అయితే తిరిగి అత్యవసర సమావేశంగా ఈనెల 29న నిర్వహిస్తుండగా, భారీ అజెండాతో 120 అంశాలను పొందుపరచడం ఇదే తొలిసారి .

ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘడియపూడి గ్రామంలో శ్రీ అంకమ్మతల్లి కొలుపులు ఘనంగా జరిగాయి. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేసిన టీడీపీ నాయకులు కావూరి విజయ్‌రాజ్‌ను గ్రామస్థులు, ఎమ్మెల్యే విజయ్ కుమార్ శాలువతో ఘనంగా సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, అన్నంనేని సుబ్బారావు, మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, వడ్డెంపూడి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

నటరాజ కళాకేంద్రం అభివృద్ధికి సహకరిస్తా

మద్దిపాడు నటరాజ కళాకేంద్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నటరాజ కళాకేంద్రం ఏడవ వార్షికోత్సవం విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ మాజీ అధికారి రాఘవరావు, సంఘ అధ్యక్షుడు దేవరశెట్టి యలమంద, గంటా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు ఉప్పుగుండూరి నాగేశ్వర రావును ఘనంగా సన్మానించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీల విషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఈసందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వారు సంతృప్తిచెందేలా పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలిచాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఒబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్థసారథి, కుమార్ తదితరులు ఉన్నారు.

● ఒంగోలులోని పత్తివారివీధిలో ఉన్న మసీదు ఎన్నికల నిర్వహణలో ఎన్నికల అధికారి ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆ మసీదుకు చెందిన ముస్లింలు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని,అందరి అభిప్రాయాలను తీసుకునే విధంగా చూడాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 84 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల సమస్యను వింటున్నఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం,జూలై 28(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలు చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి 84 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. పోలీసు అధికారులు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, సీఐలు దుర్గా ప్రసాద్ , షమీముల్లా, పాండురంగారావు, ఎస్సై జనార్దనరావు ఉన్నారు.


పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వేదికపై నగర మేయర్ సుజాత, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య తదితరులు

శతాబ్ది ఉత్సవాల నిర్వహణ అభినందనీయం

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి):ఒక పాఠశాల స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవటం, ఆ పాఠశాల ఔన్నత్యాన్ని చాటిచెప్పేవిధంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించటం అభినందనీయమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన రావు అన్నారు. స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల శతాబ్ది ఉత్సవ కమిటీ ప్రతినిధి ఆరిగ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పీవీఆర్ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాలలో ఉన్నారని, నాటి గురువులను, తోటి విద్యార్థుల స్నేహాన్ని గుర్తుచేసుకునే విధంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించటం గర్వించదగిన విషయమని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు కార్పొరేషన్ తరపున పూర్తి సహకారం అందజేస్తామని తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ పీవీఆర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిగా తను ఎంతో గర్వపడతానని అన్నారు. ఒంగోలు మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాస రావు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల ద్వారా 3 వేల మందికి పైగా పూర్వ విద్యార్థులు ఒక చోట కలిసేవిధంగా చేయటం పట్ల నిర్వాహక కమిటీని అభినందించారు. పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొప్పోలు హనుమంత రావు ప్రసంగిస్తూ తన తండ్రి కూడా పీవీఆర్ పాఠశాలలోనే చదివారని, తాను ఇదే పాఠశాలలో చదివి ఆ పాఠశాలలోనే సేవలు అందించటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శాండిల్య, నిర్వహణ కమిటీ ప్రతినిధులు బేతంశెట్టి హరిబాబు, గడియారం సుబ్బయ్య శర్మ, పలువురు పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆరోగ్యభరోసా

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయంతో ఆరోగ్య భరోసా లభిస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు రూ. 18.62 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. వివిధ అనారోగ్య కారణాలతో శస్త్ర చికిత్సలు చేయించుకుని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ప్రమాదకరంగా కాలువలు

● పగిలిపోయిన పైకప్పు బండలు
● వాటిమీద నుంచే నడిచి వెళుతున్న ప్రజలు


కలెక్టరేట్ వద్ద కాలువపై దెబ్బతిన్న బండలు





ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిపాలన భవన్(కలెక్టరేట్) ముందు ఉన్న కాలువలు ప్రమాదభరితంగా మారాయి. కాలువలపై వేసిన బండలు పగిలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా కలెక్టరేట్‌కు నిరంతరం జిల్లా నలుమూలలనుంచి ప్రజలు భారీగా తరలివస్తుంటారు. సోమవారం జరిగే గ్రీవెన్స్ రోజుతో పాటు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాల సమయంలో వివిధ వర్గాల వారు భారీగా తరలివస్తుంటారు. ఆ సమయంలో ధర్నాలను కాలువలపైనే టెంట్లు వేసుకొని నిర్వహిస్తుంటారు. సాధారణంగా నడిచివెళ్లే ప్రజలు ఆ కాలువలపై వేసిన బండలమీదనే నడుచుకుంటూ వెళ్తుంటారు. అయితే కాలువలపై ఉన్న బండలు పగిలిపోయి దర్శనం ఇస్తున్నాయి. ఏదైనా పొరబాటు జరిగితే కాలువలో పడిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కాలువలపై కొత్తబండలు వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న హేతువాద సంఘం నాయకులు

జీవోను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సాయిబాబా వందో శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. హేతువాద సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే శతజయంతి ఉత్సవాలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను చించి వేశారు. ఈకార్యక్రమంలో హేతువాద, వివిధ సంఘాల నాయకులు గుమ్మళ్ల నరసింహారావు, ఉప్పుటూరి ప్రకాశరావు, పేరం సత్యం, ఎం.రామ్, శిఖా చంద్రశేఖరరావు, నజీర్, ఎంకే బేగ్ తదితరులు ఉన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కౌన్సెలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వివాహనికి ముందు, ఇతర సంబంధిత విషయాలపై మార్గదర్శకత్వం పొందేందుకు ఏర్పాటుచేసిన ప్రీ- మెరిటల్ కౌన్సెలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, ఐసీడీఎస్ పీడీ సువర్ణతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే చేయాలి

● మద్దిపాడు డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు

మద్దిపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతంలో డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే చేసి పారదర్శకంగా కొలతలు వేయాలని మద్దిపాడు డిప్యూటీ ఎంపీడీవో కొండేపి రఘుబాబు తెలిపారు. సోమవారం మద్దిపాడు మండల పరిషత్ సమావేశమందిరంలో స్వామిత్వ పథకం అమలుపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్వామిత్వ ఫేజ్ 2 గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన అన్నంగి, ఏడుగుండ్లపాడు, గార్లపాడు, కొలచనకోట, లింగంగుంట, మల్లవరం, పెదకొత్తపల్లి, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సర్వేయర్‌లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి చంద్రబాబు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్
● ఇంటింటికీ తిరిగి కరపత్రాల పంపిణీ


మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జులై 28 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమపథకాలను అందించి ఆదుకుంటున్న సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని గుమ్మళంపాడు గ్రామంలో ఇంటింటికీ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రజలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను మభ్యపెట్టి పరిపాలన సాగించారని, నేడు కూటమి ప్రభుత్వ సారథ్యంలో చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్లతో పాటుగా నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నిర్వహణ, ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, తదితర అంశాలు అమలు చేశారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

సహకారం దొరికేనా!

(5వ పేజీ తరువాయి)

ఉంచడం వల్ల అన్నదాతలకు సమయం కలిసి రావడంతో పాటు రవాణా ఖర్చులు కూడా భారం కాకుండా ఉంటాయి. ప్రస్తుతం ఆ సదుపాయం లేకపోవడంతో దగ్గరలోని మండల కేంద్రానికి ఎరువుల కోసం అన్నదాతలు వెళ్లాల్సి వస్తోంది. త్వరలోనే కేటాయింపులు జరుగుతాయని జిల్లా సహకార శాఖ యంత్రాంగం చెబుతోంది.

అవకతవకలు జరిగిన ఖాతాలు గుర్తింపు

రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియ ద్వారా మొత్తం 112 సొసైటీల పరిధిలో 75,400 ఖాతాలు ఆన్‌లైన్ గొడుగు కిందకు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో లావాదేవీల విషయంలో పద్దు టాలీ కాని ఖాతాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇందులో ప్రధానంగా పది ఖాతాల్లో భారీగా నిధులు మళ్లింపు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇవన్నీ కూడా నగరం, తుమ్మల సొసైటీలతో పాటు పంగలూరు మండల పరిధిలోని నూజెళ్లపల్లి సొసైటీల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు తేల్చారు. దాదాపు రూ. 4.50 కోట్ల వరకు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. భారీగా జరిగనవి ఇలా ఉంటే లక్ష నుంచి మూడు లక్షల వరకు అక్రమాల సొసైటీలు దాదాపు 40 వరకు ఉన్నట్లు సమాచారం. సాంకేతిక చిక్కులతో డిజిటలైజేషన్ చేయడం సాధ్యపడని దాదాపు 28 ఖాతాలకు సంబంధించిన పై అధికారులకు పంపినట్లు యంత్రాంగం చెబుతోంది

అవకతవకల గుర్తింపు సరే...చర్యలేంటి?

గత ఏలుబడిలో భారీగా అక్రమాలు జరిగిన ఖాతాలు గుర్తించారు సరే కాని వారిపై చర్యలేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిధుల రికవరీ దిశగా చర్యలు చేపడతామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు త్రీమెన్ కమిటీలు సొసైటీల పగ్గాలు అందుకోబోతున్నాయి. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత కూడా వీరిపైనే ఉంది. అర్హులైన అన్నదాతలకే సొసైటీల నుంచి రుణాలు అందేలా చూడాల్సి ఉంది

ఉద్యోగులను పర్మినెంట్ చేసే విషయంలో

సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు 2014--19 మధ్య ఉన్న టీడీపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ ప్రక్రియ జరుగుతుండగానే ఎన్నికలు రావడంతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఇదే అదనుగా రెగ్యులర్ చేసే విషయంలో ఉద్యోగుల వద్ద నుంచి వైసీపీ నేతలు లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిపై గత ప్రభుత్వంలోనే అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఈ ప్రభుత్వం రాగానే అప్పుడు వచ్చిన ఫిర్యాదులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు తెలిపింది. కానీ అదీ ఇంతవరకు అతీగతీ లేదు. వైసీపీ హయాంలో ఎంతమంది ఉద్యోగులను రెగ్యులర్ చేశారనేదానికి ఆయా విభాగాల వద్ద ఇప్పటికీ సరైన సమాధానం లేకపోవడం గమనార్హం. వీటిపై కూడా త్రీమెన్ కమిటీలు దృష్టి పెట్టి ఎవరైతే అర్హత లేకున్నా దొడ్డిదారిన రెగ్యులర్ చేసుకున్నారో అలాంటి వారందరిపై పునర్విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

హలో.. మాస్టారూ!

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రీ ఆడిట్ ఫైల్‌ను వివిధ కారణాలతో తిరస్కరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు లేని నిబంధనలు పెట్టి ఉపాధ్యాయులను ఇక్కట్ల పాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.

పర్సంటేజ్ ఇవ్వాల్సిందే

ఉపాధ్యాయుల ఇంట్లో శుభకార్యాలు, గృహ నిర్మాణం, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు తదితర కారణాలతో పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేస్తారు. దరఖాస్తు చేసిన మొత్తాలకు అనుగుణంగా పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తోందని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రూ.5 లక్షల రుణానికి జడ్పీలో పీఎఫ్ విభాగాల్లో దాదాపు రూ.10 వేలకు పైగా చెల్లించుకోవాల్సి వస్తోందని ఆరోపణలున్నాయి.

ఆరోగ్య సమస్యలున్నా.. వదలడం లేదు

ఉపాధ్యాయులు వివిధ అనారోగ్య సమస్యలతో రుణం కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఇందుకు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ ధృవీకరణ పత్రం రుణ దరఖాస్తుకు జత చేస్తే సరిపోతుంది. అయితే జడ్పీలోనే సిబ్బంది మాత్రం ప్రభుత్వ సివిల్ సర్జన్ సర్టిఫికెట్ మాత్రమే అనుమతిస్తామని ఇది లేకపోతే రుణం మంజూరు చేయమని తిరకాసు పెడుతున్నారు. మరోవైపు కాసులు చెల్లిస్తే మాత్రం అన్నింటికీ ఓకే అని చెబుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయులకు నోటీసులు..

ఇటీవల పీఎఫ్ చందాల విషయంలో తేడాలు ఉన్నాయంటూ 55 మంది ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు నోటీసులు జారీ అయ్యాయి. వాస్తవంగా ఒక నెలలో ట్రెజరీ నుంచి పీఎఫ్ చందా జమ కాకపోతే ఆ మొత్తం రెండో నెలలో కలిపి జమ చేస్తారు. కొన్ని కారణాల వల్ల ఉపాధ్యాయులు సెలవులో ఉంటే చందా జీరోగా ఉంటుంది. ఇలాంటి తేడాలను ఆడిట్ సిబ్బంది సరిచేయకుండా నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నారు.

ఆందోళనకు సిద్ధం..

ఇలా వివిధ కారణాలతో ఉపాధ్యాయులను విశ్రాంత ఉపాధ్యాయులను జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ సిబ్బంది వేదనకు గురి చేస్తున్నారు. ఈ బాధలు భరించలేక ఇటీవల కొంతమంది జడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. అయినా కూడా సమస్య పరిష్కారం కావడం లేదని, ఇక తాము జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని సీఈఓకు స్పష్టం చేశారు. ఇలా జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ విభాగాల సిబ్బంది ఉపాధ్యాయులను, విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారు


మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

● సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చావా హజరత్తయ్య హెచ్చరించారు. అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.స్థానిక విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయని, పాశవికమైన ఆలోచనల వలనే ఇటువంటివి చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

పొన్నలూరు : కొండపి సీఐ సోమశేఖర్ సోమవారం పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై అనూక్, సిబ్బందితో సమావేశమయ్యారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి దర్యాప్తు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.

కుడికాల్వకు నీటి విడుదల

(5వ పేజీ తరువాయి)

తెలంగాణ మంత్రులు విడుదల చేయనున్నారు. ముగ్గురు మంత్రులు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు సదరు ఇంజనీరు తెలిపారు. సాగర్ డ్యాంకు 1,20,175 కూస్కెల వరద ప్రవాహం వస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతలకు నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలతో పాటు సాగర్ నుంచి దిగువకు 36,749 కూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 585 అడుకులకు చేరుకుంది. ఇంకా ఐదు అడుగులకు చేరితే.. డ్యాం పూర్తిగా నిండుతుంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా 297 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది.

పులిచింతలకు 25 వేల కూసెక్కులు

సాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతల జలాశయానికి 25 వేల కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నీట్టి మట్టం 175 అడుగులు కాగా సోమవారం 160.3 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 25.9 టీఎంసీలకు చేరింది. మరో 19.87 టీఎంసీల నీరు వస్తే పులిచింతల నిండుతుంది. మరో మూడు రోజుల్లో పులిచింతల డ్యాం కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారుల అంచనాగా ఉంది. దీంతో ఈ నెలలోనే పులిచింతల గేట్లు తెరచుకోనున్నాయి.

అవీ..ఇవీ..

పిచ్చికుక్క కాటుకు ఆవు బలి


సోమవారం ప్రాణాలతో ఉన్న ఆవు

మార్టూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క కాటుకు ఆవు బలైన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీలోని ద్వారకపాడు గ్రామంలో చోటుచేసుకొంది. వారం రోజులు క్రితం మువ్వా శేషయ్యకు చెందిన పశువుల కొష్టంలో కట్టేసిన ఆవును పిచ్చికుక్క కరిచింది. దాంతో అప్పటినుండి మేత మేయకుండా, నీళ్ల తాగకుండా, దగ్గరకు వచ్చినవారిని పొడుస్తూ, వింతగా ప్రవర్తించిన ఆవు సోమవారం సాయంత్రం చనిపోయినట్లు రైతు శేషయ్య తెలిపారు. నాలుగేళ్ల క్రితం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు టీటీడీఆ గోశాల నుండి ఆవులను అ ందచేశారు. అందులో భాగంగా శేషయ్యకు కూడా ఆవును అందచేశారు. దీంతో ప్రకృతి వ్యవసాయంలో ఆవు మూత్రం, పేడను పొలానికి ఎరువుగా వినియోగించారు. అయితే పశువైద్యులతో వైద్యం చేయించినప్పటికీ, ఆవు కోలుకోలేదని శేషయ్య, ఆయన కుటుంబ సభ్యులు వాపోయారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి

● ఆర్డీవోను కలిసిన వాడరేవు మత్స్యకారులు


ఆర్‌డీవోకు సమస్యను వివరిస్తున్న మత్స్యకారులు

చీరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు మత్స్యకారులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈపూరుపాలెం కాలువలో కొంత కాలంగా వేట అనంతరం బోట్లు నిలుపుకునే స్థలంలో తాజా పరిణామాల నేపథ్యంలో విస్తీర్ణం పరిధి తగ్గిందని, ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలో బోట్లు రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవోను కలసి వివరించారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

పందిళ్లపల్లి(చీరాల), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఐదుగురు నిరుపేద విద్యార్థులకు శ్రీరామకృష్ణ సేవాసమితి చీరాల ప్రతినిధులు స్కాలర్‌షిప్ ప్రోత్సాహం అందజేశారు. దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని దాతలు కోరారు.

సెయింట్ ఆన్స్‌లో ఏఐపై వర్క్‌షాపు

చీరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్ ఏఐపై వర్క్‌షాపు ప్రారంభించారు. ఈక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ శుక్రవారం వరకు జరిగే ఈ అవగాహనలో ఆధునిక సాంకేతిక పరమైన అంశాలపై నిష్ణాతులుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. హైదారాబాదుకు చెందిన ఆర్బిస్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్ ల్యాబ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బసవయ్యకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న బసవయ్య

సంతమాగులూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెన వారిపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ చెన్నుపల్లి బసవయ్యకు తెలుగు సాంస్కృతిక సాహితి ట్రస్టు వారు ఈ నెల 27న కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరు పట్టణంలో డాక్టరేట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బల్లికురవ మండల విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గుంటుపల్లి రామకృష్ణ, ప్రసన్నాంజనేయస్వామి విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ కూడా అభినందనలు తెలిపారు.

మినీ బైపాస్‌కు తొలగిన అడ్డంకులు

● నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలాల గుర్తింపు ● మౌలిక వసతుల కల్పనకు టెండర్ల ప్రక్రియపై కసరత్తు


అద్దంకి కొండ వద్ద సిద్ధం చేస్తున్న ప్లాట్లు

అద్దంకి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఒకవైపు టెండర్ల ప్రక్రియకు వేగంగా ఫైళ్లు కదులుతుండగా, మరోవైపు ఉన్న అడ్డంకులను కూడా అధికారులు వేగంగా పరిష్కరిస్తున్నారు. మినీ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసే అద్దంకి మేజర్ కాలువ కట్టలను ఆక్రమించి పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారికి ప్రస్తుతం ప్రత్యామ్నాయం చూపుతూ స్థలాలు కేటాయిస్తున్నారు. అద్దంకి మేజర్ కాలువ కట్టలను రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు రెండు వైపులా సీసీ రోడ్లు, సైడ్‌డ్రైయిన్లు, లైట్లు తదితర పనులకు సుమారు రూ.15 కోట్లతో చేపట్టేందుకు టెండర్ల పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఫైల్ ప్రభుత్వ అనుమతికి వెళ్లింది. ఈ లోగా 70 కుటుంబాలు కాలువ కట్టలను ఆక్రమించి నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. ఆయా కుటుంబాలకు శింగరకొండపాలెం సమీపంలో అద్దంకి కొండ వద్ద స్థలాల కేటాయింపునకు ఏర్పాట్లు చేశారు. లోతైన గోయ్యి ఉండటంతో మెఘా ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో చదును చేయించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా విభజించారు. రోడ్లు పోను ఒక్కొక్కరికి 2 సెంట్లు చొప్పున కేటాయించగా 42 ప్లాట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన మరి 28 మందికి ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. అదే ప్రాంతంలో మరికొంత కొండ ప్రాంతాన్ని చదును చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. ప్లాట్లు వేసిన ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, రోడ్లు, బోరింగ్‌లు కూడా ఏర్పాటు చేయాలని మంత్రి రవికుమార్ ఆదేశించారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో అటు మినీ బైపాస్ నిర్మాణం టెండర్ల ప్రక్రియ, మరో వైపు స్థలాల కేటాయింపు పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు మండలంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం పర్యటించారు. ప్రధానంగా నల్లబర్లీ రైతుల సమస్యపై ప్రత్యేక దృష్టిసారించారు. బర్లీ పొగాకు కొనుగోలు విషయానికి సంబంధించి రైతుల నుండి పలు సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. అనంతరం మార్టూరు మండలం ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఇంకొల్లు మండలానికి సంబంధించిన రైతులకు సంబంధించిన పొగాకును అమ్ముకునేందుకు వీలుగా గుండ్లాపల్లిలో నూతన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటగా 20 క్వింటాళ్ల పొగాకు ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత మిగిలిన రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేస్తామన్నారు. సన్న, చిన్నకారు రైతులు పడుతున్న ఇబ్బందులను ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన వెంటనే ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. రైతులు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. ప్రతి రైతువద్ద ఉన్న పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతురావు, పీఏసీఎస్ అధ్యక్షులు కర్రీ శ్రీనివాసరావు, సుబ్బారావు, రాంబాబు, నాయకులు వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఘర్షణతో చీరాల వాసుల ఉలికిపాటు

తక్షణమే స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు


గస్తీని పర్యవేక్షిస్తున్న పోలీసులు

చీరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సోమవారం 9.30 గంటల వరకు ప్రశాంతంగా ఉన్న చీరాల పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. 'రయ్... రయ్' మంటూ సైరన్లతో పోలీసులు పట్టణంలోని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ వైపు వెళ్లారు. ఈ లోగా పోలీసులను చూసి అక్కడ ఉన్న సుమారు 20 మంది యువకులు వివిధ దిక్కులవైపు పరుగులు తీశారు. వీరు రెండు గ్రూపులుగా ఏర్పడి పరస్పర దాడులు చేసుకున్నట్లు తెలిసింది. వీరిలో ఒకవర్గానికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం.

పట్టణంలోని ఎన్ఆర్అండ్‌పీఎం స్కూల్ గ్రౌండ్‌లో రాత్రి వేళలో సైతం వివిధ క్రీడలు సాధన చేస్తూ, యువత, పలువురు క్రీడాకారులు ఉంటారు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి కూడా పలువురు యువకులు ఆటలు ఆడుతున్నారు. అప్పటికే సుమారు పది మంది విద్యార్థులు ఓ పెద్ద సుత్తితో సోమవారం రాత్రి మైదానానికి చేరుకు న్నారు. పథకం ప్రకారం ఎంచుకున్న మరో పదిమందిపై ఒక్కసారిగా దాడికి తెగ బడ్డారు. దీంతో అప్పటికే అవతలి వర్గంలో కొందరు విద్యార్థులు పరుగులు తీసి తప్పించుకొన్నారు. మిగిలిన ఐదుగురిపై సుత్తితో, కాళ్లతో, పిడి గుద్దు లతో విచక్షణ రహితంగా వీధి మారి దాడులు చేశారు. దండం పెట్టి మోకరిల్లుతున్న వదలలేదని తెలిసింది. అదే సమయంలో సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మీతో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని చూసి నిందితులు పరారవు తుండగా, వీరిలో ఇద్దరిని అదుపులోకి తీసుకు న్నారు. వీరు ఒకొక్కరూ ఒక్కో వర్గానికి చెందినట్లు తెలిసింది. వీరు ఉపయోగించిన సుత్తిని, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో ఒక దశలో గంటపాటు పట్టణమంతా ఆందోళన వాతావరణం నెలకొంది. ముందు జాగ్రత్త చర్యగా పట్టణంలోని దుకాణాలను పోలీసులు మూసివేయించారు.

ఒకే కళాశాల విద్యార్థులు..!

పట్టణంలోని ఒకే కళాశాలకు చెందిన విద్యార్థులుగా ప్రాథమికంగా తెలిసింది. వీరిలో ఒకవర్గం పేరాల మసీదు సెంటర్‌వారు కాగా, మరోవర్గం వైకుంఠపురం వారిగా గుర్తించి మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం


నేత్రం దానంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానం నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కూరగాయల వ్యాపారి మారం మల్లయ్య(80) మృతి చెందాడు. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు ప్రోత్సహంతో మల్లయ్య కుటుంబ సభ్యుల అంగీకారంతో పెదకాకానిలోని శంకర కంటి వైద్యశాల చెందిన డాక్టర్ శ్రద్ధా బృందం మృతుని కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి అ లహరి హరిప్రసాద్, చప్పిడి వీ రయ్య, చిన్ని మురళీకృష్ణ, షేక్ మహమ్మద్ రఫీ, అంజద్‌బాషా, మల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

400 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు

● తహసీల్దార్ సింగారావు


పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న తహసీల్దార్

పంగులూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ఏఎంసీలో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రంలో సోమవారం 400 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేసినట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. కొనుగోలు కేంద్రానికి ఉన్నతాధికారుల నుంచి అందిన సమాచారం మేరకు రైతులు 761 క్వింటాళ్ల కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా మార్క్‌ఫెడ్ అధికారుల అనుమతి మేరకు పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. తేమశాతం, గ్రేడ్‌ల విభజనలో రైతులు నిబంధనలు పాటించాలని సీఈవో లక్ష్మీదేవి తెలిపారు.

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

● సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చావా హజరత్తయ్య హెచ్చరించారు. అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.స్థానిక విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయని, పాశవికమైన ఆలోచనల వలనే ఇటువంటివి చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

పొన్నలూరు : కొండపి సీఐ సోమశేఖర్ సోమవారం పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై అనూక్, సిబ్బందితో సమావేశమయ్యారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి దర్యాప్తు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన

మార్టూరు,జూలై28(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. పట్టణంలోని మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లోని ప్రతి తరగతిని పరిశీలించారు. బాలబాలికలతో మాట్లాడారు. అదేవిధంగా వారికి పలు సూచనలు చేశారు. చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ఎంఈవోలు వస్రాంనాయక్, ప్రేమలతలు, ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీజాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా శ్రీనివాసరావు బాధ్యతలు


బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు

బల్లికురవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారిగా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మార్టురు ఎంఈవో ఇన్‌చార్జ్‌గా ఉండడంతో ఉన్నతాధికారులు అద్దంకి బాలికల విద్యాలయం హెచ్‌ఎంగా పనిచేస్తున్న కటకం శ్రీనివాసరావును బల్లికురవ ఎంఈవో-1 పోస్టుకు నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు బల్లికురవ హెచ్ఈ మోడల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ పాఠశాలలను తనిఖీలు చేస్తామన్నారు.

యానాది సంఘం నాయకుడు కృష్ణ ఆకస్మిక మృతి


కృష్ణ (ఫైల్)

సంతమాగులూరు జూలై 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాతమాగులూరు గ్రామంలోని యానాది కాలనీకి చెందిన, ఆ సంఘం నాయకుడు తలపల కృష్ణ సోమవారం గుండెపోటుతో తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కృష్ణ మండల యానాది సంఘం అధ్యక్షులుగా పనిచేస్తూ, యానాదుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం పలు పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎనుబర్ల ఎలమంద, గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు, పలు సంఘాల నాయకులు కృష్ణ భౌతికయం వద్ద నివాళి అర్పించారు.

ప్రకృతి సేద్యంతో చక్కని ఆరోగ్యం

పందిళ్లపల్లి(చీరాల), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆహారంతో ఆరోగ్యంగా జీవించవచ్చని, పందిళ్లపల్లి ప్రిపేర్ సేవాసంస్థ ప్రతినిధులు అన్నారు. సోమవారం గ్రామంలో రైతులకు సేంద్రీయ సాగుపై అవగాహన కల్పించారు. కొంతకాలంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపుతున్నట్లు చెప్పారు. అలాగే పదిమందికి రూ.6,10లక్షలు వ్యవసాయ రుణం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు రవిచంద్ర, ఆషా, వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్ రెడ్డి, మయూరి, రమణారెడ్డి, కమ్యూనిటి హెల్త్ నర్సులు, రైతులు పాల్గొన్నారు.

మిగిలిన నగదు వెంటనే జమచేయాలి

బల్లికురవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రతి నెల ఒకటో తేదీన పించన్ల పంపిణీ అనంతరం మిగిలిన నగదును జమచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి, పాండురంగస్వామి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పించన్లు ఒకటో తేదీనే నూరు శాతం పంపిణీ చేయాలన్నారు. ఎవరైన గ్రామాలలో లేకుంటే వారికి ఇవ్వాల్సిన నగదు తిరిగి బ్యాంకులలో జమ చేయాలన్నారు. అలానే గ్రామాలలో పీ-4 లబ్దిదారులను గుర్తించి వారికి మార్గదర్శకులను ఎంపిక చేయాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

రైతులకు ఉచితంగా మినుము విత్తనాల పంపిణీ

మార్టూరు, జూలై28(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి గ్రామంలో సోమవారం రైతుసేవా కేంద్రంలో రైతులకు ఉచితంగా మినుములును పంపిణీ చేశారు. తొలకరి మొదలు కావడంతో రైతులు పొలంలో వెంటనే మినుములను వేయాలని నీటి సంఘం అధ్యక్షులు తేలప్రోలు సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యం సతీష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాటి నాగార్జున, అగ్రికల్ అసిస్టెంట్ వెంగమాంబ, మురళి, సాంబయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా బ్రహ్మానందస్వామి


బ్రహ్మానందస్వామి

పంగులూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేవీ.పాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా ముప్పవరం గ్రామానికి చెందిన అల్లంనేని బ్రహ్మానందస్వామి నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. పాలకవర్గ సభ్యులుగా కశ్యాపురం గ్రామానికి చెందిన ధూళిపాళ్ల ప్రసన్నాంజనేయులు, రేణంగివరం గ్రామానికి చెందిన మట్టకొయ్య బ్రహ్మయ్యలు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

ఈపూరుపాలెం (చీరాల), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మీ సేవాలో చోరీకు పాల్పడిన శ్రీకాకుళం జిల్లా పలాస మండలం, పద్మనాభపురానికి చెందిన గోలంగి ప్రవీణ్ కుమార్‌కు ఏడు నెలలు జైలుశిక్ష విధిస్తూ, చీరాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి తీర్పును వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఈపూరు పాలెం కాటూరి చెంబయ్యకు చెందిన మీసేవా కేంద్రంలో ప్రవీణ్‌కుమార్ గతేడాది నవంబర్‌లో చోరీకి పాల్పడ్డాడు. రూ.40 వేలు అపహరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. ఈ కేసులో సోమవారం న్యాయాధికారి తీర్పును వెలువడించినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

మేదరమెట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉచితంగా సైకిళ్లు పంపిణి చేయనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


నూతన విద్యా విధానాలను అమలు చేయాలి

అద్దంకిటౌన్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్ మీడియట్‌లో నూతనం గా ప్రవేశపెట్టిన విధానాలను ప్రతి కళా శాలలో అమలుచేయాలని డీఐఈవో జూబేర్ సూచించారు. సోమవారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని అధ్యాపకులతో సమా వేశం నిర్వహించి ఇంటర్‌మీడియట్ బోర్డు నూతనంగా ప్రవేశపెట్టిన విధి వి ధానాలపై అవగాహన కల్పించారు. ద్వితీయ సంవత్సరంలానే ప్రథమ సంవత్సరంలోనూ ప్రాటికల్స్ ఉంటాయ న్నారు. సబ్జెట్‌ల కుదింపును తెలుసు కుని ఆ ప్రకారం బోధన చేయాలన్నారు. అనంతరం జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థు లతో మాట్లాడి తెలుసుకున్నారు. అనం తరం పట్టణంలోని పలు ప్రైవేట్ జూని యర్ కళాశాలను ఆయన సందర్శిం చారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఉన్నారు.

భూముల అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం చెర్వుకొమ్ము పాలెంలో మాదిగ కులానికి చెందిన వ్యక్తుల భూములను అక్రమంగా చేసిన ఆన్‌లైన్‌ను రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ దళితుల భూమిని అక్రమంగా అన్‌లైన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సమితి నాయకులు పేముల యోహాను, షేక్ జిలాని, ఎస్. ధనరాజ్, టి. సుబ్బారావు, కే చక్రవర్తి, పెద్ద నరసయ్య, బి.సుశీల, మూల యలమందమ్మ తదితరులు ఉన్నారు.

'సోమశిల'లో 30.525 టీఎంసీల నీరు



అనంతసాగరం జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం 30.525 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ నుంచి 12,121 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పెద్దపులుల గాండ్రింపులు

- 2023లోనే పాదముద్రలు గుర్తించిన అటవీ శాఖ
- టైగర్ కారిడార్‌తో సంరక్షణ చర్యలు



నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మెట్టప్రాంతం పొడవునా విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో పెద్దపులుల గాండ్రింపులు వినబడుతున్నాయి. ఇటీవల కాలంలో వాటి సంఖ్య పెరిగినట్లు అటవీ శాఖ గుర్తించింది. ఆత్మకూరు రేంజ్ పరిధిలోని వెంకటాపురం ప్రాంతంలో 2023లోనే మొదటిసారి పెద్దపులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. ఆ తరువాత కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇంకేముంది.. మన అటవీ ప్రాంతంలో పులులు తిరుగుతున్నట్లు నిజమై, ఆ దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీనికి బలం చేకూర్చేలా 2024లో మర్రిపాడు మండలం కదిరినాయుడిపల్లి ప్రాంతంలో హైవేపై వేగంగా వెళుతున్నతత ఓ కారుపై పెద్దపులి దాడి చేసిందని డ్రైవర్ తెలపడంతో అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు రేంజ్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రెండు పులులు తిరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో జిల్లాలో టైగర్ కారిడార్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో పులుల సంచారం పెరిగినట్లు నిర్ధారించుకొన్న కేంద్ర అటవీ శాఖ ఈ ఏడాది జనవరిలో దాదాపు లక్ష హెక్టార్లలో టైగర్ కారిడార్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకొన్నది. తిరుపతి జిల్లా శేషాచలం టైగర్ కారిడార్‌లో నెల్లూరు జిల్లాలోని మూడు రేంజ్‌లను కలుపుతూ నిర్ణయం తీసుకొన్నది.

● ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లాలో టైగర్ కారిడార్ ఏర్పాటు కావడంతో జిల్లా అటవీ శాఖ అధికారులు పులుల సంరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేశారు. అడవుల్లో వివిధ రకాల మొక్కలతోపాటు వన్యప్రాణులైన జింకలు, దుప్పిలు, కణితల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. అడవుల్లో నీటి తొట్టెల సంఖ్యను పెంచడం, కారిడార్ సమీప గ్రామాల్లో పులులు ఉన్నట్లు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడం, పులులు తిరిగే ప్రాంతాల్లో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటుకు జిల్లా అటవీ శాఖ అధికారులు చేపట్టారు.

250 సీసీ కెమెరాల నిఘా

రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా టైగర్ సంరక్షణకు చర్యలు చేపట్టాము. వాటి కదలికలను తెలుసుకోవడం కోసం దాదాపు 250 సీసీ కెమెరాలను అమర్చాము. అంతేగాక నీటి తొట్టెలను ఎక్కువగా ఏర్పాటు చేశాము. హెచ్చరిక బోర్డులను పెట్టాము. కణితలు, దుప్పిలు, జింకల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాము. ఇలా పులుల సంరక్షణ చర్యలు చేపడుతున్నాము.

- మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో

నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

'ఉపాధి'లో ఆకలి కేకలు

2 నెలలుగా శ్రామికులకు అందని నగదు

- రూ.56 కోట్ల మేర బకాయిలు



నెల్లూరు (జడ్పీ), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పనుల్లేని నిరుపేద కుటుంబాలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకమే జీవనాధారం. ఈ పథకం ద్వారా చేపట్టే పనులతో వచ్చిన కూలి పేదలకు మూడు పూటలా తిండికి లోటు లేకుండా చేస్తోంది. అయితే, గడిచిన ఏడెనిమిది నెలలుగా దినసరి వేతనాలు చెల్లించడంలో ఆలస్యమవుతోంది. ఒక్కో నిరుపేదకు రోజుకు రూ.100 నుంచి 200 మేర మాత్రమే కూలి గిట్టుబాటవుతోంది. అయితే ఈ డబ్బులు కూడా చెప్పిన సమయానికి ఇవ్వకుండా నెలన్నర, రెండు నెలలకుపైగా సమయం పడుతుండటంతో పేదలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

● జిల్లాలో 2.68 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలో 3.66 లక్షల మందికి జాబ్‌కార్డులు ఉండగా, 2.68 లక్షల కార్డు దారులు మాత్రమే క్రమంతప్పకుండా ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఇంకుడుగుంతలు, ఊటకుంటలు, చెరువులు, పంటకాలువల్లో పూడికతీతలు, ఉద్యాన, వానపాముల ఎరువుల తయారీ తదితర పనులు చేయిస్తున్నారు. 15 రోజులకోసారి శ్రామికులకు వేతనాలు అందించాల్సి ఉంది. కార్డుదారులకు ఉన్న బ్యాంకు ఖాతాల ద్వారానే కేంద్ర ప్రభుత్వం కూలి నగదు జమ చేస్తోంది.

● మే 20 నుంచి ఆగిన వేతనాలు

జిల్లాలో ఉపాధి హామీ కూలి నగదు మే నెల 20వ తేదీ వరకు చెల్లించారు. ఇప్పటికీ రెండు నెలలకు పైగా గడుస్తున్నా వేతనాలు చెల్లించలేదు. దాదాపు రూ.56 కోట్ల మేర శ్రామికులకు చెల్లించాల్సి ఉంది. గత ఏడెనిమిది నెలలుగా వేతనాలు సక్రమంగా రావడంలేదని, నెలన్నర నుంచి రెండున్నర నెల సమయం పడుతోందని శ్రామికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తమ బాధలను అర్థం చేసుకుని అధికారులు కూలి వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- ఏఐఐబీ వర్కులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- జిల్లాలో రూ.26 కోట్ల పెండింగ్ బిల్లులకు మోక్షం
- పీఎంజీఎస్‌వై ఫేజ్-4 కింద కొత్త రహదారులకు ప్రతిపాదనలు
- కీలక రోడ్ల విస్తరణకు నిర్ణయం

గడిచిన కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంత రోడ్లకు మంచి రోజులొస్తున్నాయి. పెండింగ్ బిల్లులు చెల్లించి అసంపూర్తి రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కీలకమైన కనెక్టివిటీ రోడ్లను విస్తరించేందుకు కూడా సిద్ధమవుతోంది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

నెల్లూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఫండింగ్‌తో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను బాగు చేసేందుకు పనులు చేపట్టారు. అవసరం మేరకు సీసీ, బీటీ రోడ్లను వేశారు. ఈ ప్రాజెక్టు కింద జిల్లాకు రూ.310.64 కోట్లు కేటాయించారు. మొత్తం 374 కి.మీ పొడవున రోడ్లను నిర్మించేందుకు 196 వర్కులను మూడు ప్యాకేజీలుగా విభజించి పనులు మొదలుపెట్టగా, 2020 నాటికి చాలా వరకు పూర్తయ్యాయి. ఇప్పటికి రూ.232 కోట్లు ఖర్చు చేసి 158 వర్కులు పూర్తి చేశారు. మరో 11 వర్కులు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. మిగిలిన 27 వర్కులు ప్రారంభం కాలేదు. వైసీపీ ప్రభుత్వం ఏఐఐబీ పనుల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు పనులు ఆపేశారు. జిల్లాలో రూ.26 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఈ వర్కులను పూర్తి చేయాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే రూ.26 కోట్ల బిల్లులను అప్‌లోడ్ చేయగా, త్వరలోనే నిధులు విడుదల కానున్నాయి. ఆ వెంటనే పెండింగ్‌లో ఉన్న 11 పనులను పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కాగా గత ప్రభుత్వం పుణ్యమా అంటూ ప్రారంభం కాని వర్కులన్నీ రద్దయ్యాయి. ఏఐఐబీ ఫండింగ్‌తో చేపట్టిన 27 వర్కులు రద్దు కాగా వాటిని మరో పథకం కింద చేపట్టేలా పంచాయతీరాజ్ అధికారులు నిర్ణయించారు.



అధ్వానంగా ఉన్న సంగం - పల్లిపాళెం రోడ్డు

● కొత్త రోడ్లకు ప్రతిపాదనలు

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్-3 కింద 2023-24లో రూ.56.58 కోట్ల అంచనాలతో 8 రోడ్లు మంజూరయ్యాయి. అలానే మూడు వంతెనలను రూ.21.77 కోట్లతో మంజూరు చేశారు. ఈ వర్కుల్లో ఆరు రోడ్లను పూర్తి చేశారు. 86.56 కి.మీ గానూ 74.81 కి.మీ మేర బీటీ రోడ్లు నిర్మించారు. ఇందుకు రూ.43.38 కోట్లు ఖర్చు చేశారు. బ్రిడ్జీల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇదే క్రమంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ఫేజ్-4 కింద పంచాయతీరాజ్ అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపారు. ఏఐఐబీ ప్యాకేజీలో రద్దయిన 27 రోడ్లలో నుంచి పది రోడ్లను ఫేజ్-4 కింద చేర్చారు. త్వరలోనే వీటికి అనుమతులు మంజూరుకానున్నాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం మరో ఉన్నత ఆలోచన కూడా ముందుకు తెచ్చింది. ఇప్పటి వరకూ కొన్ని కీలకమైన గ్రామీణ రహదారులు 3.50 మీటర్ల వెడల్పుతోనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ట్రాఫిక్‌ను బట్టి ఈ రోడ్లను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్నింటిని 5.50 మీటర్లకు, మరికొన్నింటిని 7.50 మీటర్లకు వెడల్పు చేసేలా చర్యలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదన లు పంపాలని తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించింది.

కార్మికులపై లాఠీచార్జ్!

- పారిశుధ్య పనుల్లోకి ప్రైవేటు వ్యక్తులు
- అడ్డుకున్నందుకు పారిశుధ్య కార్మికుల అరెస్ట్
- స్టేషన్ బయట బైఠాయింపు.. లాఠీతో చెదరగొట్టిన వేదాయపాళెం సీఐ



లాఠీతో కార్మికులను కొడుతున్న సీఐ శ్రీనివాసరావు

నెల్లూరు (క్రైం/వైద్యం), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన సోమవారం ఉద్రిక్తతకు దారి తీసింది. అయ్యప్పగుడి సెంటర్‌లో ప్రైవేటు కార్మికులతో అధికారులు పనిచేయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆందోళనకారులు భారీగా అక్కడకు చేరుకుని, అడ్డుకున్నారు. తమ పనులు ఇతరుల వద్ద చేయిస్తే సహించమని, తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ర్యాలీ చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే వేదాయపాళెం పోలీసులు అక్కడకు చేరుకొని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రూరల్ అధ్యక్షుడు దేశ మూర్తితోపాటు సుమారు 10 మంది నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. ఈ క్రమంలో కార్మికులు, నాయ కులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు తరలివెళ్లి స్టేషన్ ముందు బైఠాయించి, నినాదాలు చేశారు. స్టేషన్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సీఐ శ్రీనివాసరావు కార్మికులపై లాఠీ చార్జీ చేసి చెదరగొట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులపై సీఐ శ్రీనివాసరావు దురుసుగా లాఠీచార్జి చేయడం పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. సీపీఎం, సీఐటీయూ నేతలు కొండాప్రసాద్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, సతీష్, నాగిరెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేడు పీఎంశ్రీ పాఠశాల ప్రారంభం

నెల్లూరు (విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యావిధానంలో భాగంగా జిల్లాలో పీఎంశ్రీ (పీఎం స్కూల్ ఫర్ రైజింగ్‌ఇండియా)కి ఎంపికైన 46 పాఠశాలల్లో కలిగిరి పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్ ఒకటి. దీన్ని కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపికైన అన్నీ పాఠశా లల్లో అత్యాధునికమైన వసతులతో విద్యాబోధన జరుగుతుందని, 2020 జాతీయ విద్యావిధా నాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని 2022 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు. గుణాత్మక విద్యను అందించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వ యం పెంపొందించడమే ఈ కార్యక్ర మం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ పాఠశా లల్లో కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలతో పాటు అత్యాధునికమైన సాంకేతిక వసతులు కల్పిస్తుం దన్నారు. ఇందులో భాగంగా తొలుత ఓ పాఠశా లను వర్చువల్‌గా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవడంతోపాటు ప్రారంభోత్సవాన్ని అందరూ తిలకించేందుకు పాఠశాలలో స్క్రీన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

వారిస్తున్నా.. మున్ముందుకే!

- 'మైనింగ్' వ్యవహారంలో అధికారుల తీరిది
- వరికుంటపాడులో తెల్లరాయి నిక్షేపాలు

'మైనింగ్ జరిగితే తాము వీధిన పడితాము మహాప్రభో..!' అంటూ ఆ గ్రామస్థులు నెత్తి, నోరు కొట్టుకుంటున్నా అధికారుల ససేమిరా అంటున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, ఆమ్యామ్యాల కోసమో అనుమతుల పేరుతో వ్యాపారికి వంతపాడుతున్నారు. వరికుంటపాడు మండలంలోని అటవీ ప్రాంతాల్లో ఖనిజ నిక్షేపాలు అధికంగా ఉన్నాయనే ప్రచారంతో కొంతమంది వ్యాపారులు గత ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందామంటూ గ్రామాల వైపు పరుగులు తీస్తున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు వ్యాపారులను అడ్డుకొని నిబంధనలకు విరుద్ధంగా పొందిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపడుతున్నారు.

- తవ్వకాలకు వ్యాపారుల విశ్వప్రయత్నం
- గ్రామస్థుల ఆందోళననూ పట్టించుకోని వైనం
- అధికార పార్టీ నేతల తీరుపై విమర్శల వెల్లువ

ఉదయగిరి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 233, 1లోని 43 ఎకరాల కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ (తెల్లరాయి) తవ్వకాల కోసం 2023లో అప్పటి వైసీపీ హయాంలో లీజు అనుమతులు పొందిన వ్యాపారులు ఇప్పుడు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ భూములకు కూతవేటు దూరంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన ఎస్సీ వాసులతోపాటు సమీప వరికుంటపాడు, ఆంధ్రావారిపల్లి, కనియంపాడు గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గేదెలు, మూగజీవాలను నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాలకు కన్నతల్లితో సమానమైన ఆ కొండ పోరంబోకు భూముల్లో తవ్వకాలు సాగిస్తే తాము జీవనాధారం కోల్పోవలసి వస్తుందని వాపోతున్నారు.

● పంథా వీడని వ్యాపారులు

మైనింగ్‌ను గ్రామస్థులు వ్యతిరేకిస్తున్నా వ్యాపారులు మాత్రం ఎలాగైనా పనులు ప్రారంభించి పట్టు నిలుపుకోవాలనే ధోరణితో ఉన్నారు. గతేడాది నవంబరులోనే కొంతమంది వ్యాపారులు కొండ ప్రాంతంలో యంత్రాలతో పనులు చేపట్టి బోరు పాయంట్లను వేయించారు. దీంతో విష యం తెలుసుకున్న గ్రామస్థులు మూకుమ్మడిగా అక్కడకు చేరుకొని పనులను అడ్డుకున్నారు. అప్పట్లో మిన్నకుండి పోయిన వ్యాపారులు మరోమారు అధికారుల సహకారంతో గ్రామానికి చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఆ ప్రాంతాన్ని ఆనుకొని తమ నివాసాలతో పాటు పాఠశాల, ఆలయాలు ఉండడంతో బ్లాస్టింగ్ సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అధికారులకు విన్నవించారు. గేదెలు, మూగజీవాలకు మేత దొరికే పరిస్థితి కూడా లేకుండా పోతుందని వాపోయారు. అయినా ఈ నెల 24న ముందస్తు ఎలాంటి దండోరా వేయకుండానే కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ ఆధ్వర్యంలో కొండ ప్రాంతంలోనే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అక్కడ సైతం ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపించినా ఏమాత్రం పట్టించుకొని అధికారులు పనులు చేపట్టేలా వ్యాపారులకు అనుకూలంగానే వత్తాసు పలకడం చర్చనీయాంశమైంది.



మైనింగ్ తవ్వకాలు సాగించనున్న కొండ ప్రాంతం

● అనుమానాలెన్నో

గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు అనుమతులు మంజూరు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా మేత, కొండ పోరంబోకు భూముల్లో ఇచ్చిన అనుమతుల పుణ్యమా అని భవిష్యత్తులో పచ్చని ఆ ప్రాంతాలు ఎడారిగా మారే ప్రమాదం ఉంది. వ్యవసాయం, పాడిని నమ్ముకొని జీవించే ప్రజలు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటాయి. అయినా కొంతమంది వ్యాపారులు స్థానికుల అండతో అడ్డుకుంటున్న ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతుండటం గమనార్హం. అంతేగాక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు వ్యాపారులకు అండగా నిలుస్తున్నారని అపవాదు ఉంది. దీనివెనుక ఓ ప్రజాప్రతినిధి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. సమావేశాల సమయంలోను భారీస్థాయిలో పోలీసు బలగాలతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా ఒకవంతైతే త్వరలోనే ఆ ప్రాంతంలో పనులు చేపట్టేందుకు వ్యాపారులు ప్రణాళికలు సాగిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అనుమతులు రావాల్సి ఉంది



ఇటీవల జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాము. భయందోళనకు గురయ్యామనే చెప్పే వారి నుంచి కూడా కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేశాము. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు వచ్చిన తరువాత వ్యాపారులు పనులు ప్రారంభిస్తారు. అప్పుడు కూడా ప్రజల నుంచి ఆటంకాలు ఎదురైతే తమతోపాటు పోలీసుల ద్వారా పనులు జరిగేలా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

- హేమంత్‌కుమార్, తహసీల్దారు, వరికుంటపాడు



కలెక్టర్‌ను కలిసిన సర్పంచు, జేఏసీ నాయకులు

అనుమతులు రద్దు చేయండి

● కలెక్టర్‌కు గ్రామస్థుల విజ్ఞప్తి

వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ పరిధిలోని కొండ ప్రాంతంలో మంజూరు చేసిన మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం సర్పంచ్ దిలీప్‌కుమారు గ్రామస్థులతో కలిసి నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. తమ ప్రాంతంలో తవ్వకాలు జరిగితే జంగంరెడ్డిపల్లి వాసులతోపాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని విన్నవించారు. పంచాయతీ తీర్మానాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ప్రజాభిప్రాయ సేకరణకు ముందుగా ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా సబ్ కలెక్టర్ మాత్రం వ్యాపారులకు అనుకూలంగా మాట్లాడటం బాధాకరమన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు ఆంధ్రా పరంధామిరెడ్డి, షేక్ పీరయ్య, బాలచంద్ర, మనోహర్ తదితరులు ఉన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు భూముల పరిశీలన

కలిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరు పంచాయతీ పరిధిలో సోమవారం పరిశ్రమల ఏర్పాటుకు భూములను ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ శివప్రసాద్, తహసీల్దారు గిరీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ మండలంలో పెదకొండూరు ప్రాంతంలో సుమారు 400 ఎకరాలు ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి భూముల పరిశీలించామ న్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లీలాసుధి, సర్వేయరు ఎస్‌కే సోని, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

నేడు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాక

కావలి, జూలై 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం కావలి నియోజకవర్గంలోని కావలి, బోగోలు మండలాల్లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలతో కలిసి మంత్రి కావలి మండలంలోని తుమ్మలపెంట, ఒట్టూరు గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాలలో పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం బోగోలు మండలంలోని జువ్వలదిన్నెలో జలజీవన్‌మిషన్ పనులను ప్రారంభించి అనంతరం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి అక్కడ మత్స్యకారులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షలకు సిద్ధం చేయండి

● డిప్యూటీ ఈవో నరసింహారావు

కొండాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని కందుకూరు డిప్యూటీ ఈవో పీపీ.నరసింహారావు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆనయ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పరిశీలించి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ గురించి ప్రధానోపాధ్యాయుడు వీవీ.రమణను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు గణితంలో పాఠ్యాంశాన్ని ఆయన బోధించారు.

నిర్బంధాలతో ప్రజా పోరాటాలు ఆపలేరు

కావలి(టౌన్), జూలై 28(ఆంధ్రజ్యోతి) : నిర్బంధాలతో ప్రజా పోరాటాలు ఆపలేరని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెంచలయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఉలవపాడు మండలం కరేడు వద్ద విలువైన పంట భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం రైతులను నిర్బంధాలపాలు చేయడం, అక్రమ కేసులు పెట్టడం, భయాందోళలకు గురిచేసి బలవంతంగా భూములు లాక్కోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. కరేడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి భూములు బలవంతంగా లాక్కుంటే వారి జీవనాధారం లాక్కున్నట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ముగ్గురు గిరిజన మహిళలపై కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించడం భూపోరాటాలకు అండగా నిలబడ్డ జీవీబీ కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులోనే పాలన ఇంత దారుణంగా ఉంటే మిగిలిన అడుగుల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారబోతుందని, ప్రజలు ప్రభుత్వ కుట్రలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

228 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 475 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీ ప్రతినిధులు పాల్గొని 247 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-210, ఆర్‌ఆర్-3, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 228 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.209.63గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

బిట్రగుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కృషి చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం నుంచి పెద్దస్థాయిలో నిధులు మంజూరు చేయించారన్నారు. మంగళవారం మంత్రి కొల్లు రవీంద్ర చేత జువ్వలదిన్నెలో రూ.1.45 కోట్లతో జల జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన చేయిస్తున్నారన్నారు. ఫిషింగ్ హార్బర్ పరిశీలన, గంగపుత్రులతో సమావేశ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

విద్యార్థులకు సమదుస్తుల పంపిణీ

కొండాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిమూర్తిపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం యూనిఫాం పంపిణీ చేశారు. అయితే ఆ దుస్తులు కుట్టించేందుకు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చిమ్మిలి శ్రీనివాసులు రూ.12 వేల వితరణ చేశారు. తమ పిల్లలకు సహకారం అందించడంపై తల్లిదండ్రులు చైర్మన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుర్రం మాల్యాద్రి, అంగన్‌వాడీ కార్యకర్త తుమ్మల మహేశ్వరి, రాపూరి రత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు.

రీసర్వేలో సమస్యలు తీర్చరా?


గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

- అవసరంలేకున్నా హక్కుపత్రాలు చూపాలని మెలిక
- రైతుల సమస్యలు పట్టించుకోని అధికారులు
- నేతలు చెబితేనే అరకొరగా పరిష్కారం
- సర్వే నెంబర్లు మారిపోయి రిజిస్ట్రేషన్‌కు తంటాలు

'రీసర్వేలో అధికారులు భూసమస్యలు పరిష్కరించరా...? సమస్యలు సృష్టించిందివారే... కానీ తప్పు చేసినట్టుగా మమ్మల్ని కారకులుగా చూస్తున్నారు... అవసరం లేకున్నా భూహక్కుప్రతాలను చూపాలని మెలిక పెడుతున్నారు... మేము అడగకపోయినా వచ్చి రీసర్వే చేశారు. భూరికార్డుల పొరపాట్లను సరిదిద్దకుండా రీసర్వే ఎందుకు'... అని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేను అధికారులు సమగ్రంగా చేయకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమయ్యా యి. ఈ సమస్యలకు నేటి రాష్ట్ర ప్రభుత్వంలోనైనా పరిష్కారం దొరుకుతుందని భావించిన రైతాంగానికి నిరాశే ఎదురవుతోంది.

అల్లూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో ఒకరి భూమి మరొకరి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబరుతో నమోదైన సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. వీటిని పరిష్కరించుకోవాలంటే రెవెన్యూ కార్యాలయాల్లోని తహసీల్దారు, ఆర్‌ఐ, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారణ జరిపి, ఎవరి భూమిని వారి పేరుతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. కానీ ఇందుకు రెవెన్యూ అధికారులు పెడుతున్న మెలికలతో రైతులు లబోదిబోమంటున్నారు.

పాత రికార్డులు కావాలంటూ...

రీసర్వే ప్రారంభంలో దాదాపు 70 శాతం రైతుల వద్ద తమ భూములకు చెందిన రికార్డులు సరిగా లేవు. దీంతో రీసర్వే చేపట్టి వారికి శాశ్వత హక్కును కల్పించే దిశగా గత ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టింది. రీసర్వే సమయంలో రికార్డులు అవసరం లేకుండానే అనుభవదారుడిని పట్టాదారుడిగా నమోదు చేస్తూ ఎల్‌పీఎం నెంబరును కేటాయించి వెబ్‌ల్యాండ్‌లో 1-బీ, అడంగళ్లను మంజూరు చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ ప్రక్రియ చేపట్టే సమయంలో భూరికార్డులు లేకపోయినా కేవలం అగ్రిమెంట్లు ఆధారంగా పూర్తి చేసిన అధికారులు సమస్యలను సృష్టించి వెళ్లిపోయారు. జరిగిన పొరపాట్లను గ్రామసభలు పెట్టి పరిష్కరిస్తామని చెప్పిన నాటి అధికారులు వాటిని తూతూమంత్రంగా నిర్వహించారు. నేడు ఆ సమస్యలను పరిష్కరించమని రైతులు అధికారులను సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకుని రమ్మంటూ మెలిక పెడుతున్నారు. రీసర్వే చేసేటప్పుడు అవసరం లేని రికార్డులు ఇప్పుడు ఎందుకు అవసరమైందంటూ రైతులు విమర్శిస్తున్నారు.

నేతలు చెప్తేనే..

రీసర్వేలో ఏర్పడిన సమస్యలను నాయకుల దృష్టికి, లేదా ఆ ప్రాంత ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తేనే అరకొర సమస్యలు మాత్రమే పరిష్కారమవుతున్నాయి. కొంతకాలంగా మండలంలో ఈ సమస్యలు ఉన్నా, స్థానిక నాయకుల చొరవతో కొన్ని సమస్యలు తీరాయి. మరికొన్ని సమస్యలు అలానే ఉండిపోయాయి. రైతులు చేసేది లేక ఇటీవల అల్లూరులో సమావేశం నిర్వహించిన కావలి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఈ సమస్యలను వెంటనే పరిష్కరించమని ఆయన అధికారులను ఆదేశించారు.

రీసర్వేపై స్పష్టత లేదు



ఇనాం గ్రామాలను రీసర్వే చేయకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఇనాం గ్రామాల్లో రికార్డులు సరిలేక భూములు రిజిస్ట్రేషన్లకు నోచుకోవడంలేదు. ఆర్‌ఎస్‌ఆర్ (డైగ్లాట్) లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. రీసర్వే చేస్తే శాశ్వత రికార్డు ఏర్పడుతుందని భావిస్తున్నాం.

\- పోలిశెట్టి శ్రీనివాసులు, ఉలవపాళ్ల, దగదర్తి మండలం

రైతులను ఆదుకోవాలి



రీసర్వేలో తలెత్తిన సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకరి భూ రికార్డులు మరొకరి పేరుతో నమోదవడంతో సమస్యలు జఠిలంగా మారుతున్నాయి. సమస్యలు ఏర్పడకుండా ఉండాలంటే వాటిని వెంటనే సరిదిద్ది పరిష్కరించాలి.

\-ఆట తిరుమల, సర్పంచి, పడమర గోగులపలి

రీసర్వే చేపట్టాలి



జిల్లాలో అనేక గ్రామాల్లో రీసర్వే చేపట్టలేదు. రీసర్వే చేపడతామని అధికారులు పేర్కొన్నారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. ఒక్క మూడు ప్రధాన గ్రామాలకు ఎప్పుడు రీసర్వే చేపడతారో తెలియడం లేదు.

\-యరటపల్లి శేఖర్‌రెడ్డి,రైతు, అల్లూరు

దళితుల భూ సమస్యలు పరిష్కరించాలి

● తహసీల్దారుకు వినతి


తహసీల్దారుకు అర్జీ అందజేస్తున్న దళిత నేత మల్లి

బిట్రగుంట, జూలై 28(ఆంధ్రజ్యోతి): దళితుల భూములను పెత్తనపు దారులు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో బోగోలు మండల తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డికి దళిత మహిళ కేశవరప కుమారమ్మకు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ అందచేశారు. నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డి పాలెంలోని సర్వే నంబరు 333లో గల కుమారమ్మకు సంబంధించిన భూమిని సుబ్బరామిరెడ్డి అనే వ్యక్తి ఆక్రమించుకు న్నాడని తెలిపారు. కుమారమ్మ ఎవరికి అమ్మలేదని ఉపాధికోసం చెన్నై వెళ్లిందన్నారు. ఈ క్రమంలో ఆమె భూమిని ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఆ భూస్వామిపై చట్టపర మైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. అలాగే మండలంలో అనేకచోట్ల దళిత, గిరిజనులకు సంబంధించిన భూములతో పాటు ప్రభుత్వ భూములు ఆక్రమణ లకు గురయ్యాయని, వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట నాయకులు జెడ్డా వాసు, ఆత్మకూరు తేజ తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే

'సుపరిపాలనలో తొలిఅడుగు'

● ఎమ్మెల్సీ బీద రవిచంద్ర


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

అల్లూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన సందర్భంగా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. మండలంలోని ఇందుపూరు, పురిణి గ్రామాల్లో సోమవారం ఆయన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలసి పర్యటించారు. పలు ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, ఇందుపూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశానుసారం కింది స్థాయి నాయకుల నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు ప్రతి నాయకుడు, ప్రతి ప్రజాప్రతినిధి క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఇందుపూరు గ్రామ సచివాలయ నిర్మాణానికి సహకరించి స్థలాన్ని దానం చేసిన వసంత్ కుమార్‌ను అభినందించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. పేదల అభ్యున్నతికి పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గ్రామాల్లో ఉండే ప్రతి సమస్యను పరిష్కరించేందుకే తామంతా ప్రజలతో మమేకమవుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను స్థానిక నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి వారి తెలుసుకొని సంబంధిత యాప్‌లలో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఎందేటి హరికృష్ణ, అంబటి రాజేంద్ర, పాపనబోయిన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


ఎమ్మెల్యే నాగేశ్వరరావును సన్మానిస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

వలేటివారిపాలెం, జూలై 28(ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి చేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి గుత్తా మధుబాబు రూ.3.50 లక్షలతో నిర్మించిన సభావేదికను ఎమ్మెల్యే నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. అనంతరం హైస్కూల్ హెచ్‌ఎం కమల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో పెను మార్పులకు మంత్రి లోకేషబాబు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మధుబాబును ఆదర్శంగా తీసుకొని సేవాభావంతో పాఠశాలల అభివృద్ధికి దోహదపడాలని చెప్పారు. సభావేదిక నిర్మాణానికి పాటుపడిన మధుబాబుతో పాటు ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు, నాయకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నరసింహారావు, దాత గుత్తా నరసింహం, న్యాయవాది వలేటి శ్రీధర్‌నాయుడు, ఎంఈవో మల్లికార్జునరావు, ఎంపీడీవో నరేంద్రదేవ్, ఆర్‌ఐ ప్రసాద్, వైద్యాధికారి శివసిద్ధప్ప, ఎస్‌ఐ మరిదినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెంలోని ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. నాయకులు వలేటి శ్రీధర్‌నాయుడు, వలేటి నరసింహం, కాకుమాను ఆంజనేయులు, గుత్తా మహేశ్వరరావు, కాకుమాను మాల్యాద్రి. వలేటి మధుసూదన్‌రావు, కొంకా రమేష్, సాధు శ్రీలత, వీరమోసు అంజయ్య, గుత్తా కొండయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్


మహిళలకు కరపత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించేందుకు కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం రూపొందించిందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని కొమ్మి పంచాయతీ రామానుజపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం పనితీరును అడిగి తెలుసుకొని ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబునాయుడు, బొట్లగుంట హరిబాబు, దామా మహేశ్వరావు, పోలినేని రమేష్, దాసరి అశోక్, అంబటి రాంబాబు, ఆకుల వెంకటేశ్వర్లు, కుంకు మోహనరావు, గద్దె రాఘయ్య, తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ నేతలకు పరామర్శ

రామానుజపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆకుల చిన మాలకొండయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న కాకర్ల ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే గ్రామంలో ఇటీవల మరణించిన టీడీపీ నాయకుడు ఉన్నం హజరత్తయ్య ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ


జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కందుకూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించిన 10వ ఓపెన్ తైక్వాండో జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించారని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ అబ్దుల్‌సలాం తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో ఏపీ చాంపియన్‌షిప్ సాధించటంలో జిల్లా క్రీడాకారులు ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ పథకాలు పొదుపు మహిళలకు చేరాలి

కావలి రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను స్వయం సహాయక సంఘాల మహిళలకు చేరువ చెయ్యాలని వెలుగు ఏపీఎం పీవీ. కృష్ణారావు పేర్కొన్నారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు థెరిసా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో ప్రకారం అన్ని శాఖల్లో ఉన్న స్కీములు, సంక్షేమ పథకాలను స్వయం సహాయక సంఘాల మహిళలకు చేరువ చేసి ఎక్కువ మంది లబ్ధిపొందేలా చూడాలన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార సుద్ధి పరిశ్రమల పథకం ద్వారా 5 యూనిట్లును మండల సమాఖ్య ద్వారా సమీకరించడం జరిగిదన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ డీ.రాజు, సీసీలు ఎస్‌కె రసూల్, బీవీ. ప్రసాద్ బాబు, శివయ్య, చిరంజీవి, మాల్యాద్రి, అకౌంటెంట్ నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ


పాత, కొత్త తహసీల్దార్లను సన్మానించిన ఉద్యోగులు

లింగసముద్రం, జూలై 28(ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దారుగా నియమితులైన ఎం. కోటేశ్వరరావు ఎట్టకేలకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు బదిలీ అయిన తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలిపారు. కొండాపురం తహసీల్దారు కోటేశ్వరరావును లింగసముద్రంకు, ఇక్కడి తహసీల్దారు సీతామహాలక్ష్మిని కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా గత నెల 9వ తేదీన జిల్లా కలెక్టర్ బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరిస్తానన్నారు. కాగా పలువురు టీడీపీ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లింగసముద్రం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావు, ఇక్కడ పనిచేస్తూ బదిలీ అయిన తహసీల్దారు సీతామహాలక్ష్మిని కార్యాలయంలో అధికారులు, వీఆర్‌వోలు, సర్వేయర్లు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు సహించం

● జలదంకి మండల టీడీపీ నేతలు


మాట్లాడుతున్న జలదంకి మండల టీడీపీ నేతలు

కావలి, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని, అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని జలదంకి మండల టీడీపీ నేతలు హెచ్చరించారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో జలదంకి మండల టీడీపీ కన్వీనర్ పులుగుంట మధుసూదనరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు పూనూరు భాస్కరరెడ్డి, సీనియర్‌నేత కరియావుల అప్పలనాయుడు మాట్లాడారు. జలదంకి మండలం గట్టుపల్లి రెవెన్యూ పరిధిలోని 98 ఎకరాల మామిడితోటను ఉత్తరాదికి చెందిన సదాశివరావు, తలశిల నరసింహారావు కొన్నారన్నారు. దానిలో 88 ఎకరాలు సదాశివరావు పేరు మీద, మిగిలినది తలశిల నరసింహారావు పేరుమీద ఉన్నట్లు తెలిపారు. అయితే దానిలో 30 ఎకరాలు తలశిల నరసింహారావు పేరుమీద అగ్రిమెంట్ రాసి ఉందని ఈవిషయంపై వారిద్దరి మధ్య భూవివాదాలు ఉన్నాయని చెప్పారు. ఆ తోటలో మామిడి పంటను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోయించాడని సదాశివరావు నిందారోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఎన్‌ఆర్‌ఐగా ఉంటూ ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన కాకర్ల సురేష్ సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాల చేపడుతున్నరని, అలాంటి ఆయనకు మామిడికాయలు కోయించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. మామడితోటలో వివాదం ఉంటే ఇరువురు తేల్చుకోవాలి కానీ ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సదాశివరావు వెనుక వైసీపీ నేతలు ఉండి మాట్లాడిస్తున్నారని వారికి కూడా తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఆత్మీయ సన్మానం


ఉపాధ్యాయుడును సన్మానిస్తున్న టీచర్లు

ఉలవపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోట వైసంఘంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై అలగాయపాలెం జడ్పీహెచ్ పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు బీ.కోటేశ్వరరావును సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ-2 పీవీ రమణయ్య, కరేడు క్లస్టరు హెడ్‌మాస్టర్ పీ.శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ వైస్‌చైర్మన్ శిరీష, మాజీ చెర్మన్ మహేష్, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భళారే.. కుంకుడాకుపై సినారె!



'కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా వుడుతుంది?' అని ప్రపంచ పదుల్లో సినారె ప్రశ్నించినట్లుగానే.. చిత్రకారుడి కుంచె కూడా కొన్ని చిత్రాలను గీస్తున్నప్పుడు తీవ్రమైన సంఘర్షణకు లోనవుతుంది. కానీ.. 'సినారె' చిత్రాన్ని గీసేటప్పుడు మాత్రం.. ఆయన చేతిలోని 'కుంచె' కూడా.. అచ్చం.. 'చరణ కింకిణులు ఘల్లు ఘల్లు' మనేలా నవ్య భావోద్వేగానికి గురై ఉంటుం దేమో. ఆనంద తాండవం ఆడి ఉంటుందేమో! నిజమే.. 'కాదేదీ కవితకు అనర్హం..' అన్నట్లు మంచి చిత్రం గీయాలన్న ఆసక్తి.. ప్రతిభ ఉండాలే కానీ.. ఏ వస్తువుపైన గీసినా సరే.. చిత్రకారుడి కుంచె ఇట్టే ఒదిగిపోతుంది. అందుకు నిదర్శనమే.. కుంకుడాకుపై విశ్రాంత చిత్రకళోపాధ్యా యుడు పచ్చా పెంచలయ్య గీసిన 'సినారె' చిత్రం. ప్రముఖ సినీ గేయ రచ యిత, జ్ఞానపీఠ అవార్డుగ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) జయంతిని పురస్కరించుకుని ఇలా తన కుంచెతో 'చిత్ర' నివాళులర్పించారాయన. పొదలకూరు మండలపరిధిలోని మహమ్మదాపురం గ్రామానికి చెందిన ఈ డ్రాయింగ్ మాస్టారుకు సినారె కలం నుంచి జాలువారిన సినిమా పాటలన్నా... కవిత్వమన్నా చాలా ఇష్టం. అందుకే ఆయన చిత్రాన్ని విభిన్నంగా కుంకుడు ఆకుపై కళాత్మకంగా చిత్రించడం విశేషం. ఈ సూక్ష్మ కళా చిత్రాన్ని చూసిన వారు.. 'భళారే.. కుంకుడాకుపై సినారె!' అంటూ పెంచలయ్య చిత్ర కళా ప్రతిభను అభినందించారు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

చెన్నై మెమూను నాయుడుపేట వరకు పొడిగించండి

● ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే ఈఎంయూ రైలు సేవలను నాయుడుపేట వరకు పొడిగించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు.

● సామర్థ్యాల పెంపునకు తీసుకుంటున్న చర్యలేంటి

విద్యార్థుల్లో ఉపాధి సామర్థ్యాలను పెంచేందుకు తీసుకుంటున్న చర్య లను వివరించాలని సోమవారం లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి సమాధానమిస్తూ విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని మెరుగు పరచడానికి అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ, డిప్లమో కార్యక్రమాలను కేంద్రం ప్రకటించిందన్నారు.



జాతీయ రహదారిపై ప్రారంభమైన బసినేనిపల్లి టోల్‌ప్లాజా

బసినేనిపల్లి టోల్‌ప్లాజా ప్రారంభం

సీతారామపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 167 బిజి బసినేనిపల్లి టోల్‌ప్లాజా సోమవారం పారంభమైంది. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా నిర్వాహకులు వాహనదారులకు స్వీట్లు పంచి పెట్టి స్వాగతం పలికారు. సీతారామపురం నుంచి దుత్తలూరు మీదుగా ఏర్పాటుచేసిన ఈ జాతీయ రహదారికి బసినేనిపల్లి టోల్ వసూళ్లకు కేంద్రం కానుంది.

ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో నగేష్ కుమారి తెలి పారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 1 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్ల స్వీకరిస్తామన్నారు. 2న సాయంత్రం వరకు నామినేషన్ల పరిశీలన, తిరస్కరించిన నామి నేషన్లపై అప్పీళ్లు, 4న తిరస్కరించిన వాటిని పరిష్కరిస్తామన్నారు. 5న నామినేషన్ల ఉప సంహరణ, పోటీదారుల తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. 12న ఉదయం 7 నుంచి సాయం త్రం 5 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. 13న అవసరమైతే రీపోలింగ్ జరుగుతుందన్నారు. 14న ఉద యం 8 నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిపి, అదే రోజున ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తా మన్నారు. పంచాయతీ డీఈ మోహన్ రావు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగాను, తహసీల్దారు, ఎంపీడీవో అదనపు రిటర్నింగ్ అధికారులుగాను వ్యవహరిస్తారన్నారు.

పీ-4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అన్నీ శాఖల అధికారులు తమవంతు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో పీ-4లో భాగంగా బంగారు కుటుంబాలు, మార్గదర్శిల ఎంపికపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "జిల్లాస్థాయి అధికారులంతా తమ శాఖల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 10వేలకుపైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలు ముందుకువచ్చారన్నారు. అన్నీ శాఖల అధికారులు బంగారు కుటుంబాలను ఎంపిక చేసి మార్గదర్శిలు దత్తత తీసుకునేలా కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో నరసింహారావు, జడ్పీ సీఈవో మోహన్‌రాజు, హౌసింగ్ పీడీ వేణుగోపాలత్, డ్వామా పీడీ గంగాభవానీ, తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు అందుబాటులో ఉండాలి

వివిధ శాఖల మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్ శంకరన్‌హాల్ నుంచి వివిధ అంశాలపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం, అన్నదాన సుఖీభవ తదితర పథకాలను అర్హులకు అందజేయడానికి వీలుగా, జాయింట్ ఎల్పీఎంలను త్వరగా సబ్ డివిజన్ చేయాలని ఆదేశించారు. అవసరమైనచోట ఆధార్ డీ లింకింగ్‌ను కూడా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలను క్వాలిటీతో పూర్తి చేస్తేనే బిల్లులు చెల్లిస్తామని సంబం ధిత కాంట్రాక్టర్లకు తెలియజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కే. కార్తీక్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగో పాల్, గంగాభ వానీ, డీఈవో బాలాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 105 ఫిర్యాదులు

నెల్లూరు (క్రైం), జూలై 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి జిల్లావ్యాప్తంగా 105 మంది ఫిర్యాదుదారులు తరలి వచ్చారు. వారి వారి సమస్యలను అధికా రులకు విన్నవించుకున్నారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్య బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీక రించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదు లపై త్వరితగతిన స్పందించి పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ కే. సీహెచ్ రామా రావు, డీటీపీ సీఐ ఎం. నాగేశ్వరమ్మ, పీసీఆర్ పీ. భక్తవత్సలరెడ్డి, ఎస్బీ సీఐ శ్రీనివాసరెడ్డి అర్జీలను స్వీకరించారు.

● జలదంకికి చెందిన ఓ వ్యక్తికి బిట్రగుంటకు చెందిన చైతన్యకుమార్ పరిచయమ య్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.80 లక్షలు నగదు తీసుకున్నాడు. అ ఉద్యోగం ఇప్పించ కుండా, నగదు తిరిగి ఇవ్వ కుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

● ఉదయగిరికి చెందిన ఓ మహిళను అదే ప్రాంతా నికి చెందిన విష్ణు వర్ధన్ ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. చివరికి తమ ఇంట్లో వారు ఒప్పుకోవం లేదని పెళ్లికి నిరాకరించాడు. ఈ విషయమై విచారించి న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

● నగరంలోని నవాబుపేటకి చెందిన ఓ మహిళకు గుంటూరు జిల్లా గురజాలకు చెందిన షేక్ జానీబాషతో పరిచయం ఏర్పడుతుంది. జానీబాషా నగరంలోని ఓ బ్యాంకులో పనిచేస్తున్నట్లుగా చెప్పి, రుణం ఇప్పిస్తానని నమ్మించి ఆమె వద్ద నుంచి ఇంటి కాగితాలు, రూ.3 లక్షల నగదు తీసుకున్నాడు. రుణం ఇప్పించకుండా, తీసుకున్న నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అలసత్వం వహిస్తే సహించేది లేదు

● పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) జూలై 28 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించబోమని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాం గణంలోని తిక్కనభవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిచి సమస్య లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ శాఖ కూడా ఫిర్యాదులకు సంబంధించిన ఆడిట్ నిర్వహించాల న్నారు. కొన్ని శాఖలు అర్జీల పరిష్కారంలో వెనుకంజలో ఉన్నాయని తెలిపారు.

● రెవెన్యూదే అగ్రస్థానం

ఈ కార్యక్రమానికి మొత్తం 450 అర్జీలు రాగా, అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి 160 ఉన్నాయి. సర్వే, ల్యాండ్ రికార్డ్సుకు 52, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు 32, పంచాయతీరాజ్‌కు 36, స్కూల్ ఎడ్యుకేష న్‌కు 25, పోలీస్ శాఖకు 43 వినతులు వచ్చాయి. మిగిలినవి వివిధ శాఖ లకు సంబంధించినవి. అర్జీల స్వీకరణలో జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీ గింజను కొనుగోలు చేయాలి

ఎడగారులో పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని టీడీపీ జిల్లా, రాష్ట్ర రైతు సంఘం నాయకులు సోమవారం కలె క్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రనేత రావూరు రాధాకృష్ణమనాయుడు మాట్లాడుతూ ఎంటీయూ 1010 వరి ధాన్యాన్ని సివిల్ సప్లై అధికారులు కొనుగోలు చేయమని ప్రకటించారన్నారు. జిల్లాలో ఎక్కువగా ఆ రకాన్ని పండించారని తెలిపారు. ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● నగరంలోని 17వ డివిజన్ పరిధి కార్పొరేషన్ పార్కు స్థలంలో ఎంకేలే అవుట్‌వారు ప్లాట్లు వేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కటకం చైతన్య జేసీకి నతిపత్రం సమర్పించారు.

బోధనలో కొత్తదనానికి ఉపాధ్యాయులకు కరదీపికలు

జిల్లాలోని పాఠశాలలకు పంపిణీ



నెల్లూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యా వస్థలో మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఉపాధ్యాయులకు కరదీపిక(టీచర్ హ్యాండ్ బుక్స్)లను ప్రవేశపెట్టింది. ఎస్ఈఆర్టీ సహకారంలో సమగ్రశిక్ష ద్వారా సామర్థ్య ఆధారిత బోధన, అభ్యాస న ఉపాధ్యాయ వనరు పేరుతో వీటిని రూపొందించా రు. బోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించేలా, మూస వి ధానానికి తిలోదకాలిచ్చేలా ఇవి రూపుదిద్దుకున్నాయి. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వీటిని పంపిణీ చేశారు.

● మంచి ఫలితాలు సాధించేలా...

విద్యార్థులకు నాణ్యమైన విద్యాప్రమాణాలను అందించడంతోపాటు పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా విద్యారంగంలో మార్పులు చేపడుతున్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని 1 నుంచి 10వతరగతి వరకు బోధన అందించే టీచర్లకు ఉపాధ్యాయుల కరదీపికలను అందించారు.వీటితోపాటు నైపుణ్యం పెరగడం, ప్రశ్నపత్రాలను సులభంగా తయారు చేసుకోవడం కూడా సులవవుతుందన్నారు. అలాగే ఈ బుక్‌ను అకడమిక్ క్యాలెండర్‌లోని పనిదినాలతో అనుసంధానం చేశారు. ఏ రోజు ఏ చాప్టర్, ఏ టాపిక్ ఎలా చెప్పాలో తేదీలతో సహా పొందుపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఒక రోజు ఒకే పాఠం బోధనలో ఉంటుంది. పాఠం పూర్తయిన తరువాత ప్రతి పీరియడ్‌లో బోధనా సమయం, ఉపయోగించిన టీఎల్ఎం, అభ్యసన కృత్యాలు, రిమార్కులను ఉపాధ్యాయులు కరదీపిలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆయా తరగతుల్లో సబ్జెక్టుకు సంబంధించి ఓ పుస్తకం ఉండే ఈ పుస్తకాలను తొలుత ఉపాధ్యాయులు క్షుణ్ణంగా చదవాల్సి ఉంటుంది. దీనిద్వారా పిల్లలకు సులభతరంగా బోధన అందించేందుకు, నోట్స్ తయారు చేసుకునేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు.

కామాక్షితాయి అన్నదాన సదనానికి రూ.10 లక్షల విరాళం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలం లోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆల య నిత్యాన్నదాన సదనానికి చెన్నై నగరంలోని ముగ లివాకం వాస్తవ్యులు కే. మల్లికార్జున, ప్రభావతి దంపతులు సోమవారం రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డిని కలిసి వారు చెక్కును అం దజేశారు. దాతలు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వా మి, అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారికి తీర్థప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలను ఆలయ అధికారులు అందజేశారు.



ఈవో శ్రీనివాసులురెడ్డికి చెక్కు అందజేస్తున్న దాతలు మల్లికార్జున, ప్రభావతి దంపతులు

కనీస వేతనం కోసం వీఆర్ఏల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

నెల్లూరు (వైద్యం) జూలై 28 (ఆంధ్రజ్యోతి) : తమకు కనీసం రూ. 26వేలు ఇవ్వాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం వీఆర్ఏల సంఘం నాయకులు నగరం లోని వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహిం చారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ఏనిమిది ఏళ్లుగా వీఆర్ఏలకు ఒక్క రూపాయి కూడా వేతనం పెరగ లేదన్నారు. తెలంగాణాలో వీఆర్ఏలను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు పెంచిందన్నారు. రాష్ట్రంలో నామినీలుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం నేటికి గుర్తించడం లేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరిం చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనర్సయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లచ్చయ్య, ఓబులేసు, నాయకులు సుబ్బయ్య, సుధాకర్, అమీర్, శ్రీనివాసులు తదితరు లు పాల్గొన్నారు.

ప్రతీ ఎకరా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి : డీఏవో

నెల్లూరు (వ్యవసాయం), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగవుతున్న పంటలకు సం బంధించి ప్రతీ ఎకరాను ఈ-క్రాప్‌లో నమోదు చేయా లని జిల్లా వ్యవసాయాధి కారి(డీఏవో) పీ.సత్య వాణి అధికారులను ఆదేశిం చారు. జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ)లో సోమవారం ఆత్మ ఆధ్వర్యంలో ఖరీఫ్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హత లభించిన కొంత మందికి బ్యాంకు ఎన్‌పీసీఐ లింకు కాలేదని, వారంతా త్వరితగతిన లింకు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా వ్యవసాయ యాంత్రీకరణ, క్రాప్ ఇన్సూరెన్సు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ తదితర అంశాలపై ఆమె సూచనలు ఇచ్చారు. అనంతరం ఆత్మ పరిధిలో శిక్షణలు, ప్రదర్శన క్షేత్రాలు, విజ్ఞాన యాత్రలు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతు క్షేత్ర పాఠశాలలు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, కిసాన్‌మేళా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆత్మ డీపీడీ మురళి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త వినీత, మత్స్యశాఖ అధికారి చాంద్‌బాషా, సెరీకల్చర్ అధికారి సత్యనారాయణ, ఉద్యానశాఖ అధికారి అనురాధ, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి

బస్సు ఢీకొని యువకుడి మృతి

కావలి రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అనా రోగ్యానికి గురైన తన సోదరికి మందులు తీసుకు వెళుతున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై తిరిగి రాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘట న కావలి మండలం చెంచుగాని పాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... ముసునూరు అరుంధతీయవాడకు చెందిన పోతి పోక రవి(38) బీటెక్ పూర్తి చేసినా సెంట్రింగ్ పనులకు వెళ్తూ కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గౌరవ రంలో ఉంటున్న తన అక్క బుజ్జ మ్మకు వాంతులు, విరోచనాలు అవుతుండడంతో మందులు, కొబ్బ రినీరు తెమ్మని రవికి సమాచారం ఇచ్చింది. దీంతో మందులు తీసు కుని మోటారు బైక్‌పై గౌరవరం బయలుదేరాడు. చెంచుగానిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలో బెంగళూరు వెళ్తున్న ట్రావెల్ బస్సు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌తో సహా రవి బస్సు కింద ఇరుక్కు పోయి అక్కడికక్కడే మృతి చెందా డు. ఎస్ఐ తిరుమలరెడ్డి సంఘ టనా స్థలాన్ని పరిశీలిం మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

2, 3 తేదీలో మెగా జాబ్‌మేళా



అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి

ఆత్మకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత మైన ఆత్మకూరు నియోజక వర్గంలోని నిరుద్యోగ యువ తకు ఉపాధి, ఉద్యోగ అవకా శాలు కల్పించడమే లక్ష్యంగా ఆగస్టు 2, 3 తేదీల్లో ఆత్మ కూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వ హిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఆంధ్ర ఇంజ నీరింగ్ కళాశాలలో సోమ వారం సాయంత్రం ఆయన మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, నిర్వహణ బాధ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్, నారాయణ సహకా రంతో నిర్వహించనున్న జాబ్‌మేళాను ఆత్మకూరు నియోజకవర్గంలో ఐటిఐ, పాలిటె క్నిక్, ఇంజ నీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యను అభ్యసిం చిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసు కునేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

● చేజర్ల మండలం కోటితీర్థం శివాలయంలో మంత్రి ఆనం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పుకంభంపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూ.3 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. స్థానిక గిరిజన కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకుని, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు గిరినాయుడు, కొమ్ము పార్థసారథి, షేక్ సిరాదుద్దీన్, శ్రీనివాసులునాయుడు, కొమ్మి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పుచేసి వంటలు...!

● మధ్యాహ్న భోజనానికి అందని బిల్లులు
● జూనియర్ కళాశాలల్లో నిర్వాహకుల అవస్థలు

ఉదయగిరి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే పనిలేకుండా కళాశాలలోనే నాణ్యమైన ఆహారాన్ని అందిం చాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జనవరి నుంచి అమలు చేసింది. అప్పటి నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వంట చేయాల్సిన దుస్థితి నెలకొందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 25 జూనియర్ కళాశాలల్లో..

జిల్లాలో 25 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 51,854 మంది విద్యార్థులు చదువుకుంటు న్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సమీపంలో ఉన్న నిర్వాహకులు వంట చేస్తున్నారు. అయితే వారికి జనవరి నుంచి ఇప్పటి వరకు కూరగాయలు, పప్పులు, కట్టెలు, గ్యాస్, ఇతర సామగ్రికి సుమారు రూ.2 కోట్ల వరకు బిల్లులు బకాయిలు ఉన్నాయి. అలాగే నిర్వాహకుడికి, సహాయకునికి ఒక్కొక్కరికి నెలకు రూ. 3వేల చొప్పున వేతనాలు చెల్లిస్తారు. ఆ వేతన బకాయిలు సైతం రూ.లక్షల్లో పేరు కుపోయాయి. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని స్థితిలో నిర్వాహకులు ఉన్నారు. పలుమార్లు ఉన్నతాధి కారులను సంప్రదించినా బిల్లులు వస్తాయి.. వంట చేయండని సూచిస్తున్నారే తప్ప చేయూతనందించ డంలేదని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు.

● నిర్వహణ భారం

ఒకవైపు పాఠశాల, మరోవైపు కళాశాలలో మధ్యాహ్న భోజనానికి వంట చేయడం భారంగా మారిందని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు. 9, 10వ తరగతులు, ఇంటర్ విద్యార్థులకు ప్రస్తుతం రోజుకు రూ.8.57 ప్రభుత్వం చెల్లిస్తుంది. నిత్యావసర సరుకులు, కూరగా యల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దుకాణాల్లో నెలవారీ ఖాతా లు పెట్టి సరుకులు తెస్తున్నాం. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో అప్పులు చేసి వ్యాపారులకు నగదు చెల్లించి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● త్వరలో బిల్లులు విడుదలవుతాయి

ప్రభుత్వ కళా శాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకా నికి సంబంధించి బిల్లులు మంజూరు కాని విషయం వాస్తవమే. ఈవిష యాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. త్వరలో నిర్వా హకుల ఖాతాకు నగదు జమ చేస్తామని చెప్పారు.

- వరప్రసాద్‌రావు, ఆర్ఐవో, నెల్లూరు



ఉదయగిరి జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కోసం క్యూలో ఉన్న విద్యార్థినులు